

10-1981

సమస్త చందాదారులారా ఏకంకండు!

నమస్తే, హల్లో, సలాగారో, మేషారా, హాయ్ బాబూ...

మాకు జ్యోతంటే ప్రేమనే మీపై అధికారులు (శ్రీమతులతో సహా) మిమ్మల్ని మెచ్చుకుంటారు... ఎంచేతంటే యీ **జ్యోతి** నందు యువ్వనగుళిక లాంటి సీరియల్స్, మీ మేధస్సుని పెంచే- శీర్షికలు, మీ జీవితాంగలని ఋజువుపరిచి మెరుగుపరిచే కథలు, గేయాలు, మినీకథలు, టాక్సున జోకులు- రంగురంగుల వలపుతలపుల ప్రేమ అనుభవశరపరంపరల నవలలు- ఇన్ని...!

అసలింతకే మీకు మిగిలే లాభం= ఆనందం+20 రూపాయలూ!

అంటే ఈ మన యొక్క '**జ్యోతి**' దీపావళి ప్రత్యేక సంచికలో సహానే మొ- సంవత్సర చందా 60 రూ.లు. అదే నేమో 40 రూ.లకే నెలనెలా వచ్చి మీ తలుపు తడుతుంది. సిరిలా **జ్యోతి**. సో- ట్వెంటీ రుపీస్ (బహా) లాభం మీకు!

ఆలసించిన ఆశాభంగం!

మిమ్మల్నే....
ఇలా.... జెష్!!

దీపావళి ప్రత్యేక సంచిక ప్రత్యేకించి మీకోసం ప్రత్యేకంగా తయారయి మరీ వస్తోంది.

అంచేత మీరు అర్జెంటు పది 10 రూలు ఇచ్చి, సుభ్భరంగా జ్యోతి ఉత్తమ సాహితీ, సరదా లలలా, కార్టూను, కధావీధుల ఆనంద నగరంలో తిరగండి;

ఇందులో కథలు, నవల, మినీలు, బొమ్మలు, గేయాలు, కథా కార్టూన్లు మరియు జోకులు మిమ్మల్ని కవ్విస్తూ, నవ్విస్తూ హాయినిస్తూ విజ్ఞానాన్ని ఇస్తాయి.

చప్పున మీ కాపీని రిజర్వు చేసుకోండి మరి ...

సంస్థాపకులు
కీ॥శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సంపుటి 19 | అక్టోబర్ 1981 | సంచిక 9

ఇదీ వరస...

ఈ నెల నవలానుబంధాలు

అరణ్యరోదన

ఎం. వి. యస్. హరనాథరావు

మేధావి

శ్రీసుధా

ముఖచిత్రం : కృష./ వెనుక : జయద్ర

జ్యోతి, పి.బి. నెం.1824, హైదరాబాదు-20

! సమస్త జ్యోతి పాఠకులకు !

మీకు ఓ మాంచి కానుక..........

'ఆదివిష్ణు' అనే "హాస్యపు చినుకు చిలికేడి వాడు" మిమ్మల్ని హాస్యపు జల్లులో తడపడానికి-జ్యోతి తయారు చేస్తోంది.

సో. జ్యోతి-ముత్యాల హాస్యపు సీరియల్ జల్లులో మిమ్మల్ని తడిపి ఊటుబేసి పెట్టేస్తుంద్రి........

రెడీ కండి. జ్యోతి కాపీకై..........

'ఉన్మాది మనస్సినీవాలి'



తొలిమాట


ఆధునికతకి రాకెట్ వేగంతో పురోగమనం-మానవతలో ఆదే వేగంతో తిరోగమనం। మనిషి ప్రగతి అంచు ఎక్కడ? తనని తాను క్షణాల వేగంతో సర్వనాశనం చేయగల రాకాసి మారణాయుధాలు అంచక్కా తయారు చేసుకోడమా?!_''a stupid hour destroys what centuries made'' వెనక మిగిలిన దారేకాదు-ముందు నడవాల్సిన రోడ్డు కూడా నాశనం చేసుకునే స్థితిలో వున్నామా మనం?। కాకపోతే మనకి స్వతహా వున్న అజ్ఞాన ఆయుధం గాక, న్యూట్రాన్, హైడ్రొజిన్, ఆటం బాంబు లెందుకట?!

మహా పరిణామంలో. మనిషి మసుగడలో, ఆఖరికి వంటింట్లో నిజ భార్యతో వివాదంతో సహా కారణం-మనకున్న అందమైన మూర్ఖత్వం—తెలివి తప్పినవేళ అంతా ఒకటే !

మొన్ననే వినాయకుల చవితి వెళ్ళిపోయింది-దీపావళి వస్తోంది—అందుకే మాంచి వన్నె చిన్నెల హంగులతో, విజ్ఞాన వస్త్రాలతో, బయలుదేరి వస్తోంది జ్యోతి.

రైట్.........ప్రొసీడ్ కండి !

[illegible]



సెప్టెంబరు "జ్యోతి" మాసపత్రిక చూడగానే అందులో తొలిమాట శీర్షిక క్రింద మతము మానవుని హతమార్చడానికి ఎంతవరకు మూల కారణము అను విషయము తేటతెల్లముగా వివరించి యుంటిరి. తొలిమాట పత్రికకే హైలైట్.

"డబ్బు" సీరియల్ యండమూరి వీరేంద్రనాథ్ కలమునుండి వెలువడి మమ్మలను ఇంకా ముందుకు నడిపించుచున్నాడు. "సెలక్షన్" మినీకథ బావుంది. మిగతా కథలు చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటున్నవి. రచయిత (త్రి) లకు నా అభినందనలు.

టి. వెంకన్న,

మిర్యాలగూడ.

కుమారి శోభానాయుడు ముఖచిత్రంతో సెప్టెంబరు నెల "జ్యోతి" శోభిల్లింది. హాస్యకథల పోటీ ఫలితాలు చూసి మాకు ఏడుపొచ్చినంత పనయింది. అయినా హాస్యకథలు కదండీ, ఏడ్వటం బాగుండదు అనుకొని తాపీగా నవ్వేశాం. కొంపదీసి మన రచయిత(త్రు)లు "నవ్వు నాలుగు విధాల చేటు" అన్న సూక్తిని పాటించి వుండవచ్చునని నా అభిప్రాయం.

పోటీలో ఎన్నికయిన కథలలో వో కథ "జిందాబాద్" కాస్త నవ్వించినా, "భర్తకున్న దురలవాట్లని (ఆఫ్‌కోర్సు ఏదైనా కానీయండీ) మానిపించటానికి భార్య వాటిని తానుకూడా నేర్చుకున్నట్లు నటించి అతనికి బుద్ధిచెప్పటం" అన్న పాత ఇతివృత్తం మీద ఆధారపడడం విచారకరం. మొత్తంమీద గణపతిరావుగారు పాఠకులకు "కిటికీ ఊచలు" వంచే బాధ తప్పించారు.

ఆగూరు రవీంద్రకుమార్,

విశాఖపట్నం.

సెప్టెంబరు నెల, సంచికలో పడిన కథలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా "హిమాలయం-కలుపుమొక్క" అన్న కథ పరిస్థితుల అర్థం చేసుకోలేని మనుషులు ఎలా సుఖపడలేరో తెలుపుతోంది. దీనిలో పురుషుని మదిలో అవ్యక్తంగా ఉండే "వాంఛ"ను అగ్నిపర్వతంతో పోల్చడం సరికొత్త ప్రయోగం. ఈ కథ ప్రచురించినందుకు మీకు అభినందనలు. శోభానాయుడు గారితో ప్రత్యేక ఇంటర్‌వ్యూ ఆసక్తిదాయకంగా ఉంది.

ఎన్. వి. శీతారాఘవయ్య,

విశాఖపట్నం.

కుమారి శోభానాయుడు ముఖచిత్రంతో, కూచిపూడి నాట్యం గురించి వివరిసూ వెలువడిన జ్యోతి ఒక ప్రత్యేక కళతో అత్యంత శోభాయమానంగా వుంది.

డబ్బుటు ది పవర్ ఆఫ్ డబ్బులో యండమూరి—హెడ్ అండ్ టాస్—ప్రోబబులిటీ థియరీ మంచి ఇంటరెస్టింగ్‌గా వుంది.

కె. సుబ్బలక్ష్మిగారి 'బంగారు తణాలు' సర్వసామాన్యంగా ప్రతి ఇంట్లోనూ జరిగే (జరుగుతున్న) సంఘటనలకు చక్కని వాస్తవ చిత్రీకరణగా చెప్పవచ్చు.

తర్వాత మేధస్సుకో పరీక్ష:

సమస్య 7 కు సమాధానం 'ఏ' అని ఇచ్చారు. కాని కరక్టు సమాధానం "ఎ"

యస్. పురుషోత్తమ్ దాస్,

పాలకొల్లు.

* Yes—"S"


డా॥ ఎ. ఎల్. నారాయణ చిత్రపటావిష్కరణ

ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు శ్రీ డా. ఎ. ఎల్. నారాయణ గారి తైల వర్ణ చిత్రాన్ని శ్రీ అవుల సాంబశివరావుగారు ఆవిష్కరించారు విశ్వవిద్యాలయంలో. ఆ సందర్భంలో చిత్రకారులు శ్రీ ఎస్. కృష్ణమూర్తిని శ్రీ సాంబశివరావుగారు, శ్రీ ఎ. వైదిరాజుగారు సన్మానించారు.

రాష్ట్రస్థాయి తెలుగు కార్టూనిస్టుల సంస్థ క్రోక్విల్ క్లబ్ "ఆం॥ ప్ర॥—క్రోక్విల్ అకాడెమీ" గా మారిన సందర్భంగా నిర్వహింపబడిన వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ డైరెక్టర్ డా. పి. యస్. ఆర్. అప్పారావు—వేదికపై ఆంధ్రభూమి వీక్లీ డిప్యూటీ ఎడిటర్ శ్రీ సి. కనకాంబరరాజు, ప్రముఖ రచయిత శ్రీ ఆదివిష్ణు....

మంత్రి శ్రీ కొట్టం శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా ఈ సభకు విచ్చేసి క్రోక్విల్ న్యూస్ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తూ, వర్తమాన సంవత్సరానికిగాను క్రోక్విల్ అకాడెమీకి రు. 5,000/- ప్రభుత్వ గ్రాంటును ప్రకటించారు.





ఇటీవల వంశీ ఆర్ట్సు ఆధ్వర్యంలో శ్రీ వేటూరి సుందరరామమూర్తిని జిల్లా కలెక్టర్ శ్రీ జె. బాపురెడ్డి సన్మానిస్తున్న దృశ్యం.

రాజాలక్ష్మి అవార్డులు

1981 రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డులు కళాప్రపూర్ణ శ్రీ వెంపటి చిన్న సత్యంకీ కళాప్రపూర్ణ శ్రీ నేరెళ్ళ వేణుమాధవ్‌కీ ఇవ్వటానికి, నిర్ణయం జరిగింది. నవంబర్‌లో జరుగనున్న ఉత్సవంలో ఒక్కొక్క అవార్డు 10,000 నగదు బహుమతులు ఇచ్చి సత్కరిస్తారు.

ఈ సందర్భంగా కూచిపూడి నాట్య సాంప్రదాయాన్ని అందరి హృదయాల్లో నిలపడానికి కృషి చేస్తున్న శ్రీ వెంపటి చిన్న సత్యం గారికీ, మిమిక్రీతో సమ్మోహనం చేస్తున్న వేణుమాధవ్ గారికీ అభినందనలు తెలుపుతోంది జ్యోతి.

హెచ్. యమ్. టి రాష్ట్రస్థాయి నాటక-నాటిక పోటీలు

ఈ పోటీలకు బహుమతులు :

	నాటకం	నాటిక
ఉత్తమ ప్రదర్శన	1,500	800
ద్వితీయ ఉత్తమ ప్రదర్శన	1000	600
ఉత్తమ రచన	116	116

ఇంకా, ప్రతి ఎన్నికయిన స్థానిక నాటకానికి 400, నాటికకు 250లు:

మిగత వివరాలకి :

చైర్మన్, ఫైన్ ఆర్ట్స్ సొసైటి, హెచ్. యం.టి. వాకో. హైదరాబాద్-500 854కి రాయండి.

'కుటుంబరావు సాహిత్యం'

కీ. శే. కొడవటిగంటి కుటుంబరావుగారి రచనల్లోంచి నవలలు, కథలు, గల్పికలు, నాటికలు, ఫీచర్లు ఏరి కూర్చిన రచనల్ని "కుటుంబరావు సాహిత్యం" పేర కనీసం అయిదారు సంపుటాలుగా వెలువరించబోతున్నారు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. శ్రీ కేతు విశ్వనాథ రెడ్డిగారు ప్రధాన సంపాదకుడుగా వ్యవహరిస్తారు.

మొదటి సంపుటం వెలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూడు నవలలు, ఇరవై కథలు, పది గల్పికలు, మూడు నాటికలు, మూడు ఫీచర్లు వుంటాయి.

ఈ సందర్భంగా కుటుంబరావు గారి రచనా వివరాలను తెలిపే ఒక సమాచార పట్టికను వెలువరిస్తున్నారు.

సంపుటాలుగా రాక పత్రికల్లో మరుగు పడివున్న కుటుంబరావు గారి కథలు, గల్పికలకు సంబంధించిన సమాచారం అందించటమే కాకుండా, రచనల ప్రతులు గనుక వున్నట్లయితే, వాటిని పంపి తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

వివరాలకు : కేతు విశ్వనాథ రెడ్డి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం, తిరుపతి—517502.

రా. వి. శాస్త్రి రచనలు


శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు - కథలు, వ్యాసాలు, లేఖలు, గేయాలు, పుస్తకాలకు రాసిన ముందుమాటలు, పత్రికలలో అచ్చయినా కథా సంపుటాలలో అచ్చుకాని కథలు మొదలగునవి, జాస్మిన్ పేరుతో 'చిత్రగుప్త'లో వచ్చిన-కథలు ప్రచురింపబోతున్నారు. వాటి కాపీలు పంపమని ఎక్కడుండేది వివరాలు పంపమని కోరుతున్నారు.

వివరాలకు :

టి. వేణుగోపాలరావు,
సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజి,
విజయవాడ-8.

బెస్ట్ విషెస్

భవాన్స్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న జర్నలిజం కోర్సులోని తెలుగు జర్నలిజంలో ప్రథముడిగా నిలబడ్డ ఉమాపతి వర్మకు జ్యోతి అభినందనలు! జర్నలిజంలో, కొత్త ప్రయోగాలు చేసూ, ఉమాపతి వర్మ ముందడుగు వెయ్యాలని కూడా జ్యోతి కోరుకుటోంది.



'తెలుగు సాహితీ సమితి' బెంగుళూరువారు శ్రీ సినారె, శ్రీ దాశరధిగార్లను సన్మానించిన దృశ్యం.

నీల పెళ్లి

ఎ. రామశాస్త్రి

"రేపు సప్తమినాడు నా పెళ్ళి మాస్టారూ!
మీరు తప్పకుండా రావాలి"

నీల మాటలకి నేను లిటరల్‌గా స్టన్ ఐపోయాను.

నీలముందు అలా అవాక్కై నిలబడిపోడం నాకేం కొత్తకాక పోయినా, ఇంత షాకెప్పుడూ తిన్లేదు.

నేనెందుకిలా షాక్ ఫీలయ్యానని మీకు సందేహం రావచ్చు. ఒకవేళ నీలని నేను ప్రేమిస్తున్నానేమోనని మీరు అనుమానపడవచ్చు. సహజమే!

అవును! నీలని నేను ప్రేమిస్తున్నాను!

○ ○ ○ ○

నేను కొత్తగా ఈవూరు ట్రాన్స్ఫరై వచ్చిన మొట్ట మొదటిరోజున మంచి ఇల్లు చూడమని మా కో-టీచర్సుతోటీ, ఎందుకయినా మంచిదని, నేను క్లాస్ టీచర్‌గా ఉన్న నైన్త్‌క్లాస్ విద్యార్థుల తోటీ చెప్పాను.

క్లాసు ఐపోయిన వెంటనే నీల ఇంకో అమ్మాయితో కలిసి స్టాఫ్‌రూమ్‌లో వున్న నాదగ్గర కొచ్చేసింది నేరుగా.

నేను 'ఏం కావాలమ్మా' అని అడగబోయేలోపల

"నాపేరు నీల మాష్టారు! అర్జంటుగా నాకో వంద రూపాయలివ్వండి" అంది.

నేను ఆ అమ్మాయి ఎదుట మొదటిసారిగా అవాక్కై నిల్చున్నాను.

"అలా చూస్తారేవిటి మాష్టారు? చప్పున ఇవ్వండి! ఇంటి దగ్గర్నుంచి కబురొచ్చింది. హాఫ్ డే లీవ్ పెట్టి వెళ్ళిపోతున్నాను.


వీళ్ళింటి ప్రక్కనే ఓ మంచి డాబా ఇంట్లో ఓ పోర్షను ఖాళీగా ఉందిట: దాని అద్దె అసలు వంద రూపాయలట; పాత వాళ్ళు మారటంతో, ఇంటావిడ నూటిరవై ఐదుకి పెంచదల్చుకుందిట: 'తను చెప్తే మాత్రం వందకే ఇస్తుందట. అందుకని చప్పున వంద రూపాయలివ్వాలట. లేకపోతే ఈలోగా ఎవరేనా ఆ పోర్షన్ని ఎగరేసుకు పోతారుట".

నిజమే! అదివరకు బొంబాయి, హైదరాబాదు అనుకున్నాము కానీ బెజవాడలో కూడా ఇళ్ళు దొరకడం చాలా కష్టమైపోయింది మధ్య!

ఆ సాయంత్రం పెళ్ళి ఇల్లు చూశాను. నూటయాభయి ఐనా ఇవ్వచ్చు చేరచ్చు అనేట్టుంది ఇల్లు. అన్ని ఫెసిలిటీసు లున్నాయి. టౌనుకి సెంటర్‌లో ఉంది. ముఖ్యంగా మా స్కూలుకి దగ్గర్లో ఉంది. మధ్యాహ్నమే నీల అడ్వాన్సివ్వడంతో ఇల్లు చక్కగా కడిగి ముగ్గులు పెట్టి ఉంచారు.

అట్లా నీల రికమండేషను మీద ఆ మర్నాడే ఆ యింట్లో చేరాము.

ఆ యింటికొచ్చి మూడు నెల్లే అయినా. నీల మాఇంట్లో బాగా చనువైపోయింది,



మా అమ్మాయి శ్రీదేవికూడా నైన్త్‌క్లాసే అవడంతో వాళ్ళిద్దరూ బాగా ఫ్రెండ్స్ ఐపోయారు. వాళ్ళిద్దరూ అంతఖుంచి ఫ్రెండ్సవ్వడానికి ఇంకో కారణం ఉంది.

నీల ఎక్స్ట్రోవర్ట్. పధ్నాలుగేళ్ళ ప్రాయంలో అంతటి ఎక్స్ట్రోవర్ట్‌ని నా జీవితంలో చూళ్ళేదు. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేది. చుట్టూ ఉన్న వాళ్ళకి ఊపిరి సలపనిచ్చేదికాదు. ఈఅమ్మాయికి పూర్తిగా వ్యతిరేకం మా శ్రీదేవి. నా ఒక్కడితో తప్ప వాళ్ళమ్మతోకూడా ఎక్కువగా మాట్లాడేది కాదు. అందుకే వాళ్ళిద్దరూ అంత దగ్గిరయ్యారేమో నని స్తుంది నాకు అప్పుడప్పుడు.

నాకిష్టం

అమ్మకు పాపంటే ఇష్టం
పాపకు జాబిలంటే ఇష్టం
చాలామందికి కథలంటే ఇష్టం
కొందరికి కవితలంటే ఇష్టం
నాకుమాత్రం మానవత గల
మానవుడంటేనే యిష్టం।

ద్వైతా కృష్ణకుమారి

నీల నా స్టూడెంటులందర్లోకీ తెలివైన పిల్ల. ఆ తెలివితోపాటు ఈ అమ్మాయితో లోకం మంచౌతుందో, చెడటంటుందో తెలీదు కానీ, ఇంకో లక్షణం కూడా ఉండేది.

పొగరు!

తను అనుకున్న పని రామ రావణు లడ్డమైనా చేసి తీరేది. చిత్రమేమిటంటే ఆపని చేసినట్టు మనకి చేసింతర్వాతకానీ తెలియ నీదు-ఇందుకేనేమో, నాకు ఆ అమ్మాయంటే ఇష్టమేర్పడింది.

ఎందుకో తెలియదుగానీ, నేనంటే ఆ అమ్మాయికి కూడా మంచి అభిప్రాయమే ఉంది.

"ఆ రోజు మొట్టమొదట చూసీ చూడగానే నాకెందుకో మీరు అందరి లాంటి వారు కారనిపించింది. తరవాత తరవాత మీ మాటలూ, చేష్టలూ నా ఊహ నిజమని ఋజువు చేశాయి" అంది నీల ఓసారి.

ఎలా ఋజువైందో తనకీ, ఆ దేవుడికే తెలియాలి!

○ ○ ○ ○

అట్లాంటి నీల..............."నా పెళ్ళి మాష్టారూ." అంటే, తను చెప్పే వింతలు విన డానికి ఎప్పుడూ ఎంత సంసిద్ధంగా ఉన్నా, ఆశ్చర్య పోకుండా ఉండ లేక పోయాను.

"ఏమిటాలోచిస్తున్నారు మాష్టారూ? సుందరి గుర్తొచ్చిందా?"

నాకు చప్పున కళ్ళు తడి అయ్యాయి. ఎంత తెలివైందీ పిల్ల! నిజంగా నాకు సుందరే గుర్తొచ్చింది.

○ ○ ○ ○

ఆ రోజు శ్రావణ మంగళవార మనుకుంటాను, మా యింట్లో పేరంటం, హడావుడీ! సుందరి ఆరోజే నాకూ నీలకీ పరిచయమైంది.

లోపలంతా ఆడవాళ్ళున్నారుకదా అని బైట లాన్‌లో కుర్చీ వేసుక్కూర్చుని పేపరు చదువుకుంటున్నాను. ఇంతలో అలికిడైతే తలెత్తి చూశాను.

ఓ పన్నెండేళ్ళ అమ్మాయిని చెయ్యి పుచ్చుకుని బరబర లాక్కొస్తోంది నీల.

"ఈ తాయిలారు పేరు సుందరిట మాష్టారూ! మనకు చెప్పకుండా పెళ్ళి చేసేసుకుంది!"

ఆ అమ్మాయి చెయ్యి వదిలేసి, తను వెళ్ళిపోయింతర్వాత సీరియస్‌గా అడిగింది.

"పెళ్ళంటే ఏమిటి మాష్టారూ"

అవును! పెళ్ళంటే ఏమిటి?!

నేనేదో సమాధానం చెప్పబోయేంతలో తనే అంది.

- "పెద్దవారు మీరే చెప్పలేకపోతున్నారే. ఇంక నాకూ సుందరికీ పెళ్ళంటే ఏం తెలుస్తుంది మాష్టారూ?"

ఆరోజే అనుకుంటాను, "శారదాబిల్లు" గురించి నీలకి చెప్పాను.

○ ○ ○

"ఇప్పుడే చెప్తున్నాను మాష్టారు! మీరు వచ్చి ఆశీర్వదించకపోతే నా పెళ్ళి జరుగదు,

తెలియలేదు.

ం ం ం

ఆరోజు తలనొప్పిగా ఉండడం చేత, మధ్యాహ్నం నుంచి సెలవు పెట్టి, వర్క్సంతా అసిస్టెంట్ హెచ్. ఎమ్ కి అప్పజెప్పి ఇంటికి వచ్చేశాను.

ఇంట్లో అడుగు పెట్టగానే

"నీలకి పెళ్ళటండోయ్! శుభలేఖ, నీల రాసిన ఉత్తరం వచ్చాయి. ఆ డ్రాయర్ మీదున్నాయి చూడండి"

అంది శాంతం.

ముందు శుభలేఖ చూశాను.

నీల నన్ను ఆశ్చర్యపరిచే బుద్ధి పోనిచ్చుకుంది కాదు.

శుభలేఖలో ఇలా వుంది.

వధువు: చి. సౌ. నీల, ఎం. ఏ.

వరుడు: చి. సుధాకర్, ఎం.ఎస్సీ. (టెక్)

ఆలోచించి చూస్తే నాకు ఆశ్చర్యపడాల్సిన అవసరం కన్పించలేదు.

యస్, ఇట్స్ వెరీమచ్ లైక్ నీల!

ఉత్తరం విప్పాను.

"మాష్టారూ!

పెళ్ళంటే ఏమిటని అడిగావారోజు గుర్తుందా మీకు?

నేను మీకిప్పుడు చెప్పగలను మాష్టారూ!

ఆరోజు పోలీసులకి ఎవరు యిన్ఫామ్ చేసింది మీకు ఆరోజే తెలుసునని నాకు తెలుసు. ఇప్పుడు బావకీ, మీకూ, నాకూ తప్ప ఇంకెవరికీ తెలీదు.

కానీ మానసికంగా పరిపక్వత వచ్చిం తర్వాత పెళ్ళి చేసుకోడంలో ఎంత ఆనందం ఉందో ఇప్పుడే తెలిసింది మాష్టారూ!

తప్పకుండా వస్తారు కదూ?

శ్రీదేవినీ, అత్తయ్య గార్నీ రేపే బండెక్కించండి.

మీ శిష్యురాలు
నీల"

నా ఆశా నేత్రాలకి వందల, వేల, నీలా, సుధాకర్లు పసుబ్బట్టలతో నవ్వుతూ కనిపిస్తున్నారు. ■

యండమూరి వీరేంద్రనాథ్

సీరియల్

డబ్బు డబ్బు

గాంధీ రామమోహనరావుతో పందెం కట్టాడు. అయిదు సంవత్సరాల్లో యాభై లక్షలు సంపాదించి ఆయన కూతురు హారికని గెల్చుకుంటానని. ఓ బిచ్చకత్తె పదిపైసలు పెట్టుబడి పెట్టింది. రెండో రోజుకల్లా దాన్ని వంద రూపాయలు చేసేడు. అతడి పేపరు ప్రకటన చూసి పోలీసులు అరెస్టు చేసేరు. లక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళింది.

— ఇక చదవండి —

హోం మినిస్టరు పి. యే. "లేరు. మీరెవరు?" అని అడిగాడు.

"రామ్మోహన రావుగారి అమ్మాయిని....హారిక."

"గుడ్ ఈవెనింగ్ మాడమ్. ఆయన వూళ్ళోలేరు." అన్నాడు పి. యే. హారిక శ్రీనివాసరావు పెంపుడు కూతుర్లాటిదని తెలుసు. అతడి కంఠంలో నమ్రత గౌరవంగా తొణికింది.

"నెవర్ మైండ్...." అంది హారిక. "నాకో పని అర్జెంటుగా చేసి పెట్టాలి........"

"చెప్పండి మాడమ్,"

"అయిదు నిమిషాల క్రితం గాంధీ అనే యువకుణ్ణి పోలీసులు తీసుకెళ్ళారు. ఏ స్టేషన్‌కో తెలీదు. ఎందుకో కూడా తెలీదు. అతణ్ణెందుకు తీసుకెళ్ళారు? ఎక్కడున్నాడు- ఈ వివరాలన్నీ కావాలి. అతడి మీద థర్డ్ డిగ్రీ వుపయోగించకుండా వెంటనే చెయ్యాలి." ఆమె ఎంత బ్యాలెన్స్‌డ్‌గా మాట్లాడినా ఆ కంఠంలో తొందర కనబడింది. అవతల పి. యే. కొద్దిగా తటపటాయిస్తూ "వివరో....ఏ పోలీసు స్టేషనో తెలియకుండా...." అంటున్నాడు.

"అది తెలియకే మీకు ఫోన్ చేసేను ప్రకాశరావుగారూ. తెలిసి వుంటే ఆ స్టేషన్ సబిన్‌స్పెక్టర్‌కే చేసి వుండేదాన్ని-అంది. ఆమె ఇప్పుడు పదహారేళ్ళ అమ్మాయిలా మాట్లాడటంలేదు. చాలా కామ్‌గా-పరిస్థితిని తన చేతిలోకి తీసుకొన్న దేశాధినేతలా మాట్లాడుతూంది.

పి. యే. సందిగ్ధంతో...."సరే మేడమ్ మళ్ళీ ఫోన్ చేస్తాను" అంటూ రిసీవర్ పెట్టేసేడు. హారిక కుర్చీవెనక్కి వాలింది. అదే సమయానికి లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో అవినాష్‌తో వాదిస్తూంది. "అతనలాటివాడు కాదు ఇన్‌స్పెక్టర్ గారు. నాకు బాగా తెలుసు. కావాలంటే నేనతడికి హామీ వుంటాను."

అవినాష్‌కి నవ్వొచ్చింది. ఈ చిరుగు బట్టలమ్మాయి బెయిల్ లాటిది ఇస్తాననూ అంటూంటే!! అతడు లోపలికి తొంగి చూసేడు. లతీఫ్ ఇంటరాగేషన్ చేస్తూనే వున్నాడు. గాంధీ మొహంలో బాధ కనబడ్తూంది. అవినాష్ లక్ష్మివైపు తిరిగి "....ఆ ప్రకటనకి అర్థమేమిటి? అది చెప్తే చాలు. వదిలేస్తాను" అన్నాడు.

"నాకూ తెలీదు ఇన్‌స్పెక్టర్‌గారూ. కానీ ఒకటి మాత్రం చెప్పగలను. గాంధీ ఇల్లీగల్‌గా ఏమీ చెయ్యడు. అది మాత్రం నిజం. న్యాయాన్నీ—న్యాయశాస్త్రాన్నీ మేం ఇద్దరం నమ్ముతున్నాం"

ఆమె మాటల్లో ఇంగ్లీషు పదం— ఆ ఉచ్చారణా చూసి, "ఏం చదువుకున్నావ్" అని అడిగాడు అవినాష్. ఆమె తలవంచుకొని "—చదువుకీ మా పరిస్థితికీ సంబంధంలేదు ఇన్‌స్పెక్టర్ గారూ........వియ్ బోత్ ఆర్ గ్రాడ్యుయేట్స్...." అన్నది. అతడు ఆమె వైపు ఓ క్షణం తదేకంగా చూసి, "నిన్నెక్కడో చూసేను..." అన్నాడు. ఈసారి ఆమె సిగ్గు పడలేదు. కానీ తల వంచుకొనే...."....నేను మీ ఇంట్లో బట్టలు వుతికే పనిమనిషినే"



అంది. అతను ఓ క్షణం షాక్ తిన్నవాడిలా నిశ్చేష్టుడైపోయేడు. అంతలో లోపల్నుంచి గాంధీ కంఠం "అమ్మా-" అని హృదయ విదారకంగా అరిచేడు. అవినాష్ చప్పున లోపలికి తొంగిచూసి "స్టాపిట్" అన్నాడు.

అదే సమయానికి హోంమినిస్టర్ పి. యె నుంచి హారికకి ఫోన్ వచ్చింది. "చాలా స్టేషన్‌లు పూర్తయ్యాయి మేడమ్. ఎక్కడా దొరకటంలేదు. ఇంకా ఎంక్వయిరీ చేస్తూనే వున్నాం." ఆమె ఆందోళనగా "డూ ఇట్ క్విక్" అంది. అయిదు నిమిషాల తర్వాత ఆమెకి మళ్ళీ ఫోన్ వచ్చింది. ఆమె ఆతృతతో రిసీవర్ ఎత్తి "దొరికిందా ఏ స్టేషనో" అంది.

"దొరికేడు మేడమ్" అన్నాడు పి. యే "....కానీ"

"ఊ—కానీ...." హారిక టెన్షన్‌తో అడిగింది.

"వాళ్ళని వదిలేసేర్ట...."

9

గాంధీ ఇచ్చిన పోస్ట్ బాక్స్‌కి నాలుగు వుత్తరాలు వచ్చేయి. అంతకన్నా ఎక్కువ వస్తాయని అతడు వూహించలేదు కూడా. అతడిచ్చిన డబ్బుకి చాలా చిన్న ప్రకటన.... పేపర్లో ఒక మూలపడింది. దానికే నాలుగు ఉత్తరాలు వచ్చేయీ అంటే ప్రపంచంలో

సులభమైన డబ్బు సంపాదించే తహతహ ఎందరిలో వుందో తెలుస్తున్నది.

"ఏం ప్లాన్స్ చెప్పదల్చుకున్నావ్ వాళ్ళకి?" అని అడిగింది లక్ష్మి. గాంధీ నవ్వేడు. "నాకూ తెలీదు. వాళ్ళ తెలివి తేటలు—వాళ్ళ దగ్గిరున్న డబ్బు—దానిమీద ఆధారపడి వుంటుంది నేను చెప్పబోయే ప్లాను."

"అసలు డబ్బు లేకుండా—కేవలం తెలివితేటలున్నవాడు ఈ నలుగుర్లో ఒకడనుకో. అతనికేం చెప్తావ్?"

గాంధీ చురుగ్గా చూసి, "ఈ ప్రశ్న ఎందుకేసేవో అర్థమయింది నాకు. 'అతనికి చెప్పబోయే ప్లాన్ ఏమిటో నువ్వే అనుసరించి నువ్వే ఆడబ్బు సంపాదించవచ్చు కదా' అని నీ ప్రశ్న. అంతేనా" అన్నాడు. లక్ష్మి నవ్వి అవునన్నట్టు తలూపింది. గాంధీ "నేను న్యాయబద్ధంగా సంపాదిస్తానన్నాను కానీ న్యాయబద్ధంగా సంపాదించే ప్లాను చెప్తానన్లేదు" అన్నాడు. లక్ష్మి ఏదో వాదించబోయేటంతలో అతడు ఆగమన్నట్టు చెయ్యి అడ్డుపెట్టి "ఇల్లీగల్‌గా ఒకపని చెయ్యమని సలహా ఇవ్వటం ఇల్లీగల్ కాదు" అన్నాడు. ఆమె అప్రతిభురాలై అతడివైపు చూసింది. "కాను నేను చెప్పబోయే ప్లాన్‌వల్ల వచ్చే దుష్పరిణామాలకి నేను బాధ్యుణ్ణి కానని వాళ్ళకి ముందే హెచ్చరించి, ఆతరువాతే నాప్లాన్ చెప్తాను" అన్నాడు గాంధీ.

"ఇది అన్యాయం" అంది లక్ష్మి.


అతడు ఒక్కసారి ఆవేశపూరితమైన కంఠంతో, "న్యాయానికీ అన్యాయానికీ తేడా ఒక్క అక్షరమే! అసలేది న్యాయం? సమసమాజం స్థాపించాలనే ప్రభుత్వం లాటరీలు నిర్వహించటం న్యాయమా? కడుపుకోసం పశుప్రవృత్తి చేపడితే జైల్లో పెట్టే ప్రభుత్వం, డబ్బున్నవాళ్ళు అమ్మాయిల్తో కేబరేలాడిస్తే లైసెన్సులివ్వటం న్యాయమా? పేకాడితే అన్యాయం....రేసులకెడితే న్యాయం! పేకాటలో మనడబ్బు మనమధ్య వుంటుంది. కానీ రేసుల్లో అది గుర్రాల యజమాన్లకి వెళుతుంది. ఏదిన్యాయమో ఏది అన్యాయమో ఈ ప్రభుత్వానికి తెలీదు. అటువంటప్పుడు నేనెంత"

లక్ష్మి అతడివైపు విస్మయంగా చూసి "నీలో ఇంత ఆవేశం వుందని నాకు తెలీదుసుమా" అంది. ఒకప్పుడు లేదు. ఇప్పుడిప్పుడే కలుగుతూంది" అన్నాడు.

"వాళ్ళందరికీ ప్లాన్లు చెప్తావ్ కదా. అసలు నీ ప్లాన్ ఏమిటో చెప్పు. ఏ సంవత్సరం ఎంత సంపాదిస్తావో" అంటూ కాగితం కలం తీసుకుంది—అతడు చెప్పుకుపోతూంటే ఆమె గ్రాఫు గీసింది. అతడు చెప్పసాగేడు. "....మొదటినెల డబ్బుసంపాదించటం చాలా కష్టం. చాలా తక్కువలో ప్రారంభం అవుతుంది. రెండోనెలనుంచీ బాగా పెరుగుతుంది. సంవత్సరంన్నర గడిచేసరికి కొంచం నిలదొక్కుకొంటాం. కొంచం నష్టం వచ్చినా రావొచ్చు (గ్రాఫులైను కిందికి దిగింది). కానీ వెంటనే తప్పుగ్రహించి సరిదిద్దుకొంటాం. రెండున్నర సంవత్సరాలకల్లా—అంటే డెడ్‌లైన్ వచ్చేసరికి ఇరవైఅయిదు లక్షలు సంపాదించాలి. దాంతో అటో ఇటో తేలిపోతుంది. ఇదంతా నావాటా గురించి నేను చెప్తున్నాను. రెండున్నరేళ్ళలో ఇరవైఅయిదులక్షలు ఒకవేళ సంపాదిస్తే ఇంకా పైకి వెళదాం. మూడో సంవత్సరం దాటేసరికి చిన్నజంప్ వుంటుంది. అప్పటికి అనుభవం బాగావస్తుంది కదా. దాంతో కొంచం ఓవర్ కాన్ఫిడెన్సు వచ్చి ఓ నాల్గయిదు లక్షలు దెబ్బకొట్టినా కొట్టవచ్చు. కానీ చివరిసంవత్సరం బాగా కష్టపడతాం. అప్పటికి గడువు చివర్లో వుంటాం కాబట్టి చిన్న చిన్న జర్క్స్ వచ్చినా లక్ష్యం పూర్తి చేయటానికి అహోరాత్రాలూ శ్రమిస్తాం. నాలుగు సంవత్సరాలా ఆర్నెల్లు గడిచేసరికి నలభై ఆరూ, నలభై ఏడు లక్షలమధ్య వుంటాం. నాలుగు సంవత్సరాలా ఎనిమిది నెలలు గడిచేసరికి...." అంటూ

ఆపుచేసేడు.


లక్ష్మి—గ్రాపు గీస్తున్నదల్లా ఆపుచేసి, "ఊ—గడిచేసరికి?" అంది. గాంధీ నవ్వి— "ఏమో—మొత్తం అంతా ఒక్కసారిగా పోయినా పోవచ్చు. ముందు అక్కడివరకూ సాధించనీ" అన్నాడు. లక్ష్మి అతడికి గ్రాఫు కాగితం అందించింది. అతడు చూస్తూంటే భుజం పక్క నుంచి దాన్ని మరోసారి గమనించి 'అరె' అంది. "నాలుగో సంవత్సరం దగ్గిర వెనకొచ్చి చిన్న తప్పుచేసేను. అయినా గమత్తుగా వుంది. కదూ"



బొమ్మని పరిశీలనగా చూస్తూ గాంధీ 'ఏమిటి' అన్నాడు. లక్ష్మి కొంత ఆశ్చర్యం మిళితమైన నవ్వుతో, 'అచ్చు అమ్మాయిలాలేదూ' అన్నది. గాంధీ విస్మయంతో ఆ బొమ్మవైపే చూసి, 'ఔను సుమా' అని కొద్దిగా ఆగి, "రామమోహనరావు ఒక తప్పు చేసేరు. పందెం గెలుస్తే నాకు బహుమతి ఏమిటో చెప్పారుగానీ—ఓడితే శిక్షేమిటో చెప్ప లేదు" అన్నాడు సాలోచనగా....లక్ష్మి "అవును. ఆ సంగతి అడగటమే మర్చిపోయేను. ఇంతకీ ఏమిటి ఆ బహుమతి?" అన్నది. గాంధీ ఓ క్షణం మౌనంగా ఆలోచించేడు. చెప్పెయ్యాలి. ఎందుకు దాచిపుచ్చటం. అయినా ఇదంతా జరిగినప్పటి మాట కదా. అతడు తలెత్తి "రామమోహనరావుగారి అమ్మాయి" అని ఏదో అనబోతూ వుంటే గుమ్మం దగ్గిర చప్పుడయింది. ఆస్పత్రి వార్డ్ బోయ్ లోపలికి వస్తూ "గుడ్ మార్నింగ్ సార్. మీరు ఇక్కడే వుంటున్నారా, ఈ ఇల్లూ ఆ వెనుకే....నిన్న సాయంత్రం మిమ్మల్ని చూసేను" అన్నాడు.

o o o o o

ఆ సాయంత్రం గాంధీ తన స్నేహితుడైన రావు దగ్గిరకి వెళ్ళాడు. రావ్ అతడి కన్నా కాలేజ్‌లో సీనియర్. తరువాత చార్టర్డ్ అకౌంట్స్ చదివి ప్రాక్టీసు పెట్టాడు.



మామూలు సంభాషణ అయ్యాక గాంధీ తను వచ్చిన పని చెప్పాడు. "అయిదు సంవత్సరాల్లో కోటి సంపాదించాలి. దానికి టాక్సు ఎంత పడుందో చెప్పు "అన్నాడు."

రావ్ నవ్వి "ఇదేం లెఖ్ఖ? చందమామకి ఏదైనా కథ రాస్తున్నావా! "అని అడిగాడు. గాంధీ" సీరియస్‌గానే అడుగుతున్నాను చెప్పు" అంటూ కాగితం కలం తీసుకున్నాడు.

"అలా చిన్న ప్రశ్న అడిగేసి జవాబు చెప్పమంటే కుదర్దు. ఏం బిజినెస్సు? భాగస్వాములెంత మంది? లేక పోతే ఏదైనా కంపెనీయా? ఏ యే సంవత్సరంలో ఎంత సంపాదన? ముందు పెట్టెబడి ఎంత?" అన్నాడు రావు. ఆ ప్రశ్నకి ఉపోద్ఘాతంగా "పెట్టుబడి పది పైసలు." అన్నాడు గాంధీ.

"వ్హా..........ట్"

"అవును....పది పైసలు....ఇద్దరం భాగస్వాములం. కాని అంతా నా ఒక్కడి పేరు మీదే వుంటుంది. మొదటి సంవత్సరం పద్ధెనిమిది లక్షలు- రెండో సంవత్సరాని కల్లా ఇరువై నాలుగు లక్షలు-...."అంటూ గాంధీ చెప్పుకు పోతుంటే రావ్ రాసుకున్నాడు. అతడు చెప్పటం పూర్తియేక రావు చాలసేపు లెఖ్ఖలు కట్టి "నీ దగ్గిర అయిదు సంవత్సరాలు తిరిగే సరికల్లా ఓ కోటి మిగలాలీ అంటే నువ్వు మొత్తం మూడు కోట్లా ముప్పై లక్షలు దాదాపు సంపాదించాలి" అన్నాడు.

గాంధీకి పొలమారి "మంచి నీళ్ళు" అన్నాడు రావు తెప్పించాడు. అవి తాగుతూ

వుంటే „ఆగాను! లెఖ్ఖలో చిన్న తప్పొచ్చింది. నీకు ఇన్ కం టాక్సు గురించే చెప్పాను. వెల్త్ టాక్సు గురించి చెప్పలేదు కదు." అని మళ్ళీ లెఖ్ఖలు కట్టి-"దానికో నాలుగు లక్షలు కలుపుకో" అన్నాడు.

గాంధీ లేచి షేక్ హాండిచ్చి "వెళ్ళొస్తాను బ్రదర్" అన్నాడు. అతడు బైటకు వచ్చేస్తూంటే "నిజంగా అంత డబ్బు సంపాదిస్తావా ఏంటి? సంపాదిస్తే జ్ఞాపకం వుంచుకో గురూ- నేనే నీ ఆడిటర్ ని"....అని అరిచాడు వెనక నుంచి రావు.

ం ం ం ం ం

"ఇక్కడ కూర్చొందామా" అడిగేడు గాంధీ. ఆగంతకుడు తలూపేడు. ఇద్దరూ పార్కులో ఒకమూల కూర్చొన్నారు ఏ ప్రకటనకి వచ్చిన నాలుగువుత్తరాల్లో ఒకటి ఆ అగంతకుడిది. అతడు గడ్డం చెక్కట్టుకున్నాడు. పెట్లో కళ్ళతో "నాపేరు సోమసుందరం. డబ్బు సంపాదించే మార్గం ఒకటి చెప్తానని ప్రకటించింది మీరేనా" అన్నాడు. గాంధీకి అతడు మొదటి చూపులోనే నచ్చలేదు. అయినా అతడికి తెలుసు.

బిజినెస్‌లో బాహ్య స్వరూపానికి ప్రాముఖ్యత లేదు,

అందుకని నవ్వి "అవును నేనే" అన్నాడు. సోమ సుందరం పోట్లో కిళ్ళీ ఉమ్మేసి, "చెప్పు ఎలా?" అన్నాడు. గాంధీ అదే నవ్వుతో, "ఎలా చెప్పు-అంటే ఎలా మీ రెంత పెట్టుబడి పెడ్తారు? పోలీసుల్తో వ్యవహారం ఎంతవరకూ- ఖర్చెంత-ఇవన్నీ నాకు చెప్పాలి" అన్నాడు.

"మొత్తం నీ దగ్గరున్న ప్లాన్లు అన్నీ చెప్పు. నాకు నచ్చింది కొనుక్కుంటాను" అన్నాడు సోమ సుందరం. గాంధీ తల అడ్డంగా వూపి. "నా ప్లాన్లకి కాపీ రైటు లేదు అందువల్ల వాటిని నేను ముందు చెప్పలేదు. మీకు ఎంత రేంజిల్లో ప్లాను కావాలో చెప్తే దానికి నా ఫీజు ఎంతో చెప్తాను. ఆ ఫీజులో మీకు ముందు సగం, నా ప్లాను అమలు పరిచి డబ్బు సంపాదించిన తర్వాత మిగతా సగం ఇద్దరు గాని... ఇది మన ఇద్దరికి ఆమోదయోగ్యమైన పథకం అని నేననుకుంటున్నాను" అన్నాడు నిజాయితీగా.

సోమ సుందరం అనుమానంగా అతడి వైపు చూసి "నీ ప్లాను నాకు నచ్చకపోతేనో...."అన్నాడు. "ఆమాత్రం రిస్కు ఎప్పుడూ వుంటుంది" అన్నాడు గాంధీ. సోమ సుందరం లేస్తూ "నవ్వేవరవో-నీ ప్లానేమిటో నాకు తెలీదు-నిన్ను నమ్మి డబ్బివ్వలేను" అని వెళ్ళి పోవడానికి ఉద్యుక్తుడయ్యేడు. గాంధీకి ఏం చెయ్యాలో పాలుపోలేదు. చేతి కొచ్చిన అవకాశం పోతుందని, "సరే నేను ప్లాను చెప్తాను, అది సఫలమయితేనే నా ఫీజు ఇవ్వండి" అన్నాడు ప్రాధేయపడుతున్నట్టు. గాంధీకి తన ప్లాను గన్ షాట్‌గా సక్సెస్ అవుతుందని తెలుసు అయితే అతడు ఆ క్షణాన్ని సందర్భం మరోలా అర్థం చేసుకున్నాడు. మరోకిళ్ళీ నముల్తూ, "వందో రెండొందలో పెట్టుబడి పెడ్తా. ఈ కేసుల్తో వ్యవహారం అంతా నువ్వే చూసుకోవల్సిందే. లాభం చెరి సగం. ఒప్పుకో-" అన్నాడు. గాంధీ మొహంలో ఎంతో ఎర్రబడింది. వందో రెండొందలో పెట్టుబడి పెడ్తాడట. ఆ మాత్రం తను పెట్టలేడు?

జీవితంలో, బాగా పైకి వచ్చిన వ్యక్తులు తమ ప్రారంభ దశలో ఎంత కష్టపడ్డారో వారికే తెలుస్తుంది. ముఖ్యంగా కళా రంగంలో, వ్యాపారంలో........దాన్ని "బ్రేక్ త్రూ" అంటారు. ముఖ్యంగా సినిమాల్లో ఆ బ్రేక్ త్రూ రాక సంవత్సరాల తరబడి వేచి వున్నవాళ్ళు వున్నారు. అయితే అదృష్టవశాత్తూ గాంధీకి అది మరుసటి రోజే వచ్చింది. అతడు తన ప్రకటనచూసి అప్లయి చేసిన వారిలో రోజు కొకరని కల్సుకొంటున్నాడు. ఆ

మరుసటి రోజు వచ్చినవాడు యువకుడు. అతని తండ్రి బట్టల వ్యాపారం చేస్తున్నాడు, పది పదిహేను వేలదాకా పెట్టుబడి పెట్టగలనన్నాడు. గాంధీ కొద్దిసేపు ఆలోచించి, "కొద్దిగా రిస్కు వుంది. తీసుకుందామా" అని అడిగేడు.

"ఎటువంటి రిస్కు"

"పోలీసులు ఒహుశ 'బాన్' చెయ్యొచ్చు. అలాచేస్తే మన సరుకుని తిరిగి ప్రోసెస్ చెయ్యవలసి వుంటుంది. కాని వాళ్ళు ఇది గుర్తించి, మన అమ్మకం నిలుపు చెయ్యమని అడిగే లోపులోనే మనం చాలా వరకు అమ్మవచ్చు. పోలీసులు ఆపుచెయ్యమని అడిగేక దొంగచాటుగా కొనసాగించాలా, ఆపెయ్యాలా అన్నది మీ ఇష్టాయిష్టాల మీద ఆధార పడి వుంటుంది."


అతడు ముందుకు వంగి "ఇంతకి మనం చెయ్య వలసింది ఏమిటి?" అని అడిగేడు గాంధీ నవ్వి, "మీరు తయారు చేసే బట్టల్లో బెడ్ షీట్లు కూడా వున్నాయి కదా" అన్నాడు. ఉన్నాయన్నాడు ఆ కుర్రవాడు. "తెల్లటి బెడ్ షీట్ల మీద నిలువెత్తు బొమ్మలు—సినిమా యాక్టర్లవి ప్రింటుచేసి అమ్మాలి" అన్నాడు గాంధీ. ఆ కుర్రవాడికి ఓ క్షణం అర్థం కాలేదు. అతడికి నెమ్మదిగా అర్థం అవుతుంటే గాంధీ కొనసాగించేడు.... "వివిధ భంగిమల్లో వెల్లకిల పడుకొన్నట్టు-అందమైన నటీ మణులు-హేమమాలిని—రేఖ-శ్రీదేవి........"

గాంధీ చెప్పేది పూర్తిగా అర్థం అవగానే వింటున్న కుర్రవాడి మొహంలోకి ఒక్కసారిగా కళ వచ్చింది. "ఆగండి గురు గారూ" అని, కొంచం ఆలోచించి - "అలాంటి బొమ్మలు సరే....వాటితో పాటు రీటా హెవర్త్, సోఫియాలారెన్—నగ్నపు బొమ్మలు ఫుల్ సైజువి-ప్రింట్ చేస్తే....?" అన్నాడు. గాంధీ నవ్వేడు. "-ఫర్వాలేదు. ఆ మాత్రం అల్లుకు పోగల శక్తి వుంటే చాలు. వ్యాపారంలో పైకి వచ్చినట్టే."

గాంధీ ఆలోచనకి కుర్రవాడు స్పెల్ బౌండ్ అయినట్టు అనిపించాడు. జేబులోంచి అయిదొందలు తీసి ఇచ్చాడు. వాటిని అందు కుంటూ గాంధీ అనుకున్నాడు. **బిజినెస్ ప్రపంచంలో అందరూ మోసగాళ్లు కారు, మాట మీద నిలబడేవాళ్లు నూటికి యాభైమంది వున్నారు......**అని.

ఆరోజు ఇంటికి వెళ్ళాక లక్ష్మికి చెప్పాడు—తను ఒక ప్లాను అమ్మి అయిదొందలు సంపాదించినట్టు. అయితే ఆ ప్లానేమిటో మాత్రం చెప్పలేదు. చెప్తే మళ్ళీ విరుచుకు పడుతుందని భయపడ్డాడు.

అతడు చిన్న ప్లాను అనుకున్నది ఆ తరువాత ఊహించనంత లాభసాటిగా పనిచేసింది. అతడికి అయిదొందలు ఫీజుగా ఇచ్చి ఆ ప్లానుని కొనుక్కున్న బట్టల వర్తకుడు ముందు కొద్ది సరుకుని మార్కెట్టులోకి వదిలేడు. మొదట్లో దాని కంత ప్రాముఖ్యత లభించలేదు. కానీ ఒక ఫైవ్‌స్టార్ హోటలు వాటిని వుపయోగించటం ప్రారంభించడంతో ఒక్కసారిగా అమ్మకం పెరిగి పోయింది. చిన్న చిన్న చౌక బారు లాడ్జీలు (ఫైవ్‌స్టార్ హోటల్స్‌కి వాటికీ అంత తేడా లేదు కాబట్టి) తమ గదుల్లో వాటిని వాడసాగేయి. కాలేజి హాస్టల్స్‌లో కుర్రవాళ్ళు కూడా వాటిని ఉపయోగించటానికి ఎగబడటంతో అమ్మకం లక్షల్లోకి పెరిగింది. సాధారణంగా ప్రతి విషయంలో జరిగేటట్టే దీన్నికూడా పోలీసులు గమనించి సీరియస్‌గా తీసుకొని, అమ్మకాన్ని రద్దు చేసే సరికి



రెండు సంవత్సరాలు పట్టింది. అప్పటికి చిన్న చిన్న వ్యాపారస్తులు కూడా ఈ లైన్‌లోకి దిగేరు, పోలీసులు 'బాన్' చేసేక కూడ చీకటి బజార్లో వాళ్ళు అమ్మసాగేరు. ఆ సమయానికే గాంధి దగ్గిర ప్లాను కొనుక్కున్న యువకుడు ఇరవై ముప్పై లక్షల దాకా లాభం చేసుకున్నాడు. ఆ లాభంలో తరువాతెప్పుడో ఓ పది వేలు ఇవ్వ బోయేడు కానీ గాంధీ వప్పు కోలేదు. "వ్యాపారం వ్యాపారమే కదా-నేను నాప్లాను అయిదొందలకి అమ్మేను అదే చాలు" అని తిరస్కరించాడు. అదంతా వేరే సంగతి..............

మూడోరోజు గాంధీ దగ్గిరకు వచ్చినవాడు ఒక వృద్ధుడు. ఆయనకి నలుగురు ఆడ పిల్లలు. చాలా కాలం టీచరుగా పనిచేసి రిటరయ్యేడు. ఎవరో చెప్పేర్ట—ట్యూటోరియల్ కాలేజీ పెడ్తే లాభసాటిగా వుంటుందని. దాంతో పెద్దపిల్ల పెళ్ళికోసం వుంచిన కొద్ది డబ్బుతో కాలేజీ ప్రారంభించి, ఆర్నెలల్లో డబ్బు హారించుకుపోగా రెంటికి చెడ్డ రేవడి అయ్యాడు: గాంధీ ఆయనతో అన్నాడు— "ఈ వయసులో మీరేం చెయ్యగలరు మాస్టారూ? మీరేం రిస్కు తీసుకోగలరు?"

"అలా అనకు బాబూ—ఆయిదుగురం గన్నేరు పప్పు నూరుకొని కూర్చొని వుండగా నీ ప్రకటన చూసేం. ఆఖరి అవకాశాన్ని దేముడే ఆ రూపంలో పంపేడు అనుకున్నాను. చావటానికి సిద్ధపడిన వాణ్ణి ....దేనికైనా తెగిస్తాను. ఏం చెయ్యమంటావో చెప్పు" అన్నాడు వృద్ధుడు.

గాంధీ కొద్దిసేపు ఆలోచించి "ఒక చిన్న ప్రకటన పత్రికల్లో ఇవ్వండి." అన్నాడు ఆయన తన దగ్గిర అంత డబ్బు లేదంటే గాంధీయే తను క్రితంరోజు సంపాదించిన దాన్లో ఓ రెండొందలు ఇచ్చి ఇలా ప్రకటన వేయించేడు.

దైవాధీనం ట్యుటోరియల్ కాలేజీ

యు.తీ యువకులకు మహదావకాశం

బి. యే., బీ. కామ్., లకు తర్ఫీదు ఇవ్వబడును. మా కాలేజీలో మరో విశిష్టత కలదు. గవర్నమెంటు అప్రూవల్‌తో సెక్స్ ఎడ్యుకేషన్ కోర్సు కూడా చేర్చ బడుతున్నది. కొద్దిసీట్లు మాత్రమే... త్వరపడండి. ప్రాక్టికల్సు కూడా కలవు. సైన్సు స్టూడెంట్లకు ... ప్రాస్పెక్టస్ కోసం అయిదు రూపాయలు డ్రాఫ్టుతో వెంటనే వ్రాయండి.

అడ్రసు ....

ఈ ప్రకటనతోపాటూ మాష్టారిచేత యూనివర్సిటీకీ, గవర్నమెంటుకీ — తమ కాలేజీలో సెక్స్ ఎడ్యుకేషన్ కోర్సు పెట్టుకోవటానికి అనుమతి ఇవ్వవలసిందిగా అభ్యర్థన పెట్టించాడు. అనుకున్నట్టు వాళ్ళ దగ్గిర్నుంచి జవాబులేదు. అయితే పేపర్లో ప్రకటనకి మాత్రం మొదటిరోజు పదీ, రెండోరోజు నాలుగొందలు, మూడోరోజు ఆరువేలు, నాలుగోరోజు పన్నెండువేలూ అప్లికేషన్లు వచ్చేసేయి. దాదాపు నెల అయ్యాక-ఇరవై అయిదు వేల అప్లికేషన్లు వచ్చేక, ప్రాస్పెక్టస్‌తో పాటూ అభ్యర్థులకి ఒక ఉత్తరం పంపబడింది. సెక్స్ ఎడ్యుకేషన్‌కి ప్రభుత్వం సుముఖంగాలేదనీ— అందువల్ల ఆ కోర్సు తొలగించబడిందనీ! ఒక ఉద్దండుడు "చీటింగ్" కింద కేసుపెట్టాడు గానీ, ప్రకటనలోనే 'గవర్నమెంటు అప్రూవల్‌తో....' అని వుండికాబట్టి అది మోసంక్రింద రాదని కేసు కొట్టేసేరు. మొత్తం మీద మాష్టారు లక్షదాకా సొమ్ము చేసుకున్నారు. చాలా చిత్రం ఏమిటంటే ఫీజుకాదు కదా గాంధీ అప్పుగా ఇచ్చిన రెండొందలుకూడా తిరిగి ఇవ్వకుండా మొహం చాటు చేసేడు ఆయన.

ఇది జరిగేక లక్ష్మితో అన్నాడు గాంధీ "...చూసేవా! సాధారణంగా రిటైరైన మాష్టారూ, నలుగురు ఆడపిల్లల తండ్రీ అనగానే కథల్లో కరుణ చూపించవలసిన పాత్ర అనుకుంటాం. కానీ నిజ జీవితంలో చూడు ఎలా ప్రవర్తించేడో!"

"డబ్బు" అంది లక్ష్మి "....అది ఎంత పనైనా చేస్తుంది. విలన్‌ని హీరోని చేస్తుంది. హీరోని విలన్‌ని చేస్తుంది." ....గాంధీ ఆమెవైపు అనుమానంగా చూసి "నన్ను దెప్పి పొడవటంలేదుకదా నువ్వు" అని అడిగేడు కొద్దిగా కోపంతో. ఆమె నవ్వి 'అదేం లేదులే' అని "ఈ అనుభవాన్ని జీవితాంతం గుర్తుంచుకోవాలి నువ్వు! గుర్తుంచుకో....... బిజినెస్‌లో ఎవర్నీ-చివరికి కట్టుకున్న భార్యని కూడా నమ్మక..." అంది........

....గాంధీ ప్రకటనకి నాలుగోరోజు రావల్సిన వ్యక్తి రాలేదు, పార్కులో చాల సేపు వేచి చూసి, గాంధీ ఇంటికి నిస్పృహగా తిరిగి వచ్చేసేడు. మొత్తం నలుగురిలో,

ఒకరితో బేరం కుదర్లేదు. ఇద్దరికి రెండు ప్లాన్లు అమ్మేడు. ఆ రోజునాటికి నికరాదాయం మూడొందలు తేలింది. అదేమంత లాభసాటి ప్రారంభం కాదు.

అయితే అతడు వూహించని విధంగా రెండ్రోజుల తర్వాత ఒక వ్యక్తి వచ్చి గాంధీని కార్లో ఒక భవనానికి తీసుకెళ్ళాడు. చాలా నిశ్శబ్దంగా వుందా భవంతి. అందంగా అలంకరింప బడివున్న ఒక గదిలో నలభైయేళ్ళ వయస్కుడు కూర్చొని వున్నాడు. "వెల్ కమ్" అన్నాడు గాంధీని చూసి నవ్వుతూ. "క్షమించు, నువ్వు కలుసుకొమ్మన్నట్టు పార్కులో కలుసుకోలేక పోయాను. నిన్ను ఇక్కడికి రప్పించుకొన్నాను."

గాంధీ విస్మయంతో చుట్టూ చూసేడు. చాలా ఖరీదైన గది అది. తను ఇచ్చిన ప్రకటన అంత డబ్బున్న వాడిని ఆకర్షిస్తుందని అతడు వూహించలేదు. గాంధీ ఆశ్చర్యం నుంచి తేరుకోక ముందే అన్నాడు, "చెప్పు నీ ప్లానేమిటి? ఎంతకు అమ్ముతావు?"

గాంధీ, తన మామూలు పాయింట్లు, ఎంత పెట్టుబడి పెడ్తారు — న్యాయబద్ధంగానా—పోలీసులకు తెలిసినా పర్లేదా—వగైరా వగైరా ప్రశ్నలు అడిగేడు. అతడు నవ్వి, "పదిలక్షలు పెట్టుబడి పెడ్తాను. న్యాయబద్ధమైనా, న్యాయరహితమైనా పర్లేదు. చెప్పు నీ ప్లానేమిటి?" అన్నాడు.

గాంధి షాక్ తిన్న వాడిలా చూసేడు. పది లక్షలు! అతడు చాలా సేపు మౌనంగా వుండి, "అంత పెద్దప్లాను నేను ఆలోచించలేదు. నా ప్రకటన చూసి, ఏదో చిన్న వాళ్ళు వస్తారనుకున్నాను." అన్నాడు.

"పర్లేదు. ఇప్పుడు నేను చెబుతున్నానుగా ఆలోచించి నాకో ప్లాను ఇవ్వు. ఇవ్వగలవా."

"ఇవ్వగలను." ధీమాగా అన్నాడు గాంధీ.

"ఇవ్వు. నీకు పాతిక శాతం కమీషన్ ఇస్తాను."

గాంధీ ఇబ్బందిగా చూసేడు.

ముక్కూ మొహం తెలియని వ్యక్తితో బిజినెస్ చెయ్యకూడదు, భాగస్వామి అవకూడదు,

"క్షమించండి. కమిషన్ పద్ధతి మీద నేను నా ప్లాను అమ్మను" అన్నాడు. అతడు నవ్వి "ఇప్పటి వరకు నీ ప్లాన్ల మీద ఎంత సంపాదించావు? అని అడిగేడు. గాంధీ "అయిదొందలు" అన్నాడు-మేష్టారికి రెండొందలు అప్పెట్టిన విషయం దాచిపెట్టి. అతడు ఆదేనవ్వుతో "సరే అయితే-నీప్లాను అయిదువేలకి నేను కొనుక్కొంటాను. ప్లస్ అయిదు శాతం కమీషను—నీ ప్లాను వల్ల నాకు ఎంత వస్తే అందులో నూటికి అయిదు రూపాయలు సరేనా,"

"సరే" నన్నాడు గాంధీ. అయిదు వేలకే అతను సంతోషంగా వప్పుకొని వుండేవాడు.

"రెండ్రోజుల పాటు బాగా ఆలోచించి ప్లాను తయారు చేసి వుంచు. నేను నిన్ను ఎలాగో ఒకలాగా కలుసుకుంటాను."

"పార్కులోనే కలుసు కోవచ్చుగా" అడిగాడు గాంధీ. అతడు నవ్వి—"పెద్ద పెద్ద

ప్లాన్లు తయారుచేస్తానంటున్నావ్—ఇంత చిన్న విషయం నీకు తెలీదా? నీ మీద పోలీసు నిఘా వుంది." అన్నాడు. గాంధీ ఉలిక్కి పడ్డాడు. అతడి మొహం పాలిపోయింది. తన ప్రతిజ్ఞ ప్రకారం యాభై లక్షలు సంపాదించనీ—సంపాదించకపోనీ—పోలీసుల దృష్టిలో పడకూడదు. సంపాదిస్తే న్యాయబద్ధంగానే సంపాదించాలి. అది తన ఆశయం. కానీ.... కానీ.... ఇదేమిటి?

"అవినాష్ నిన్ను అంత సులభంగా వదిలి పెట్టటానికి కారణం ఏం? అతడు మూర్ఖుడు కాడు. నీ ప్లానులు ఏమిటో తెలుసుకోవాలనే నిన్ను వదిలి పెట్టాడు. వదిలేసినట్టు నటించాడు. నిన్నా-మొన్నా అంతకు ముందు రోజు పార్కులో నువ్వు మాట్లాడటాన్ని పోలీసులు గమనిస్తూనే వున్నారు. అయితే అదృష్టవశాత్తు వాళ్ళు నిన్ను కలుసుకోక పోవటం నిన్ను రక్షించింది. నువ్వు ఎంత న్యాయబద్ధంగా సంపాదించాలని చూసినా పోలీసులు నిన్నో కేసులో ఇరికించదల్చుకుంటే ఎవరు ఆపలేరు. అలాగే నువ్వు అన్యాయంగా సంపాదించి, సమాజంలో పెద్దమనిషిగా చలామణీ అవ్వొచ్చు. కాబట్టి న్యాయం అనేదానికి అర్థం లేదు. అవినాష్ నిన్ను వదిలిపెట్టినట్టు నటించి, నీ ద్వారా నన్ను కనుక్కోవటానికి ఎత్తు వేశాడు. అయితే అతడి కంటే మనం తెలివైన వాళ్ళం.."

"మీ రెవరు?"

అతడి మొహంమీద నవ్వు మాయమైంది. "....ఒకప్పుడు నీలాంటి వాణ్ణి. ఇంజనీరింగు చదివి—నలుగురు సలహా వుద్యోగం దొరక్క- జీవితనాన్ని చేతకాని తనంగా భావించే ఈ సమాజంతో విరక్తి చెంది, దీని లొసుగుల్ని ఆధారం చేసుకొని లక్షలు సంపాదిస్తున్న వాణ్ణి. నా పేరు రామ్‌తీర్థ"

○ ○ ○ ○ ○ ○

గాంధీ ఇంటికి వచ్చేసరికి అతడికి ఒక కవరు తెచ్చి ఇచ్చింది లక్ష్మి.... "ఏమిటిది"—విప్పుతూ అడిగేడు గాంధీ "తెలీదు. ఎవరో కుర్రవాడు తెచ్చి ఇచ్చేడు" అన్నది లక్ష్మి. గాంధీ కవరులోంచి ఒక కాగితం తీసి చదివేడు. ముత్యాల్లాంటి అక్షరాల్తో గుండ్రంగా వ్రాసివుంది అందులో.

"—ఈ రోజు మా ఇంట్లో చిన్న ఫంక్షనుంది. సాయంత్రం నాలుగున్నరకి రాగలరు. తప్పకుండా రావాలిసుమా"—హారిక.

"ఎవరు" అని అడిగింది లక్ష్మి. "—రామ్మోహనరావుగారి అమ్మాయి". అన్నాడు గాంధీ కాగితాన్ని చింపి నలిపేసి మూలకి విసిరేస్తూ. "టైమెంతయింది?"

లక్ష్మి పొంగ పైన వున్న కన్నంలోంచి లోపలికి పడుతున్న సూర్యకిరణం ఎక్కడ పడుతుందో వంగిచూసింది. గోడమీద బొగ్గుతో రకరకాల వృత్తాలూ, సరళరేఖలూ గీచి వున్నాయి. నిముషంపాటు లెక్కవేసి మనసులో గుణించి, "నాలుగుంపావు" అన్నది. 'అమ్మో.... టైమయింది' అంటూ గాంధీ వడివడిగా బైటకి నడిచేడు.

అతడు.... వెళ్ళేసరికి సరిగ్గా నాలుగున్నర అయింది. మామూలుగానే గేటు దగ్గిర గూర్ఖా ఆపుచేసేడు—గానీ, హారిక పేరు చెప్పేసరికి లోపలికి పంపించేడు. గాంధీ ఆశ్చర్యంగానే వుంది - హారిక తనని ఫంక్షన్‌కి పిలవటం....అతడికి ఎందుకో రామ్మోహనరావుని అంత తొందరగా కలుసుకోవటం ఇష్టం లేదు. అయితే దురదృష్టవశాత్తూ రామ్మోహన

రావ్ అతడికి వరండాలోనే ఎదురుపడ్డాడు. ఆయనేదో హడావుడిలో వున్నట్టున్నారు. అతడిని చూస్తూనే మొహం చిట్లించి—"నువ్వా—ఇప్పుడెందుకొచ్చావ్" అన్నారు. గాంధీ ఏదో అనబోయేటంతలో ఒక ఖరీదైన కారు లోపలికి దూసుకువచ్చి ఆగింది. అందులోంచి ఒక ముసలాయనా, ఒక సూటుయువకుడూ దిగేరు. వాళ్ళని చూడగానే రామ్మోహన రావ్ మొహం విప్పారింది. సంతోషాన్ని గొంతునిండా నింపుకొని "రండి. రండి. మీ కోసమే చూస్తున్నాం" అని ఆహ్వానించేడు. అందరూ లోపలికి వెళుతుంటే కార్లో వచ్చిన ముసలాయన ఆగి, అక్కడే నిలబడి వున్న గాంధీని చూసి "....ఇతడు?" అన్నాడు ఏదో చెప్పబోతూ. చౌకబారు బట్టల్లో తన పక్కనే నిలబడివున్న గాంధీని చూసి-క్షణంలో వెయ్యోవవంతు పాటూ రామ్మోహనరావు కళ్ళలో కోపం విసుగు కదలాడేయి. కానీ చప్పున అంతలోనే సర్దుకొని, "—మా కుర్రవాడే ఏంకావాలో చెప్పండి" అన్నాడు.

ముసలాయన గాంధీతో "మా డ్రైవర్ని ఎక్కడికీ వెళ్ళొద్దని చెప్పు-కొద్దిగా ఖాళీ దొరికితే టీకి పోతాడు" అని, రామ్మోహనరావ్‌తోపాటు లోపలికి నడుస్తూ "ఈ నౌకర్లకి బుద్ధి లేదండీ-మంచివాళ్ళు దొరకడం కూడా కష్టమే" అన్నాడు. ఆ మాట సూటిగా గాంధీ గుండెలకి తగిలింది. అతడి మొహం రక్తం లేనంతగా పాలిపోయింది. నిశ్చేష్టుడై నిలబడి పోయేడు.

ఆ నిశ్శబ్దంలో-స్తంభాలమధ్య స్తంభంగా నిలబడిపోయిన గాంధీ- పక్కనుంచి ఇంకెవరో నౌకరు వెళ్ళటం చూచి, తేరుకొని, "హారికగారున్నారా" అని అడిగేడు. ఆ ముసలి నౌకరు అతడివేపు చిత్రంగాచూసి, "లోపలున్నారు. ఈ రోజు పెళ్ళిచూపులు కదా" అనేసి లోపలికి వెళ్ళిపోయేడు.

గాంధీ దవడ కండరం బిగుసుకుంది.

(ఇంకా వుంది)




స్వీట్ సిక్స్టీన్

పదహారేళ్ళ ప్రాయం చేసే చిలిపి తనానికి కోటి దండాలన్న కవికి కోటి దండాలు- అంత తియ్యగా చెప్పినందుకు.

నా పదహారో యేట – తల్చుకుంటే నవ్వొస్తుంది. నిజంగా నేనేనా అలా చేసిన దని! మా తాతగారింట్లో ఉండి చదువు కున్నాను నేను.

ఆ రోజుల్లో తాతగారింట్లో కొత్తగా మేడ మీద అద్దెకు దిగేరు ఓ డాక్టరు గారు. మరో ఊరినుండి మా ఊరు ట్రాన్స్ఫర్ అయిందాయనకి. ఇద్దరు కొడుకులు, ఓ కూతురు. పెద్దబ్బాయి రమేష్ ఇంటర్లో చేరాడట ఆ సంవత్సరమే. చిన్నబ్బాయి శంకర్ నాక్లాసే. మా ఊరొచ్చే ముందరే ఏదో జబ్బుచేసి ఆ డాక్టరు భార్య హటాత్తు చనిపోయిందట. వాళ్ళు బాగా కలవాళ్ళు-సంస్కారులు.

మా తాతగారూ డాక్టరుగా నే



రిటైరయి ప్రైవేటు ప్రాక్టీసు చేస్తూండే వారు. మా తాతగారికీ, ఆ డాక్టరు గారికీ వయస్సులో ఎంతో తేడా ఉన్నా చాలా స్నేహంగా కలిసి పోయారు. ఆయన ఎన్నో సార్లు కంట తడిపెట్టుకుంటూ ఆయన భార్య రూప లావణ్యాలు, గుణగణాలు— తెలివి తేటలు ఏకరువు పెడుతుంటే వాళ్ళ పాపతో ఆడుకుంటూ నేను వింటూండే దాన్ని. చాలా బాధనిపించేది. వాళ్ళ కుటుంబం చాలా పెద్ద కష్టానికి గురైంది. ఏంచేసి వాళ్ళని సంతోష పెట్టగల నని పించేది.

రమేష్ చాలా గంభీరంగా ఉండేవాడు, నాతో చదివే శంకర్ బొత్తిగా ఆడపిల్లలా సిగ్గుపడుతుండేవాడు. ఎక్కువ మాట్లాడక పోయినా ఎందుకో రమేష్ నెక్కువ అభి మానించేదాన్ని నేను.

ఆ రోజు దీపావళి. ఇంట్లో చేసుకున్న పిండి వంటలు డాక్టరు గారింట్లో ఇచ్చి రమ్మని పంపింది అమ్మమ్మ నన్ను. నేను వెళ్ళే సరికి డాక్టరు గారు లేరు. రమేష్ కళ్ళు తుడిచేసుకొని లోపలికి వెళ్ళిపోయేడు. శంకర్ దిగులుగా కూచున్నాడు. పిండి వంటలు టేబిల్ మీద పెట్టి, దగ్గరగా వచ్చి ఏం అలా ఉన్నావని అడిగేను. వాళ్ళమ్మ గుర్తు వచ్చిందని చెప్పి ఏడ్చేసాడు. నా కెందుకో అప్పుడూ, ఇప్పుడు కూడా ఏడ్చే వాళ్ళు చాలా నా కంటే ఎంతో చిన్న వాళ్ళుగా కనిపిస్తారు.

ఆ రోజేమిటో నాలో చిత్రమైన

కమలా శాస్త్రి

"జ్ఞాపకం"

హృదయ తిమిర గర్భంలో
అశ్రుధూమాన్ని వదులుతూ
అనాది నుండి కాలే అగరవత్తి....
జ్ఞాపకం—

కాల వల్మీకంలోకి
కదలిపోతూ ... అనుభవ సర్పం
వదలి వెళ్ళిన కుబుసం జ్ఞాపకం—
ప్రణయ చరిత్ర పేజీల నుండి
రక్తం కక్కుకొంటూ
రాలిపోయిన అక్షరం ..జ్ఞాపకం—
ఆనందమయ జీవన గృహంలోకి
అప్పుడప్పుడు అంధకారాన్ని
ప్రసరింపచేసే గవాక్షం
జ్ఞాపకం—

హృదయ భూగర్భంలో
పాతిన అనుభవాల శవాలపై
అందంగా కట్టబడిన సమాధి....
జ్ఞాపకం —

వీరపల్లె వీణావాణి

ఆవేశం చెలరేగింది. వెంటనే డాక్టరుగారి పేరున ఓ ఉత్తరం రాసి పోస్ట్ చేసాను- చాలా ముసలి భాషతో; మొత్తాని కా ఉత్తరం సారాంశ మేమిటంటే - ఆయన పిల్లలను నేను తల్లిలా చూస్తానని, నన్ను పెళ్ళి చేసుకోమనీ, నేనిలా రాసినట్టు ఎవ్వరికి చెప్పవద్దని కూడా రాసేను.

ఆయన జవాబివ్వలేదు. ఆ విషయం గురించి నాతో ఎప్పుడూ మాట్లాడనూ లేదు. నా ఉత్తరం అందలేదన్న మాట. పోన్లే, ఇంతతో వదిలింది. తాత గారికి తెలిస్తే ఎంత గొడవ జరిగేదో! అని సంతృప్తి పడ్డాను.

తర్వాత నేను బి. యస్సి, ఎమ్మెస్సీ కూడా చేసాను. అప్పుడప్పుడు నే చేసిన తెలివితక్కువ పని గుర్తొచ్చి అదోలా భయం వేసేది ముందులో, తర్వాత నవ్వు వచ్చేది. నా ఇరవై ఆరో యేట పెళ్ళయింది.

ఒక సారి రాజధాని ఎక్స్‌ప్రెస్ లో ప్రయాణంచేస్తున్నాం, మావారూ, నేనూ, మా మూడేళ్ళ పాప. మా ఎదురు బెర్త్ లో మనిషి—ఎవరో కాదు - ఆనాటి డాక్టరు గారు! ఎంతో ముసలిగా అయి పోయారు. మా వారిని పరిచయం చేసాక బోలెడు కబుర్లు చెప్పుకున్నాం.

మా పాప ఒకటే అల్లరి చేస్తోంది. "వాళ్ళమ్మలా గే గొప్ప దూకుడు! అన్నారు" మా శాంతమూర్తి నవ్వుతూ.

"ఇంత దూకుడు పిల్లల్ని చాలా జాగ్రత్తగా పెంచాలి సుమండీ! లేక పోతే, చాలా కష్టం — పదహారేళ్ళ వయసులో ఏభై ఏళ్ళ వాడిని పెళ్ళాడతానన్న దూకుడు పిల్లల్ని కూడా నాకు తెలుసు" అంటూ గమ్మత్తుగా నవ్వేరాయన. నేనొక్క సారి అదోలా అయిపోయాను.

బండి ఆగిందో స్టేషన్లో. "ఏం దూకుడు పాపాయ్! వెళ్ళనా ఇక. బెస్ట్ ఆఫ్ లక్!" రహస్యంగా అంటూ గమ్మత్తుగా నవ్వుతూ దిగేరాయన. నేనూ నవ్వేసాను హాయిగా.

నేనా నాడు చేసిన పని మా వారికి చెప్పకుండా ఉండలేకపోయాను - ఆయన పెద్దగా నవ్వేసి, "ఏదో మంచివాడు కనుక ఆ డాక్టరు ధర్మమానని నువ్వు నాకు దక్కేవు కానీ అందరూ అంత మంచి వాళ్ళుండరు. ఎందుకేనా మంచిది మన పాపని టీనేజ్‌లో కాస్త జాగ్రత్తగా చూసుకో—అనుభవశాలివి కదా!" అన్నారు కొంటెగా. ■

రంగారావూ నేనూ బాల్య స్నేహితులం.

బడి ఆవరణలో తంగేడు చెట్లమీద కోతి కొమ్మచ్చు లాడటం; మద్దికాయలు కోసి వాటిని కొబ్బరి ఈనెలకి గుచ్చి గాలి లోకి ఎగరేస్తూ అవ్వాయి చువ్వాయి లాడటం; మా పెరట్లో వేసవి సెలవల మధ్యాహ్నాలలో పదిమంది పిల్లల్ని పోగేసి వాళ్ళకి పోటీ పరీక్షలు పెట్టి బలపాలు బహుమతులుగా యివ్వడం- ఇలా అనేకానేక కార్యక్రమాల్లో మేమిద్దరమూ వొక జట్టుగా, భాగస్వాములుగా వుంటూ వుండే వాళ్ళం—గోదావరి సాక్ష్యంగా!

రంగారావ్ వాళ్ళది కలిగిన కుటుంబం కిందే లెఖ్ఖ. ఎస్సెల్సీతో చదువు ఆపి వ్యవసాయంలో పడిపోయాడు అతను. నేను విశాఖపట్నం పోయాను—పై చదువుల కోసం.

విశాఖలో డాక్టరుగా బోర్డు కట్టినా, రాజమండ్రితోనూ, రంగారావ్ కుటుంబంతోనూ నా పరిచయం అలాగే సాగిపోతూ వుంది.

పెళ్ళి పేరంటాలు పూర్తిచేసి, కుటుంబాల్ని స్థిరపరిచి, రంగారావ్‌కి వో కూతుర్నీ, నాకొక కొడుకునీ యిచ్చి— తన పరిణామ ధర్మాన్ని తాను నెరవేర్చింది కాలం.

రంగారావ్ చెల్లెలు వరమ్మ పెళ్ళి గొడవలూ అవీ— అతని తండ్రికీ, అతనికీ, కొంత క్షోభనీ, కొన్ని అవాంఛనీయ పరిస్థితుల్నీ కలిగించటం, వాటి వివరాలూ నాకు బాగానే తెలుసు.

పాతికేళ్ళ తర్వాత—ఇప్పుడూ రంగారావ్‌కీ నాకూ మధ్య ఆ సాన్నిహిత్యం, చనువు, ఆత్మీయత, అనుబంధం, మైత్రీ- అన్నీ అలాగే నిలిచి వుండటం మా యిద్దరి అదృష్టమూను.

o o o

రంగారావ్ కారాలూ మిరియాలూ నూరటం ఆపి భార్యకేసి సాలోచనగా చూసాడు; 'నీఅభిప్రాయం ఏవిటి' అన్నట్టు.

వసుంధర చీరెకి 'ఫాల్స్' కుట్టుకుంటోంది.

"మీరనేదే బాగుంది. మీ వుద్దేశ్యం అమ్మాయికి చెప్దాం"

"చెప్పటం కాదు, చెప్పి ఒప్పించాలి. మొన్న ఆ మాటని తాను మాటవరసకే అన్నదో, మనస్ఫూర్తిగానే అన్నదోగానీ— నాకు మాత్రం అప్పట్నుంచీ వొళ్ళంతా దురదగుంటాకు పులిమినట్లే వుంది"—ఒకసారి కుర్చీలోంచి లేచి హాల్లో వో మూలకి నడిచి, అక్కడ టేబుల్ మీది దిన పత్రికని చేతుల్లోకి తీసుకుని, నాలుగు మడతలు వేసి ఎడమ అరచేతిలో వోసారి కొట్టుకుని-మళ్ళీ దాన్ని టేబిల్ మీద గిరాటేశాడు. వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"చిన్నంతరం పెద్దంతరం లేకుండా ఇలా మాట్లాడ కూడదని కూడా చెప్పు"

'ఊ' అని దీర్ఘం తీసింది వసుంధర.


రంగారావ్ ఈసారి తన కెదురుగా వున్న టీపాయ్ మీది వార పత్రికని తిరగేయసాగేడు.

"శారద జోక్‌గానే అని వుంటుంది. ఈ యింటి మీది కాకి ఆ యింటిమీద వాలి పాతికేళ్ళయిందని దానికి తెలుసు. ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ అభిమానాలూ, ప్రేమలూ మనకేం వద్దు. ఎంత పూసుకుందామన్నా అంటనిది అంటనే అంటదు. అది పసిపిల్ల. దానికేం తెలుసు?"

రంగారావ్‌కి వసుంధర సంభాషణ నచ్చింది. సంతృప్తిగా నిట్టూర్చేడు. మొహాన్న అప్పటి వరకూ తాండవించిన మిట్ట మధ్యాహ్నపు ఎండ పలచబడింది.

"శారదతో నేను వివరంగా మాట్లాడుతానులెండి. వరమ్మంటే అత్తయ్య అనే దాని ఊహ. ఆవిడ అతిశయం, గర్వం— అన్నింటినీ మించి ఆమె పట్టుదల—ఇవన్నీ శారదకేం తెలుసు?"

"ఆయన చేసిన నిర్వాహకం మాత్రం





ఏపాటిది? మా నాన్న అన్న ఒకే ఒక్క మాటకి బంధాలన్నీ తెంచేసుకు పోయాడు. పైగా ఎంత రాద్ధాంతం చేశాడు? తలచుకుంటే ఇప్పటికీ రక్తం మరిగిపోతుంది. ఎంతైనా ఆడపిల్ల వాళ్ళం కదా అని మేమంతా సర్దుకు పోదలచుకుని చప్పబడ్డామా? ఆ తర్వాత మాత్రం - సంక్రాంతి పండక్కి రమ్మని కబురు పెట్టే, పెద్దవాడనే గౌరవం కూడా లేకుండా— 'ఏదో ఓ మిషతో నన్ను దువ్వాలని ప్రయత్నించకండి. కాశీ పతి పట్టుదలంటే కాటితో పోవాల్సిందే. ఇక మీదట ఆ యింటి నుంచి ఏ వార్తలు అందినా తలలు తెగుతాయ్' అని సమాధానం పంపుతాడా?"

"ఇంతకీ మా నాన్న చేసిన అంత ఘోరమైన నేరం, ఏమిటి? 'మా వరమ్మ అమాయకురాలు కనుక నీ వలలో పడింది. దాని సుఖాన్నే ఆశించాను కనుక నేనూ తలవూపేను. లేకపోతే ఈ కులహీనపు పెళ్ళి జరిగేదే కాదు' అన్నాడు. అంతేగా"— ఉక్రోషంగా గద్దించాడు రంగారావ్.

"నిజం మాట్లాడితే నిష్ఠూరంగానే వుంటుంది మరి. మీ చెల్లెలూ ఆయనకే వంతపాడి ఈ పాతికేళ్ళూ పుట్టింటి పసుపు కుంకుమనే వద్దనుకుని భీష్మించు క్కూర్చోలేదా? చెల్లెలు కదా అని మీరు మెత్తబడితే పడతారేమో — ఎందుకైనా మంచిది—నేను ముందే నిక్కచ్చిగా చెప్తున్నాను. ఈ సంబంధం నాకు సుతరామూ ఇష్టంలేదు.'

చీరెని పక్కన పడేసి కుర్చీలో సర్దుకు కూర్చుంది— వసుంధర.

రంగారావ్‌కి కొంచెం చిరాకేసింది. విసుగ్గా భార్యకేసి చూసేడు.

"చొప్పదంటు సందేహాలు తీసుకురాకు. నేను మెత్తబడే ప్రసక్తే లేదు. ఆనాడు మానాన్న కులహీనం పెళ్ళి అని మాత్రమే అన్నాడు. ఈ నాడు నేను కులహీన పెళ్ళే కాదు, వరహీన పెళ్ళి అని కూడా అనాల్సొస్తుంది. శారద ఎం.ఏ. రేపో మాపో డాక్టరేట్ కూడా తీసుకుంటుంది. అదిప్పుడు లెక్చరర్. వాడో-ఇంటర్ పాసై-చేతులకి మకిలీ, ఒంటికి మడ్డీ, మొఖానికి జిడ్డూ పట్టించుకుంటున్నాడు - కార్లు బాగు చేసుకుంటూ."

ఎద్దేవగా అన్నాడు.

"గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నా రెండు తరాలకు సరిపడే ఐశ్వర్యం వుంది గ్గా, అదీ వాళ్ళ ఘనతా, గర్వమూ" వసుంధర లేచి వంటింటి కేసి నడిచింది.

"ఆ ఘనతలూ, గర్వాలూ నా పిల్ల పదోతరగతి మార్కుల ముందు బలాదూరు" వెటకారంగా అని, కాళ్ళు రెండు పైకి పెట్టుకుని ఊపిరి పీల్చేడు రంగారావ్, ఛాతీ నాలుగంగుళాలు పెరిగినట్లయిందాయనకు.

మరు క్షణంలో శారద మొన్న సాయంత్రం అన్న మాటలు గుర్తుకొచ్చినై.

గాలి తీసిన బెలూన్‌లా వాలుకుర్చీలో జారిపోయాడు.

o o o o

మొన్న—


ఆదివారం—

నేనూ, మా అబ్బాయి సింహాచలం కలసి కార్లో రాజమండ్రి వచ్చాం. 'అమ్మని తీసుకు వెళదాం' అన్నాడు సింహాచలం తీరా బయల్దేరే ముందు.

"ఈసారి వస్తుందిలే — ఇవ్వాళ వద్దు. ముగ్గురం వెళ్ళటం ఎందుకులే" అన్నానేను. రమాదేవి నా మాటకు సరే నంది.

—రంగారావ్‌తో చిన్ననాటి ముచ్చట్లలో పడ్డాను నేను. రీడర్‌గా తన అనుభవాలూ, యూనివర్శిటీ కబుర్లూ శారదకి చెప్తూ, లెక్చరర్‌గా ఆమె కాలేజీ విశేషాలు తాను వింటున్నాడు-సింహాచలం. వసుంధర రాత్రి భోజనాలకి ఏర్పాట్లు చేయడంలో 'బిజీ' గా వుంది.

భోజనాలైనాక అంతా ఆరు బయట కుర్చీల్లో కూర్చున్నాం. 'వాతావరణం చాలా బాగుందిరా గుర్నాథం' అన్నాడు రంగారావ్.



దశమి వెన్నెల వెలుగు నీడల చదరంగ పాళీని గీస్తోంది—వేప చెట్టు మీదుగా చల్లటి గాలి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. పిట్టగోడ బయట పిల్లలు కేరింతలు కొట్టూ ఆడుకుంటున్నారు. దూరంగా ఎక్కడనుంచో 'భళారే విచిత్రం'—సినిమా పాట మంద్ర స్థాయిలో వినిపిస్తోంది.

సంభాషణ పెళ్ళిమీదకి మళ్ళింది.

నేనే మొదలెట్టాను.

"మన రెండు కుటుంబాల మధ్యా వున్న అనుబంధం దృష్ట్యా మనం సంబంధాలు కూడా కలుపుకుంటే బాగుటుందని నా వుద్దేశ్యం. దీనికి తోడు మా సింహాచలం మనస్సు మీకు తెలుసు. వాడు శారద మీద అభిమానాన్నీ, మమతనీ పెంచుకున్నాడు. తన మనస్సులో మాటని నాకు చెప్పిన మీదట నాకూ ఏనుగెక్కినంత సంబరం కలిగింది. మా కోరికని మీరూ కాదనరనే నమ్మకం నాకుంది."

రంగారావు, వసుంధరా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. సింహాచలం వాళ్ళ సమాధానం కోసం ఉత్సుకతతో కుర్చీలో మసిలేడు. రంగారావూ, వసుంధరా మొహాల్లో తొణికిసలాడిన ఆనందాన్ని నేను గమనించి సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను.

క్షణాల తర్వాత వసుంధర అన్నది, "సిరిరా మోకాలొడ్డే అవివేకం మాకు లేదు గానీ అన్నయ్య - డాక్టరుగారి అబ్బాయి, రీడరు గారు—మేం తూగగలమా అని సందేహం" సన్నగా నవ్వింది ఆమె.

"మమ్మల్ని మరీ చెట్టెక్కించకండి" అన్నాడు సింహాచలం. నాకూ ఆ మాట



ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

పేద ప్రజల కలలు ఫలించాయి

9 నెలల స్వల్ప కాలంలోనే ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య, ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని, కీ. శే. సంజయ్‌గాంధి 5 సూత్రాల కార్యక్రమాన్ని అమలు జరపడానికి తీసుకున్న చర్యల కారణంగా పేద ప్రజలు కన్న కలలు ఫలించి వాస్తవ రూపాన్ని దిద్దుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సాంఘిక, ఆర్థిక అభివృద్ధికి వివిధ చర్యలు తీసుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను పటిష్ఠమైన, సౌభాగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని శ్రీ అంజయ్య కృత నిశ్చయంతో కృషి చేస్తున్నారు.

ఆయన సారథ్యంలో రాష్ట్రంలోని పేద ప్రజల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను జరుపుతోంది.

వాటిలో కొన్ని ఇవి :

1. పంచాయతీరాజ్, స్థానిక సంస్థల ఎన్నికలు
2. గుడిసెల భీమా పథకం
3. పంటల భీమా పథకం
4. వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులకు వృద్ధాప్య పింఛను పథకం
5. జూరాల, పోలవరం ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం
6. రైతులకు రికార్డు స్థాయిలో రుణాల పంపిణీ
7. పేదలకు ఉచిత న్యాయ సహాయం
8. కరువు బాధిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికపై మంచినీరు, పశుగ్రాసం సరఫరాకు ఏర్పాట్లు
9. వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు
10. ఇళ్ళు లేని వ్యక్తులకు ఇళ్ళస్థలాల పంపిణీ
11. ప్రజలకు కిరోసిన్, చక్కెర, ఆహారధాన్యాలు, సిమెంటు సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు
12. రాష్ట్ర సత్వర పారిశ్రామికీకరణ
13. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉచిత చర్యలు
14. జర్నలిస్టుల ట్రస్టు ఏర్పాటుకు చర్యలు
15. జాతీయ సమైక్యతా మండలి ఏర్పాటు
16. "దీనెతాలీమ్" ట్రస్టుకు పదివేల రూపాయల సహాయం
17. ఉర్దూ ఆస్థానకవి పదవి ఏర్పాటు ద్వారా ఉర్దూభాషలకు ప్రోత్సాహం
18. హైదరాబాదు పాతనగరం సర్వతోముఖాభివృద్ధికి అభివృద్ధి మండలి ఏర్పాటు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఆశీస్సులు, మార్గ దర్శకత్వం లభిస్తున్న శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో దూర దృష్టితో కూడిన విప్లవాత్మకమైన అనేక పథకాలను యిదివరకే అమలు జరపడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉజ్వల భవిష్యత్తుకు ముఖ్యమంత్రి బాటలు వేశారు.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు / నెం. 32.

నచ్చింది.

"ఇందులో మా అభిప్రాయాలెప్పుడూ మీకు అనుకూలంగానూ, మీ దొడ్డ మనసు మాకు అనుకూలంగానూ వుంటాయని మనకు తెలుసు గానీ—శారద అభిప్రాయం కూడా కనుక్కుందాం" అన్నాడు రంగారావ్.

అందరి చూపులూ ఆమెకేసి తిరిగాయి.

శారద ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా, "మీరు చెప్పేవన్నీ నిజమే గానీ—నా పెళ్ళి గురించి అక్కడా యిక్కడా సంబంధాలు చూడటం ఎందుకు నాన్నా, బావ లేడూ" అనేసి అక్కణ్ణుంచి జారుకుంది. అదీ ముసి ముసి నవ్వులతో!

శారద మాటలకి విస్తుపోవడం మా నలుగురి వంతయింది.

○ ○ ○ ○

"మీరు ఇప్పటి వరకూ వేసిన అక్షింతలూ; ఇక ముందు చేయబోయే హెచ్చరికలూ — అన్నీ కథల్లో చదివీ చదివీ, సినిమాల్లో వినీ వినీ విసుగెత్తిపోయింది. నా నిర్ణయం నేను చెప్పేశాను గదా. అంతే"

శంకరం సైకిల్ని వసారా గుమ్మం దాటిస్తూ చెప్పేశాడు.

"ఇవతల ముఖ్యమైన విషయాలు మాట్లాడుతుంటే, వీపా వినుకోమని అలా తృణీకరించి పోవడం వాళ్ళు పొగరుకి నిదర్శనం మరి" —కాశీపతి కొడుకు నిర్లక్ష్యానికి ఉగ్రుడై పోయాడు.

"లోపలికి రారా—తర్వాత వెళ్ళొచ్చు" అంది వరమ్మ,

"ఈ విషయం గురించి ఇంక మాట్లాడాల్సిందేమీ లేదు. నాకు పనుంది అవతల" అని వెనక్కి తిరక్కుండానే ముందుకు నడిచేడు శంకరం.

"తల బిరుసుదనం...." అని పళ్ళు కొరికేడు కాశీపతి.

"వాడి పాట్లు వాడు పడతాడు; పోనీండి మాట వినని పెంకి ఘటాల్ని మనమేం చేస్తాం" —వరమ్మ,

"ఏమీ చెయ్యొద్దు. చేతికి గాజులు తొడిగించుకుని కూర్చుంటా నేను కూడా—సరేనా?" ఎగిరిపడ్డాడు, కాశీపతి.

భర్త సంగతి వరమ్మకి తెలుసు. తను సమాధానం చెప్పినకొద్దీ రెచ్చి పోతాడు ఆయన. అందుకే ఇంక తను మౌనం వహించటం మంచిదనుకుని ఊరుకుంది.

"అంత ఆపిల్లే బెల్లమనుకుంటే—ఈ ఇంట్లో నుంచి బయటికి పోయి గోదార్లో దూకమను. నా గౌరవం తన కళ్ళల్లేక పోయిన తర్వాత—తన బాగోగులూ మనకనవసరం." కాశీపతి ధూము ధాములు చేస్తూనే వున్నాడు.

వరమ్మ లోగదిలోకి నడిచింది.

"తల్లి, దండ్రుల్ని క్షోభ పెట్టి, శత్రు వర్గంలోకి చేరి తను పడబోయే పాట్లు వాడికి తెలీవు. మూణ్ణాళ్ళ పట్టపగల్లో ఆ మోజు తీరుతుంది. ఇద్దరూ బొచ్చె పట్టుకు బయల్దేరతారు" కాశీపతి శాపనార్థాలు మొదలెట్టాడు

○ ○ ○


శారద-శంకరం పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళికి రంగారావూ వసుంధర గానీ, కాశీపతీ—వరమ్మ గానీ, రమాదేవి సింహాచలంగానీ రాలేదు. ఎవరిళ్ళల్లో వాళ్ళు చిందులు వేసారు.

శారద—శంకరం తమ పేర్లమీదే శుభలేఖలు అచ్చొత్తించుకుని వీళ్ళందర్నీ పిలిచారు.

పెళ్ళి కాకినాడలో జరిగింది — చాలా నిరాడంబరంగా. నేనూ మరో నలుగురు మిత్రులూ—అప్పుడున్నది.

వీళ్ళ పెళ్ళి వలన నాకో గొప్ప సత్యం తెలిసింది. పెళ్ళి కూడా పుట్టుక లాగానే యాక్సిడెంట్ అని.

శంకరం తన మకాం కాకినాడ



మార్చేడు. శారద ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నాలు మొదలెట్టింది - కాకినాడకు.

ఇరువైపులా తల్లిదండ్రులు సంబంధాలు తెంచేసుకుని, దుఃఖాన్ని పెదవుల మీద బిగబట్టుకుని, భేషజాన్నీ పట్టుదలనీ మొహాన్ని చెండుకుని భీష్మించుక్కూర్చున్నారు. కొత్త దంపతులు మాత్రం ఈ పరిస్థితుల్ని చిరునవ్వుతోనే స్వీకరించారు.

కంచు మరచెంబుకు తేలు కుట్టినట్టు నాకు గుండెల్లో ఎక్కడో నన్నని బాధ ఇదమిత్థంగా ఎందుకో చెప్పలేను.

పెళ్ళి నుంచి తిరిగి విశాఖ వచ్చాను. సింహాచలం వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. వాడి ముఖంలో ఆవేదన, కళ్ళల్లో బాధ—కొట్టొచ్చినట్టే కనిపించినై.

వాకొక్కక్కళ్ళ ఎదకూ ఎన్నెన్ని గదులున్నాయో అనిపించింది నాకు—

మజ్జిగ తెచ్చేముందరే ఉప్పుగల్లు అడగటం ఎందుకులే అన్నట్టు — వాళ్ళ సంసారం గురించి, వాళ్ళ భవిష్యత్తు గురించీ—ఎవరికి వాళ్ళం గమ్మున ఊరుకున్నాం.

నాలుగు నెలల తర్వాత—

తనకు కాకినాడ బదిలీ అయినట్టు, శంకరం స్వంతంగా 'గేరేజ్' ప్రారంభించినట్టూ-శారద ఉత్తరం రాసింది. ఉత్తరంలో విశేషాలు విని - సింహాచలం అన్నాడు, "ఇల్లు అలకగానే పండగ కాలేదు, ముందున్నది ముసళ్ళ పండగ" అని.

ం ం ం ం

రాత్రి తొమ్మిది గంటలైంది.

టేప్ రికార్డర్‌ని ట్యూన్ చేసి, తమలపాకుల ప్లేటుతో వచ్చి కుర్చీలో కూర్చుంది శారద. పక్కన వాలుకుర్చీలో శంకరం దిన పత్రికని తిరగేస్తున్నాడు.

"మీకు గుర్తుందో లేదో. మన పెళ్ళిలో నా ఫ్రెండ్ సుమిత్ర వో సంగతి చెప్పింది. 'తోరణపు చిగుళ్ళు మేస్తున్న బలిపశువులా అదివ్వాళ ముసి ముసి నవ్వులతో మధురోహల్లో తేలిపోతూనే వుంటుంది'— అని మా నాన్న అన్నాడని, నాకెందుకో అవ్వాళ ఆయనన్నాడన్న మాటలే గుర్తొస్తున్నై."

తమలపాకు చిలకని అందుకుంటూ భార్య కళ్ళల్లోకి చూసేడు శంకరం.

స్వామి ముందర వేసిన సాంబ్రాణి ధూపంలా వుందామె.

"ఇంకా ఆ ఆలోచనలని గుండెల్లో పెట్టుకుని బిగించుకోవద్దని చెప్పానా లేదా నేన్నీకు?" అన్నాడు శంకరం. చిరుకోపంలోనే లాలన ధ్వనించింది. అతను లేచి మంచంమీదికి చేరేడు.

'ఒక్క క్షణం.... ఒక్క క్షణం........ మోయలేని ఈ హాయిని మోయనీ....' పాట సాగుతోంది.

"మన పెళ్ళికి వచ్చిన దీవెనలు—వాళ్ళందరి తిట్లేగా. ఆ సంగతుల్ని మనం ఎంత త్వరగా మరిచిపోతే అంత మంచిది." శంకరం పక్కకి తిరిగి పడుకున్నాడు.

"ఎంత నిగ్రహించుకుందామనుకున్నా ఒక్కసారి మా అమ్మని చూసి వద్దామని పిస్తూనే వుంది." యథాలాపంగా అన్నది శారద.

"....పిచ్చి అంటారు దీన్నే...." తేలిగ్గా అనేసి సన్నగా నవ్వేడు శంకరం.

ం ం ం

ఐదేళ్ళు గడిచినై.

నేను కాకినాడ వెళ్ళినప్పుడల్లా శారదని చూసి వస్తూనే వున్నాను.

శంకరం—శారదల కాపరం తేనెలా తియ్యగా సాగుతున్నట్టు నాకు అర్థమౌతూ వచ్చింది.

శంకరం తన 'ప్రొఫెషన్' ని చాలా వృద్ధి చేసుకున్నాడు. ఇంట్లోకి చాలా 'స్టేటస్ సింబల్స్' చేరినై కూడా. ఒకసారి నేను వెళ్ళినప్పుడు స్కూటర్ చూపించారు. మరోసారి వెళ్ళేసరికి ఫ్రిజ్ వచ్చింది. ఇంకోసారి చూస్తే 'ఏ. సి' సెట్టు తయారైంది.

వాళ్ళ దాంపత్యం పువ్వు కంటే తేలిగ్గా సుకుమారంగా పరిమళించిపోతున్నట్టు— ఆ దంపతుల మొహాల్లో మెరిసే తృప్తీ; కళ్ళల్లో విరిసే కాంతీ-సాఖ్యం పలుకుతున్నై.

నేను కాకినాడ వెళ్ళి వచ్చినప్పుడల్లా సింహాచలం చాలా ఉత్సుకతతో శారద కాపరం గురించి ప్రశ్నలు వేసేవాడు. రంగారావూ తరచు ఉత్తరాలు రాస్తూ వున్నాడు— శారద సంగతులేవిటని విచారిస్తూ.

ఒక గాడిలో పోతున్న వాళ్ళ జీవన శకటానికి ఒక రాయి చక్రానికి తగిలింది

నాకా ఉత్తరం రాగానే హడావిడిగా కాకినాడకు ప్రయాణమయ్యాను. సింహాచలమూ కారెక్కేడు.

ం ం ం

రంగారావూ — వసుంధరా; కాశీపతీ—వరమ్మా — సింహాచలం - గురునాధం— అందరూ శారద ఆరోగ్యం గురించి ఆందోళన పడుతున్నారు. వీళ్ళంతా చేరేసరికి శంకరం ఆమెని హాస్పటల్లో చేర్చేడు.

మొదటికాన్పు కష్టమైపోయింది. ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీశారు. శారదకు మగబిడ్డ! పిల్లవాడు చాలా ఆరోగ్యంగా, దబ్బపండులా పుట్టాడు.

—శారద మామూలు మనిషయ్యింది.

ఒక రోజు రాత్రి—

అంతా, హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. శంకరంకి వాళ్ళందరి మొహాల్లోనూ ఏదో నిరుత్సాహం, కళ్ళల్లో అస్థిమితత్వం గోచరించినై. ఎవ్వరూ మనసు విప్పి మాట్లాడటం లేదని వాతావరణమే తెలుపుతోంది. ఈ బొమ్మలన్నీ ఒక మట్టితో తయారైనవే అనిపిస్తోంది - పరీక్షగా చూసిన కొద్దీ.

శంకరం గురునాధంతో అన్నాడు, "కాసేపు అలా ఆరుబయట కూర్చుందాం రండి" అని.

ఇద్దరూ వచ్చి బయట వేపచెట్టు క్రింద కూర్చున్నారు.

"మీ మామగారి ఇంటి ముందూ ఇలాగే వేప చెట్టు వుంది" అన్నాడు గురునాధం.

అదోలా నవ్వేడు, శంకరం.

క్షణాల తర్వాత అన్నాడు శంకరం, "చూడండి బాబాయ్ గారు. వీళ్ళంతా మేమిద్దరమూ తమ అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నామని శాపనార్థాలు పెట్టారు, గింజుకున్నారు, సంబంధాలు తెంచేసుకున్నారు. అయినా విచిత్రమైన విషయం వొకటి వుంది గమనించారో లేదో?"

అతను ఆగేడు. "ఏవిటది?" అడిగాడు గురునాధం.

"వాళ్ళ అంతరాంతరాల్లో వొక దొంగ కోరిక దోబూచులాడుతూ వుండనే వుంది. మేమిద్దరమూ, ఎక్కడ సుఖపడిపోతామో అనే ఆందోళన, భయం - మా కాపరం వొడిదుడుకుల పాలై మేమిద్దరమూ తెల్లజెండా ఎత్తేసి తమ కాళ్ళ మీద పడిపోతే బాగుండు నన్న సన్నటి ఆకాంక్ష. ఇదొక తమాషా 'కాంప్లెక్స్.' ఇవ్వాళిటి భయంకరమైన నిశ్శబ్దానికీ, గంభీరమైన వాతావరణానికీ ఇదే కారణం కాదంటారా?"

'గురునాధం గతుక్కుమన్నాడు. మనసుల్ని చదివి ఇంత వివరంగా పాఠం చెప్పిన శంకరం కేసి కన్నెత్తి చూడలేకపోయాడు, పన్నెత్తి సమాధానమూ చెప్పలేకపోయాడు.

అయితే—శంకరం అక్కడున్న ఐదుగురికే అన్వయించి ఆ మాటలు చెప్పాడే కానీ—తన పట్ల మాత్రం అవి నిజం కావా అనే ప్రశ్న చటుక్కున గురునాధం మెదడులో మొలిచింది. లేకపోతే తన కాకినాడ ప్రయాణాల ఆంతర్యం ఏమిటీ?

గురునాధం నీడ వేపచెట్టు నీడలో కలిసిపోయింది. ■



ఆయత్రా బాత్ఖానీ

నెల నెలా ప్రవర్తమానమగుచున్న మా జ్యోతి పత్రికలో నేను నిర్వహిస్తున్న ఈ ఫ్యూచర్ మీకు ప్రమాణ భరితమగుట మాకు సందోహద్రావకము.

కొన్ని పురపాలక సంఘాల ఆరోగశాఖలు మంచినీతి సదుపాయాలు కలిగిల్లించడం లేదట!

నూతన శిలబస్సులను అనుకరించి నేస్తున్నందువల్ల బెక్కు బుక్కులు శైల కంఠినంగా అంటోంది.

"హిమాలయ పర్వతాలకు ఉత్తరదిశలో వున్నదే భూతాల స్వర్గం"

డబ్బిచ్చి మార్కులు నేయించుకున్నవాడు చదువు కొన్నవాడు.

మళ్ళీ కాల్చుకుందాం.

ఎట్లు
ప్రూట్ లేబర్

త్రిశంకుస్వర్గభూమి

వుప్పల నరసింహం

"డిప్ట్లోకు గిర్దావర్ వొస్తే వాని సుట్టు దిర్గాలే, అమీన్‌సాబొస్తే ఆని ఎనక దిర్గాలే తహసిల్దారొస్తే సంకల కట్టి యిరికించ్చుకుని సాకలిండు, సాలిండు, ఎర్కలిండు, ఎనాదు లిండు తర్వాయిన తిర్గాలే — ఈల్లుగాక యెల్లిగాడు, మల్లిగాడు యెవడొచ్చినా ముందుగాల నా పంగ పల్లుతది — నీళ్ళు దెమ్పుడు కాడ్నుంచి కట్టెలు కొట్టేదాక యిరాం లేకుంట, రెక్కకు శైన్ లేకుంట గాడ్దిలెక్క ఒకటే పనాయే—నీయవ్వ, పనికున్నవారేతు....అరె. జెరంతనన్న ఈ శెత్ర (శరీరం)కు 'ఇరాం' ఇయ్యాలె! ఎక్కడ్డి ?—ఎద్దుకు ముల్లుగర్ర పొడ్సినట్లె ఈడుగాకుంటె ఆడు—ఆడుగాకుంటె ఈడు ఊడిబట్టనే ఉంటరు — ఒగడుగాకుంటె ఒగడు పని శెప్పుడేనాయే.... నీయవ్వ ఒతుకు కున్నవారేతు......."

అని కావలి ముత్యాలు స్వగతంలో గొణుగుకుంటూ వడివడిగా ముందుకు అడుగులేస్తున్నాడు.

తనలో పెల్లుబుకుతున్న కోపాన్ని, చిరాకను, అసహాయతను, అలసటను, ఆవేశాన్ని మరో రూపంలో వెళ్ళగక్కలేక ముత్యాలు ప్రతిసారి ఇలాగే గొణుగుతూ పనిచేస్తాడు—కదా అని చెప్పేవాళ్ళుకూడా ఇంకా కొన్ని పనులు ఎక్కువ చెపుతూనే వుంటారు—ముత్యాలు తెగించి ఒక్క మాటకూడా తన పైవాళ్ళను అనలేడు...

కావలి ముత్యాలుచేతులో కర్రవుంది—ఆకర్రకు ఒకవైపు ఇనుముతో తయారు చేసిన 'బాకు' దిగేసివుంది—తన నడకకు అనుగుణంగా కర్రను వూపుతూ నడుస్తూ వున్నాడు — కావలి ముత్యాలు నడుస్తు న్నప్పుడు, లయబద్ధంగా 'బాకు' కదలడం ఎంతో హుందాగా వుంది ఆయనకు—

ఎడమ భుజంపై గొంగడి జారుతున్నప్పుడల్లా ఎగదోసుకుంటూ అడుగులేస్తున్నాడు – ఎడమచేతికి వున్న వెండి 'కడెం' ఎండకు 'తళుక్కు' మంటోంది—ఎడమచేతి వేలికి ఉన్న రాగి ఉంగరం కూడా సూర్య కిరణాలు పడినప్పుడల్లా మెరుస్తూ వుంది—

పిడికెడు పిడికెడు మీసాలు – వెడల్పయిన మొఖం తలకు రుమాలు, చెవి ప్రక్కన రుమాలుకు ఆనుకుని సగం కాల్చిన 'చుట్ట'—చెవికి రాగిపోగు – పైకి ఎగకట్టిన ముతక ధోవతి – ముతక కమీజు-కమీజు అక్కడక్కడ చిరిగింది - కాళ్ళకు చెప్పులు లేవు – బలంగా అడుగులేస్తూ కావలి ముత్యాలు స్వగతంలో గొణుకుతూ నడుస్తూ వున్నాడు –

తెలంగాణ ప్రాంతం గ్రామాల్లో దుష్ట చతుష్టయరీగా పేరుమోసిన సర్పంచ్, కరణం, పట్వారి, పోలీస్ పటేల్ అధికార్ల ఆజ్ఞలను పాటిస్తూ, వారి వారి ఇంటి పనులుగూడ 'చేస్తూ' పై అధికారి ఎవరైనా వస్తే వారి సకల సౌకర్యాల ఏర్పాట్లలో

తల మునకలయ్యే 'కావలి' వాళ్ళలో ఒకడు ఈ కావలి ముత్యాలు — (కొన్ని ప్రాంతాలలో వీరిని 'మస్కూర్' అని గూడా అంటారు—)

గ్రామాధికార్లు ఈ కావలి వాళ్ళతో తమ ఇంటిపనులు ఎక్కువగా చేయించు కుంటారు - అసంతృప్తిని ఎలా తెలియ జేయాలో తెలియక ఒంటరిగా ఉన్నప్పుడు తిట్టడమో, గొణుక్కోవడమో చేస్తూ వుంటారు—ముత్యాలుగూడా ఆదేరకమైన అసంతృప్తిని పట్వారివద్ద వెళ్ళగక్కలేక నడుస్తూ...."నీయమ్మ కూరుకు పొద్దుగాల లేశి పంతులు (పట్వారి) ఇంటి ముంగట దీటి సలామ్ చేస్నాగాని కైకర మొఖపోడు కసురుకుంటనే వుంటడు...." అని గొణు గుతూ గొల్లకొమ్రరయ్య ఇంటిముందు ఆగాడు—

వాకిట్లో ఎవరు కనిపించకపోయే సరికి "ఓ... కొమ్రరయ్యబావా" అని పిలుస్తూ ముత్యాలు ఇంటి వసారాలోకి వచ్చాడు—

గొల్ల కొమ్రరయ్య గొర్రె బూరుతో దారం వడుకుతూ కూర్చున్నాడు కాళ్ళ మీద-కావలి ముత్యాలును చూసి "నువ్వా?" అని "కూసో అట్ల పీటమీద కూసో" అన్నాడు నిదానంగా గొల్ల కొమ్రరయ్య.

"నేనేం కూసుంతందుకురాలేదే బావా"

"పనిమీదనే వస్తే వస్తివిగాని కూసో రాదోయ్"

"బయట పనుంది శెల్లి పోవాల్నే"— ముత్యాలు.

"ఏహే....పోదువు కూసోవోస — ఎప్పు డొచ్చినా గుర్రం మీదనే వస్తవు. పోకుంటే వుండిపోమంటలేను గని కూసోని సంగతేందో శెప్పు" అన్నాడు కొమ్రరయ్య దీర్ఘం దీస్తూ.

ముత్యాలు వసారాలోని గుంజకు ఆనుకుని కూర్చున్నాడు.

కొమ్రరయ్య బుడ్డగోచి పెట్టుకుని కింద గొంగడి వేసుకుని కూర్చుని, తొడకు దారం వడికే పకును గట్టిగా రుద్ది తిప్పుతూ గొర్రెబూరుతో దారం తీస్తున్నాడు— తలకు రుమాలు-చెవికి రాగిపోగు, చేతికి వెండిది 'దండెకడెం' వుంది— రెండు చేతుల వేళ్ళకు రాగి వుంగరాలు వున్నాయి. నడుముకు వెండి గొలుసు వ్రేలాడుతూ వుంది. దాంతోపాటు పొగాకు తోలుసంచి వ్రేలాడుతూవుంది—కమీజులేదు. ఛాతిమీద వెంట్రుకలు గూడ తెల్ల బడ్డాయి— పిక్కల మీద చర్మం ముడతలు పడ్డది. మనిషి చూపులకు బలంగానే కనిపిస్తున్నాడు. మీసాలు మరింత గంభీరాన్ని తెచ్చి పెట్టాయి కొమ్రరయ్యకు—

పేడ, ఎర్రమట్టి కలిపిన వసారాలో అంతకు ముందే అలకడంవల్ల ముత్యాలుకు అదోరకమైన వాసన వేస్తుంది, ఆ వాసనే గాకుండా ప్రతి గొల్లవాళ్ళ ఇంట్లో వచ్చే "గొర్రెలమంద" వాసన వస్తోంది—

కొమ్రరయ్య దారం వడుకుతూనే "ఆ....ఏందోయ్ ఏం పనిమీద వచ్చినవ్— ఏంది కత—హా...." అన్నాడు—ఆగొంతులో బావ, బావమరదుల వరసతోకూడిన పరా చికభావం ద్యోతకమైయింది—

కావలి ముత్యాలు చెవి వెనకాల వున్న చుట్టదీసి చేతిలో పట్టుకొని.

"ఏంది ఏందే, పోయిన జేస్తారం పన్ను గట్టుమన్నాడు పంతులు అని శెప్పిపోతి నీకు — నీకు అంతగనం శెప్పినా శెవుమీద పేనే పారలేదు—ఆడ దినాం పంతులు నన్ను తిట్లు పెడుతుండు — "శెప్పినావ్‌రా కొమ్రిగానికి శెప్పినావ్‌రా" అని అడిగితె శెప్పిన పంతులు, శెప్పినపంతులు అని శెప్పవడ్తి—నువ్వేమో ఈడ అకరు పికరు లేకుంట జీవాలను సూసుకుంట దారం వడుకుంట నిమ్మలంగ కూసుంటివి—నీవని వరాకత్ గుంది - నేనేమో వానితోని, వీని తోని తిట్లు వడుకుంట నిష్టూరం గావాలే... నీయవ్వ..." అన్నాడు.

"అరె, శెప్పినవ్‌రా—శెప్పలేదని అంట లేను గదరా...."

"శెప్పినవంటవు— పన్ను గట్టక



పోతివి—వారం దినాలయిపోయె—ఆడ బోయినా కష్టమే, నిష్టూరమే—ఇగ పంతులు నా మీద గరమయితుండు-ఏమన సప్పుడు జెయ్యకుంట ఎన్ని అన్నా

పడుతున్న—ఏం జెయ్యాలే ఎక్కడ సక్కిలేక 'కావలితనం' చేశినట్టుగున్నది. అంత్ల వచ్చేది ఏంలేదు— పైకం భాగోతు లోళ్లకి, తిట్లు మంగలోనికి అన్నశాస్త్ర ముంది శాకత" హెచ్చు స్వరంతోనే అన్నాడు కావలి ముత్యాలు.

"అనంగానే పైసలు ఎత్తయా? నీ కత గాలి రెండురోజులు అటు, ఇటు అయితది— పన్నులు గట్టకుంటె అయితదా గాని!! కథతమోయ్ బామ్మర్ది..." అన్నాడు కొమ్రరయ్య 'బామర్ది' అన్న పదాన్ని వత్తి పలుకుతూ...

కావలి ముత్యాలు చుట్ట మొదలును వొత్తుతూ "జరంత ఇంగలమైన ఇయ్యి" అన్నాడు.

గొల్ల కొమ్రరయ్య దారం వడికే 'ఏకు' ను గట్టిగా తొడకు రుద్దుకుని వదిలేసి పొగాకు సంచిలోనుంచి కొంత జెక ముక దూది, రాయి ముత్యాలు వైపు విసిరాడు— ఈ లోపుగా ఏకు గిరిగిరా తిరిగి దారానికి 'కరి' వడ్డది— కొమ్రరయ్య ఏకును అందుకుని దారాన్ని ఏకుకు చుట్టాడు—•

ఎడమ చేతిలోవున్న గొర్రె బూరు, కుడి చేతిలోవున్న ఏకు క్రింద పెట్టి కొమ్రరయ్య రుమాల్లో వున్న కరికు చుట్ట దీశాడు, తానూ రెండు బుక్కలు చుట్ట త్రాగుదా మని—ముత్యాలు జెకముకతో అగ్గిజేసి కొంత తన చుట్ట మొదట పెట్టుకుని కొంత అగ్గి కొమ్రరయ్యకు ఇచ్చి, ముత్యాలు గట్టిగా రెండు దమ్ములు లాగాడు.

కొమ్రరయ్య ముత్యాలు ఇచ్చిన అగ్గిని చుట్ట మొదట పెట్టుకుని తల వంకరగా బెట్టి, నిప్పు క్రిందపడిపోకుండా గట్టిగా పొగపీల్చాడు - ఆ తరువాత ముత్యాలు వద్దనుండి జెకముక రాయి తీసుకుని తన సంచిలో వేసుకుని ఏకును, గొర్రె బూరును చేతిలోకి తీసుకున్నాడు—చుట్ట నోట్లోనే వుంది.

"ముత్యాలు గట్టిగా పొగపీల్చిన తరువాత వాకిట్లోకి ఉమ్మి,

"పైసల్ లేవంటవూ? మొన్న నేగదా జీవాలమ్మినవ్! పైసలేంజేస్తివి ఇంతలమే" అన్నాడు—

కొమ్రరయ్య పక్కకువున్న బూడిది పోసిన చిన్నడబ్బాలో వూసి,


"జీవాలమ్మితే ఏం ఫాయిదయింది— కట్టెటోనికి గట్టి, ఇచ్చెటోన్కి ఇస్తి—తెచ్చే టివి శెస్తి ఇంక వున్నాయి? పోయిన శివరాత్రి లగ్గాలళ్ళ శిన్నపొల్ల పెండ్లి జేస్తే ఐదువేల, ఖర్సయింది— మల్ల అత్త గారు ఏం బెట్టలేదు, ఏం బెట్టలేదు అని శెప్పుక తిర్గుతున్నరే —సావుకారి దెగ్గర దెచ్చిన అప్పు ఇంక తీరనేలేదు- సాలాయన దగ్గర తెచ్చిన బట్టల పైసలు ఇంక ఇయ్యనే లేదు .... ఎన్ని జీవాలమ్మితేమి—— ఎన్ని గొంగళ్ళమ్మితేముంది— షడి కాడికే అయి తుంది సంసారం—" అన్నాడు—

"మరి ఎట్లజేస్త నంటవ్ పన్నుల సంగతి?"

"ఎట్లజేశేది ఏముంది? పెద్దపోరడు ఐలయ్య అత్తగారింటికి పోయి ఐదు దినా లాయె—రేపొస్తడో మాపొస్తాడో అని రోజూ యెదిరి సూస్తున్నాం— ఆడు రాంగనే కడ్తం పో—కట్టకుంటె యాడి కన్న పోతమా?" కొమ్రరయ్య.

"యాడన్న పోవుడు సవాల్ గాదు-ఇయ్యాల గాకుంటే రేపుగట్టవు— పన్నులు గట్టక పూకోవుగాని. ఆడ రాకాసి మొఖపోడు పట్వారి పూకుంటడా——"ఏమా యెరా. పోయొచ్చినవా— వసూలు చేస్కొచ్చినవా" అని అడుగుతాడు "ఇయ్యాళ రేపట్ల గట్టనన్నడు పంతులు" అంటే ఇగమె టు కూతలు కూస్తడు—సీతల్లి ఇద్దరి పొత్తుల నేను పొట్లు దినాలే" అని కావలిముత్యాలు వాకిట్లోకి వూసి చుట్ట త్రాగడం ప్రారంభిం చాడు——

"నాదిక్కు కేలి నువ్వేందుకు పొట్లు దింటు వోయి నేనొచ్చి పంతులును కలుస్తపో— పొద్మికె జాముల పంతులు ఇంటికొస్తా పో" అన్నాడు ఏకును తొడుకు రుద్దుకుంటూ



కొమ్రరయ్య.

"వొస్తే వచ్చి మాట్లాడ్తవేమో గాని దుగ్గక్క కనిపిస్తలేదు యింట్ల?" అని అడిగాడు కావలి ముత్యాలు—

"పెద్ద పోరడు లేకపాయే. రాత్రిళ్ళ చిన్న పోరడు కిష్టయ్య పశేలు పొలంల మంద పెట్టిండు, పొద్దన్ని సద్ది తీస్క పోయింది. వస్తుండొచ్చు, శాలసేపయింది పోయి" కొమ్రరయ్య.

"జెరన్ని జొన్నలు పెట్టక పోయినవ్ బావా—తమాష్ తింతందుకు లేకుంట అయినయ్"-ముత్యాలు.

"జొన్నలు ఏడియోయ్-మేమే కొను కోని తింటున్నం— మొన్ననే పాపిరెడ్డి దగ్గర పావుపళ్ళ జొన్నలు కొనుకొచ్చిండు పెద్దపోరడు. అవి దుడిశి పోయినయ్ ఎండవోశి, శెళ్లి, యిసురుకోని రొట్టె చేస్తు న్నది మీ యక్క-" కొమ్రరయ్య-

"శెల్కల వండిన జొన్నలేమాయె బావా? అప్పుడే అయిపోయినాయా?"

కాలికి తనవైపుకు వచ్చిన గొర్రె బూరును కొమ్రరయ్య వైపుకు వేస్తూ అడిగాడు ముత్యాలు.

"శెల్కల ఏమంత పండినయోయ్ పిలగా, రోణి కార్తిల (రోహిణి కార్తెల) వాన గొట్టె-కాలుకు శేనికి యిరాము లేకుంట పొద్దు, మాపు ఇంటిల్లాపాలం మర్లాడి దున్ని మక్కజొన్న అలికితే.... తల జుట్టు లేశేయాళ్ళకు జోరు ఎండలు గొట్టె ఒక్క వాన గూడా కొట్ట పోయె. కంకెడు కంకెను కంకి అయితదను కుంటె పిడస కట్టుకుపోయి నట్టయింది. కంకి శెట్టు పైకి లేవక నేపాయె ఇగ ఇరిగిన కంకులు వాకిట్ల మంచెమీద రెన్నెల్లు వుండె. సొప్ప జెరంత అమ్మి జెరంత ఉంచుకుంటి. ఇగ మా సడ్డకుడు పడమటి కేలి వచ్చి.... 'కాలంగా లేదు ఎడు సచ్చిపోతున్నయ్' అని శెప్పి- అయినంత సొప్ప, ముత్తం మక్కజొన్నలల్ల కేలి ఒతూ మెడు మక్క జొన్నలు దీసుక పోయిండు—మిగిలిన

జొన్నలు మొన్నటిదాక మాకే ఒడిశినయ్. అవి అయిపోయినంకనే పెద్దపోరడు పావు వళ్ళ తీస్తొచ్చిండు—" అని కొమ్రమరయ్య ఇబ్బాలో పూసాడు. ఉమ్మి పూసేప్పుడు మీసాలకు అంటుకున్న తడిని రుమాలు కొసతో భుజంతోనే తుడుచుకున్నాడు—

ఆవలి ముత్యాలు సుట్టను నేలకి రాసి క్రిందరాలిన అగ్గిని కాలితో రాసి కరకు సుట్టను తిరిగి చెవి వెనకాల పెట్టుకుని వాకిట్లోకి పూసాడు.

ఇంతలోకి తలపై తట్టతో దుర్గమ్మ వచ్చి "బాగున్నావురా ముత్యాలు" అని ముత్యాలును పలకరించింది.

"ఆ....బాగున్నానక్కా" ముత్యాలు.

"మా మర్దలు బాగుందా? పోరలు ఎట్లున్నరు?"

"అందరు బాగనే వున్నరక్కా" ముత్యాలు.

"శాల దూరం వచ్చినవేం తమ్మి"— దుర్గమ్మ

"బావదగ్గర్కే వచ్చిన అక్కా"

"అట్లనా" అంటూ దుర్గమ్మ 'జారాట్లో' కాళ్ళుకడుక్కొని తట్టతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఈ సారి కాల మెట్లుందంటవే కొమ్రమరయ్య బావా?" అని అడిగాడు ముత్యాలు కొమ్రమరయ్య వైపుచూస్తూ.

"కాలం సంగతి ఎట్లచెప్పొస్తదిరా ముత్యాలు. రెండేండ్లనుంచైతే శెరువునిండక పాయె-శెల్కలల్లో పంటలు గూడ గట్ల గట్లనే వుండె-శెరువుకింద పొలాలు అల్లకుంట అయిశిమి-పని బాటల్లోళ్ళయినాము భూములోల్ల శెట్లుమొల్వనట్టే ఈ సారైనా వానలు గొట్టి శెరువునిండితే ఏమన్న ఒతుకు దెరువైతది - లేకపోతె పుణ్యానికి సస్తరు మంది" జ్యోతిష్యం చెప్పినట్లు చెప్పాడు కొమ్రమరయ్య దారం పేనుతూ.

"నీయవ్వ .... నేనైతే ఉరిపోసుకుని సచ్చేటట్టుందే ఈ సారి వానలు గొట్టక పోతే-రెండేండ్ల నుంచి పొలం అల్కుడు లే పాయే-కళ్ళాలకాడ ఇంత బిచ్చమోతె ఇన్ని గింజలు దొరుకు అవి కరువై పాయె-మూన్నెల్ల నుంచి జీతం పైకం రాకపాయే పైస పైసకు ఎంత తక్లీబ్ అయితుందో ఆ పరమాత్మునికే ఎరుక-అదల్ బదల్ ఎంత కాలమని దెచ్చి ఎల్లదీస్తం-ఈ బాధలు, కష్టాలు పడలేక ఎక్కడైనా పోదామన్నంత యాష్టొస్తుంది-పోతె "వొంగలేనోడు దొంగల్ల పోయిండ"ని బదులాము యేడ పడుదునని ఇజ్జత్‌కు అన్ని బాధలు వోర్సుకుని బతుకుతున్న...." బొంగురు కంఠంతో అన్నాడు ముత్యాలు.

"మూన్నెల్ల నుంచి జీతం రాలేదారా నీకు?" అని అడిగాడు కొమ్రమరయ్య-ఆ గొంతులో ఆశ్చర్యం కనిపించింది.

"నీతోటి అబద్దమాడ్తాను – రాలేదు బావా మూన్నెల్ల నుంచి పొయ్యిలకు పొయ్యిమీదికి శిన్న తక్లీబ్ అయిత లేదు గిజగిజానుకుంట కాలం ఎల్లదీస్తున్నాం. అది ఒక్కతి ఎంత గసమని కష్టపడ్తది. ఒక్క రెక్కమీద సంసారం ఎల్లాలంటే ఈ కరువు గొట్టు దినాలల్ల" అని దీనంగా అన్నాడు ముత్యాలు.

"మరి, అడుగొద్దురా పట్వారిని" కొమ్రమరయ్య.

"అడిగిననే"

"ఏమంటడు మరి"

"ఏమంటడు-తశీల్ నుంచీ ఇంక రాలేదంటడు. గిట్ల తక్లీబ్ అయితుంది. సంతులూ అంటే నన్నేం జెయ్యమంటావ్ రా అన్నడు- ఒక్క సారి అడిగితే, రెండు సార్లు అడిగితే అడిగి నప్పుడల్ల గట్లనే అనవట్టే జగ అడగొద్దని సాలిచ్చుకున్న"

"తశీల్ (తహసిల్ ఆఫీసు) కన్నపోయి గిట్ల గిట్ల సంగతని శెప్పు నంటివి—" కొమ్రమరయ్య సలహా ఇచ్చాడు.

"నాకు సదువొస్తదా, సదువొస్తదా ఎడంట పిర్యాదు జెయ్యాలె - ఎడంట మొత్తుకోవాలె-ఎటుతోస్త లేదు. ఈ ఐదారు



రోజులు సంది అయితే పిచ్చలేశినట్టుంది- ఏపని చేయబోదామన్నా మనసుకు పడ్తలేదు - బెచైన్, బెచైన్ గుంది."

తన బాధలు, కష్టాలు చెప్పుకోవడం వల్ల ముత్యాలుకు ఉదయంనుంచి ఉన్న బరువు తగ్గుతున్నట్టనిపించింది—తనలోవున్న కోపం ఆక్రోశం, అలసట మంచులా కరిగిపోతున్నట్టనిపించింది—అ ఉత్సాహంతోనే రెండు అడుగులు ముందుకు జరిగాడు - కొమ్మరయ్యకు దగ్గరగా కూర్చున్నాడు క్రింద గొంగడి వేసుకుని.

"మరి ఎట్ల జేస్తనను కుంటున్నవ్ రా" కొమ్మరయ్య.

"ఏం జెయ్యాల్నో తోస్త లేదే - నువ్వన్న జెప్పు ఎట్లజేస్తే బాగుంటదో" అని అడిగాడు ముత్యాలు.

"ఎట్లజేస్తవేంది - మనూర్ల మొన్న "సంఘం" బెట్టిండ్రుగదా. సంఘంల వున్నోల్లను యిశారియ్యి—వాళ్ళు ఏమంటరో తెలుస్తది" కొమ్మరయ్య.

"సంఘంల శేరినోళ్ళు తా మనుషులను సంపేటోళ్ళు, దోసుకునేటోళ్ళు — మొన్న మా పంతులు ఎవరితోనో అంటుంటే యిన్న - ఆళ్ళను యిశారిస్తే అయితదంటవా? నీ లెక్కన మొన్న మా పాపయ్య మామ గూడ అన్నాడు గాని నేను మనసు మీద పెట్టలేదు—" తన సందేహాన్ని వ్యక్తం చేశాడు ముత్యాలు.

"మీ పంతులు జేసే దొంగలెక్కలకు ఇలాంటి కొట్లాడేటోళ్ళు ఎట్ల దోసుకుంటరురా నీ మాటలిగాని - మా తమ్ముని కొడుకు బీరప్పగాడు సంఘంల జేరిండు —యిప్పుడు ఆడే సంఘంల పెద్దనంట-ఆడు మనిషులను సంపుతడా-ఆని గుణం నీకు గుర్తే కదరా! నువ్ వాణ్ణిపోయి కలువ్ నీకు అన్నిసంగతులు యిప్పి జెప్పుతడు." అని కొమ్మరయ్య ముత్యాలుకు చెప్పాడు.

కావలి ముత్యాలుకు ఏదో కాంతి కిరణం కనిపించినట్లయింది-తాను చీకటిలో లేనని తోచింది. తనకు ఆసరాగా ఊతగా ఒకరున్నారనిపించింది— అలా అనిపించే సరికి మనసు కాస్త కుదుట పడింది- కళ్ళు మెరిశాయి. అప్రయత్నంగా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి. గొంతు పోడ మారినట్టయింది. సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ,

"అయితే బీరప్పగారిని కలువు మంటావా" అని అడిగాడు.

"కలుస్తనే మల్ల ఏదైన తోవ్వ బుట్టది నువ్వు వూకుంటే గిట్లనే కాలం గుజురా యించిపోతది. నిన్ను గిట్ల ఏసుకపోతరు" అన్నాడు కొమ్మరయ్య.

కావలి ముత్యాలుకు బీరప్పను కలవాలన్న కోరిక బలపడింది. అలా అనిపించడం వల్ల ముత్యాలుకు కొండంత బలం వచ్చింది. గుండెల మీద అంతవరకు గుండులా వున్న బరువు తొలగించినట్టయింది-శ్వాస సునాయాసంగా తీసుకుంటున్నట్టు అనుభూతి చెందాడు.

"అయితే నేనే పోయొస్త బావా" ముత్యాలు.

"పోయొస్తవా?....... ఆ.... అట్లనే కొనింటి నర్సిరెడ్డి శెవులగూడ ఎయ్యి ఈ ముచ్చట-ఇద్దర్ ముగ్గురు శెవుల ఏస్తేనే మంచిది ఏ ముచ్చటైన" మరో సలహా ఇచ్చాడు కొమ్మరయ్య.

"మంచిది పొద్మికి కలుసుకోని శెప్త" అని ముత్యాలు లేచాడు. క్రిందనున్న గొంగడి భుజంపై వేసుకున్నాడు. ప్రక్కకు పెట్టిన కర్రను తీసుకొని "ఇగ మరి నేన్ పోయొస్త బావా" అన్నాడు.


"మంచిది—పొద్మికె జాములు వచ్చె పంతుల్ను కలుస్త పో"—కొమ్మరయ్య.

"నీ యిష్టం-నేన్ పోతున్నా...."

"పో....పో..."

కావలి ముత్యాలు అటు, ఇటు చూడకుండా పరుగులాంటి నడకతో పట్వారి ఇంటికి చేరాడు.

పట్వారి ప్రహల్లాదరావు వసారాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు - అతని



ప్రక్కకు మరో కుర్చీలో స్కూల్ టీచర్ రామారావు కూర్చున్నాడు. కొద్ది దూరంలో కావలి చంద్రయ్య నిలబడ్డాడు ప్రహరీగోడ ఈవల ఇద్దరు - ముగురు రైతులు నిల్చున్నారు.

ప్రహల్లాదరావు ఇంట్లోనుంచి సన్నగా రేడియో పాటలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రహల్లాదరావు భార్య లక్ష్మమ్మ కేకలు వినిపిస్తున్నాయి.

రామారావు ప్రహల్లాదరావు మాట్లాడు కునేప్పుడు కావలి ముత్యాలు గేటు వద్దకు వచ్చాడు.

కావలి ముత్యాలును ప్రహల్లాదరావు చూడగానే "ఏమాయెరా? పోయొచ్చిన వారెఆ కొమ్మిగ నిదగ్గర్కి?" అని అడిగాడు.

కావలి ముత్యాలు క్రిందికి చూసుకుంటు చేతిలో వున్న కర్రతో క్రిందపొడుస్తూ "పోయొచ్చిన పంతులు—అప్పటికొచ్చి కలుస్తనన్నడు" అని చెప్పాడు.

"వాడు ఏమనుకుంటుండు ఇంతకు -పది రోజుల సంది పన్ను గట్టమంటే సిల్గుతున్నడేంది? ఇంతకు నువ్వు పోయినావా?లేదా?" ప్రహల్లాదరావు.

ముత్యాలు మనసు చివుక్కు మన్నది. పుండు మీద కారం చల్లి నట్లయింది. ఒక్క క్షణం పట్వారివైపు సూటిగా చూసి,

"నా పిల్లలల తోడు పంతులు—ఇప్పుడు ఆడికెలే వస్తున్నా" అని కుడిచేతిని తలపై పెట్టుకున్నాడు.

"మా ఆడికెలే వస్తువోన్నని తన్నాకుంట గుంజుకరావొద్దురా-ఆ కొమ్మిగాణ్ణి ఇంత బీడి సుట్ట దాగి పల్లబడివచ్చినావ్ - నిన్ను



ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

రైతులకేమో ఎక్కువ లాభం మీకూ, నాకూ మరింత లాభం

మన రాష్ట్రంలో జీవ నదులున్నాయి. సిరులు పండే భూములున్నాయి. కష్టించి పనిచేసే రైతు బిడ్డలున్నారు. వీటన్నిటినీ సమన్వయ పరిచి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది.

ఆయకట్టు ప్రాంతాల అభివృద్ధిని చేపట్టడం ద్వారా వ్యవసాయం ఆధునికం చేయబడుతోంది. నాగార్జునసాగర్ కుడికాల్వ, నాగార్జునసాగర్ ఎడమకాల్వ, శ్రీరాంసాగర్, తుంగభద్ర సముదాయం - ఈ నాలుగు ఆయకట్టు ప్రాంతాలు అభివృద్ధి చేస్తున్నారు.

- ❊ వంతుల వారీగా నీటిని సరఫరాచేసే వరబంధి విధానం ఆదరణ పొందుతోంది.
- ❊ పొలాలకు కాల్వల ఏర్పాటు.
- ❊ క్రమబద్ధంగా భూమిని అభివృద్ధి పరచడం
- ❊ రైతులకు పరపతి సౌకర్యాల కల్పన.
- ❊ సమగ్ర వ్యవసాయ విస్తరణ కార్యక్రమం.

పథకాలు అమలు జరిపేందుకు 1981 - 82 సం॥ లో రూ. 897 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈనాడు అధికంగా ఆహార ధాన్యాలు, వాణిజ్య పంటలు పండిస్తున్నారు.

రైతుల ఆనందం ; మనకూ ఆనందమే

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు
నెం. 38.

వసూలు చేసుకరమ్మని తోలిన్నా లేక ముచ్చట పెట్టిరమ్మని తోలిన్నురా కావలోడా" కోపంతో అన్నాడు పట్వారీ.

ముత్యాలుకు గూడ కోపం వచ్చింది — కాని పెదవులమధ్యనే ఆకోపాన్ని బిగపట్టి "ఎంత, చెప్పాల్నో అంత చెప్పాను. ఇయ్యకుంటే నేనేంజెయ్యాలేపంతులు?" అన్నాడు.

"శేతులు లేనోళ్ళయి పిక్కాత్రె - ఏంజేస్తడంట. ఏజేస్తకు—నువ్ ఎందుకున్నవ్ రా సెప్పినపని చెయ్యక ఒక్కొ-వాణ్ణి తన్నుకుంట గుంజక రానుంటివి. వాని అయ్యసొమ్మా? అమ్మ సొమ్మా? పన్నులు గట్టకపోను - ముందుగాల నిన్ను రెండు తల్గిస్తే పన్నుల పైసలు అవంతల అవే ఉరుకొస్తయ్?" అన్నాడు ప్రహ్లాదరావు కుర్చీలోంచి ఒక్కసారి లేచి—తిరిగి కూర్చున్నాడు—కళ్ళు ఎర్రగా మారాయి - తిట్టేటప్పుడు గొంతు వద్ద నరాలు పొంగుతున్నాయి.

రామారావు, కావలి కేంద్రయ్య, ముత్యాలు వంక దీనంగా చూశారు.

కావలి ముత్యాలు పొంగు కొస్తున్న కోపాన్ని అపుకుని ఒక్కసారి ప్రహ్లాదరావువంక చూశాడు తలెత్తి. వెంటనే ప్రహ్లాదరావు.

"చెడల మీది కేలి సూస్తవేంది కావలి లంజ కొడుకా నీ తల్లీ, పెండ్లాన్ని పట్టుకుని ....అని బూతులు తిట్టాడు.

కావలిముత్యాలు మొఖం ఎర్రబారింది. కళ్ళలో ఉక్రోషం బుసలు కొడుతోంది. ముక్కుపుటాలు ఎగురుతున్నాయి. చేతిలో కర్ర బిగుసుకుంటోంది. పాదాల క్రింద భూమి నలిగిపోతోంది. దేహమంతా వేడివల్ల పొగలు గక్కుతున్నట్టనిపించింది. ఆ చండ ప్రచండమైన కోపంతోనే ప్రహ్లాదరావు వంక అలాగే చూస్తూ నిల్చున్నాడు. తర తరాలనుంచి వస్తున్న బానిసత్వాన్ని ఒక్కసారి తెంచుకోలేక.

కావలి ముత్యాలు అలాగే చూడడంతో పట్వారీ సహనం దెబ్బతిన్నది. తన అధికారాన్ని ఎదిరిస్తున్నట్టనిపించింది - తన గౌరవాన్ని పెళ్లగిస్తున్నట్టనిపించింది. తన వంశ ఆచారాన్ని మర్యాదను మట్టిపాలు చేస్తున్నట్టనిపించింది. ఆ కోపంతోనే,

"ఇంకా చూసుకుంట నిలబడ్డవేందిరా లంజకొడుకా—పో-బయటకు పో—సీ తాళిమొఖంల ...." బూతులు తిట్టాడు.

ముత్యాలు కదలలేదు — చూపులు కదల్చలేదు, ఆ చూపులకే శక్తివుంటే ప్రహ్లాదరావునేగాదు ఆయన ఇంటిని గూడ కాల్చేయగలవు—

ఆ చూపులు ప్రహ్లాదరావు కోపం అగ్గిమీద గుగ్గిలం వేసినట్టయింది. పట్వారీని రెచ్చగొట్టాయి — ముత్యాలు అంతు చూడాలని మనసు ముందుకు తరిమింది— వెంటనే కుర్చీకి వ్రేలాడేసిన పట్వారి ప్రహ్లాదరావు తనతండ్రిది పాత కర్రను తీసుకుని రెండు అడుగులు ముందుకేసి ముత్యాలు వొంటిపై నాలుగుదెబ్బలు బలంగా వేశాడు—మరో దెబ్బ వెయ్యబోయేసరికి ముత్యాలు పట్వారి కర్రను అందుకుని రెండుముక్కలుజేసి అవతల పారేసాడు—బాకు డిగేసిన తన కర్రను ఎత్తాడు—అంతే పట్వారీ పరుగు పరుగున ఇంట్లోకి పరుగుదీశాడు — ఇంతలోపునే రామారావు, కావలి కేంద్రయ్య, గేటు ఈవలవున్న రైతులు అందరూ వచ్చి కావలి ముత్యాలును పట్టుకున్నారు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది. చక చకా ఈ సంఘటనలన్నీ జరిగిపోయేసరికి అక్కడ వున్న రామారావు గుండె వేగంగా కొట్టుకోసాగింది — అందరూ నిశ్చేష్టులై కావలి ముత్యాలువంక చూస్తూ నిల్చున్నారు—

కావలి ముత్యాలు అందరిని విదిలించుకుని తనకు తగిలిన దెబ్బలను చూసుకుని తీరప్పను కలుద్దామని పట్వారీ ఇంటినుంచి బయలుదేరాడు కోపంతో—అతని కళ్ళల్లో ఎదురుతిరిగిన సహనం కనిపించింది.... ■

మి నీ క థ

కథకాని కథ

పడాల రాములు

తలుపు తట్టిన చప్పుడైంది.

ఎవరా! అనుకుంటూ లేచివెళ్ళి తలుపు తెరిచాడు సుధాకర్. ఎదురుగా ఓ అపరిచిత స్త్రీ! ముప్ఫయ్యయిదేళ్ళుంటాయేమో, నల్లగా, సన్నగా, పొడుగ్గా వుంది. రంగు వెలిసిన చీర, చిరుగులు పడ్డ రవిక, మొహంలో దీనత్వం ఉట్టిపడుతోంది. చేతిలో చిన్నసంచీ వుంది.

సుధాకర్‌ని చూడగానే వినయంగా నమస్కరించిందామె.

ప్రతి నమస్కారం చేసి—"ఏం కావాలి?" అని అడిగాడు సుధాకర్.

ఆమె సమాధానం చెప్పలేదు. కానీ "ఆ...." అంటూ నోరు తెరిచింది, చిటికెన వేలితో నాలుక చూపించింది.

సుధాకర్ కళ్ళు చికిలించి చూశాడు. ఆమె నాలుక బాగా లోపలికి కుంచించుకు పోయివుంది. వెంటనే విషయం అర్థమైందతనికి.

"ఐతే నీకు మాటలు రావన్నమాట." అన్నాడు తాపీగా.

అవునన్నట్టు తల ఆడించిందామె.

"కాదు. పైసాకోసం మూగదానిలా నటిస్తున్నావ్. అవునా?" తీక్షణంగా చూస్తూ అన్నాడు.

ఆమె అడ్డంగా తలాడించింది. అప్పుడామె కళ్ళలో ఆవేదన, బాధ స్పష్టంగా తెలిశాయతనికి.

చేతి సంచీలోంచి ఓ కరపత్రం తీసి సుధాకర్‌కి అందించిందామె. అందులో....

మహాశయులారా!

ఈమె పేరు రంగాజమ్మ. పుట్టు మూగి. చిన్నతనంలోనే తల్లిదండ్రులు అగ్ని ప్రమాదానికి గురై పరమ పదించారు. సహృదయులైన ఓ బాబాగారు ఈమెని పెంచి పెద్దచేసినారు. కాగా ఈమె దురదృష్టవశాత్తూ బాబాగారూ ఈమధ్యనే స్వర్గస్తులయినారు. ప్రస్తుతం ఈమెకు 'నా' అన్న వారెవ్వరూ లేరు. ఆస్తిపాస్తులు ఏమీలేవు. విశేషమేమిటంటే ఈమె అజన్మ బ్రహ్మచారిణి. కన్యకాపరమేశ్వరీ దేవి భక్తురాలు. కనుక దాతలైన మీరు ఈమె ఉదర పోషణార్థం తృణమో పణమో యిచ్చి పుణ్యం సంపాదించుకోగలరనీ, ఇటువంటి దైవ భక్తులకు సహాయం చేసినచో ఆ భగవంతుడు మీకు ఇతోధికంగా సిరిసంపదలు ప్రసాదించగలడనీ మనవి చేస్తున్నాము.

ఇట్లు
సర్పంచ్ అండ్ గ్రామప్రజలు
కూచనపల్లి గ్రామము.

సుధాకర్ గుండె జాలితో నిండిపోయింది. పాపం! దురదృష్టవంతురాలు! అనుకుంటూ ఆ కరపత్రాన్ని ఆమెకిచ్చేశాడు.

దాన్ని జాగ్రత్తగా సంచీలో పెట్టుకుని ఓ నోట్ బుక్ తీసి చూపించిందామె.

అందులో విరాళాలిచ్చిన వాళ్ళ పేర్లు, ఊర్లు రాసున్నాయి.

సుధాకర్ తనపేరు రాసి, అంకె వేసాడు పుస్తకంలో.

ఆమె నిర్లిప్తంగా చూస్తోందతనికేసి.

సుధాకర్ మౌనంగా జేబులోంచి పది రూపాయల నోటొకటి తీసిచ్చాడామెకి.

ఆమె కళ్ళు ఆనందంతో, తృప్తితో వెలిగిపోయాయి. మరోసారి సుధాకర్‌కి నమస్కరించి మెల్లగా ముందుకు సాగిపోయింది.

ఆమె కనుమరుగయ్యేదాకా అటే చూస్తూ ఉండిపోయాడు సుధాకర్.

○ ○ ○ ○

"మరదలా! ఇయ్యాల సంపాదనెంతే?"

"పది!"





మొదలెక్కడ..?

— యర్రంశెట్టి శాయి

"ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి—
మా వదినే ఈ జగతికి జీవనజ్యోతీ...."

అని పాడేస్తూ వరండాలో సైకిల్ స్టాండ్ వేసి లోపలికొచ్చాడు గోపాల్రావ్.

"ఇంక చాల్లే ఆపునాయనా! 'టీ' రెడీగానే ఉంది! నన్నేం కాకా పట్టనక్కర లేదు...." చిరాకు నటిస్తూ అంది కౌసల్య.

"చఛ! కాకా కాదొదినా! ఫాక్ట్ చెబుతున్నానంతే! నువ్వు లేకపోతే...."

"ఆ భజన ఆపకపోతే 'టీ' కాన్సిల్ చేస్తాను" బెదిరింపుగా అంది కౌసల్య.

"ఓకే! ఆపేశాను!" కుర్చీలో కూలబడి నిశ్శబ్దంగా ఉండిపోయాడు గోపాల్రావ్.

కౌసల్య 'టీ' తేవడానికి వంటింటి వేపు వెళ్ళింది.

ఈలోగా శీనుగాడు హడావుడిగా బయటనుంచి లోపలికి సుడిగాలిలా దూసుకొచ్చాడు.

"బాబాయ్! ఫుట్‌బాల్ ఆటలో వెనక్కు తిరిగి బ్లాక్ చేయడం ఫౌల్ కదూ?"

"అవును!" ఒప్పుకున్నాడు గోపాల్రావ్ కేచీ ఎందుకని.

శీను మళ్ళీ అదే స్పీడుతో బయటకు దూసుకుపోయాడు.

కౌసల్య 'టీ' కప్పు తీసుకొచ్చి గోపాల్రావ్ ముందు టేబుల్ మీద ఉంచింది.

"థాంక్యూ వదినా! థాంక్యూ. థాంక్యూ థాంక్యూ! నీకు తెగ ఋణపడిపోతున్నాను. ఎలా తీర్చుకుంటానో ఏమో!...."

"ఋణం లేదు గిణం లేదుగానీ త్వరగా 'టీ' తాగు. నీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి!"

"ఏమిటది? పేకాట విషయమేనా! ప్రమాణం వదినా! నిజంగానే మానేశాను"

"అది కాదయ్యా దేవుడా! వేరే విషయం...."

"ఏమిటది?"

"నా తలకాయ!" విసుగ్గా అందామె.

"నీ తలకేం వదినా! అది చాలా గొప్పదని మన వాళ్ళందరూ పొగుడుతారు కదా! అన్నయ్య మాత్రం 'నీది వట్టి డల్ హెడ్' అంటాడనుకో! అన్నయ్య మాటలు నేను ఎగ్రీ అవడం లేదు!"

"అయ్యో! అత్తయ్య నీకు ఇంత 'వస' ఎందుకు పోసిందో?"

"ఆరోజుల్లో అదొక్కటే విరివిగా లభించేదట! అందుకని పోసి ఉంటుంది...."

"మాటలు ఆపుతావా—నన్ను ఇక్కడి నుంచి వెళ్ళమన్నావా?"

"వెరీ డిఫికల్ట్ ఛాయిస్! ఓకే! మాట్లాడడమే ఆపేస్తాను. ఎందుకంటే ఏదో ముఖ్యమయిన విషయం మాట్లాడాలన్నావుగా? ఎవరయినా సరే—ఏ చిక్కు సమస్య ఎదురయినా నన్నే అడుగుతూంటారు సాధారణంగా—మొన్న మా లక్ష్మణరావ్ కూడా...." కౌసల్య అతని వంక విరాగ్గా

చూసి వంటింటివేపు వెళ్ళిపోబోయింది.

"సారీ, సారీ! వద్దులే వదినా! వెళ్ళకు... వాల్యూమ్ కట్టేస్తాను...." అన్నాడు గాథ రాగా. త్వరగా టీ తాగి "ఆ! ఇప్పుడు చెప్పు!" అన్నాడు తాపీగా.

అంతవరకూ ఏదో ఆలోచనలో మునిగిపోయిన కౌసల్య తేరుకుని అతనివేపు చూసింది.

"ఎలా చెప్పాలో తెలీడం లేదు...." అంది చిరునవ్వుతో.

"ఎలాగేముందీ! మా మూములుగా నే! అన్నయ్య ఆఫీసునుంచి లేట్‌గా ఇంటికొచ్చినప్పుడు, నేను పేకాటకెళ్ళినప్పుడూ ఎంతో ఇన్‌స్పిరేషన్ వచ్చి స్పీచ్ ఇస్తావ్ కదా—అలాగే...."

"ఇది అలాంటి విషయం కాదే...."

"మరి ఇంకెలాంటిది?"

"నువ్వు చిన్నప్పుడు ఎవర్నయినా ప్రేమించావా?"

"....ప్రె....ప్రే....ప్రేమా?"

"అవును!"

"చిన్నప్పుడా?"

"అలా ప్రశ్న వేయకు ఒకటో క్లాస్ కుర్రాడిలాగా! జవాబు చెప్పముందు!"

"చిన్నప్పుడు ప్రేమేమిటి? అయ్ మీన్....ప్రేమలనేవి కాలేజీలో జరుగుతాయ్ సాధారణంగా! ఒకవేళ స్కూల్ ఫైనల్‌లో కూడా జరగవచ్చు....అంతే గాని...."

"అదికాదయ్యా! తొమ్మిదేళ్ళ వయసులో ప్రేమ పుడుతుందా—నీక్కాపోతే—పోనీ ఎవరి కయినాసరే...."


"ఇంపాజిబుల్! కానీ ఇప్పుడీ ప్రశ్న ఎందుకొచ్చింది?"

"మన శీను ఓ పిల్లని ప్రేమించాడు కాబట్టి...."

"వాట్" అదిరి పడ్డాడు గోపాలరావ్.

"మన శీనుగాడా?"





హాస్యకథల పోటీలో

ఎన్నికయిన కథ

"అవును!"

"నాలుగోక్లాస్ చదివే—వెధవకి ప్రేమా? జోక్ చేస్తున్నావా?"

"నా ఖర్మకాలి నీతోనే జోక్ చేయాలి! జోక్ చెప్పిన ఆర్నెల్లకి నవ్వే రకం"

"వదినా! నాకు క్లియర్‌గా చెప్పు—మధ్యలో డైవర్ట్ చేయకు"

"ఇంకా క్లియర్‌గా చెప్పాలా? మన శీనుగాడు-తన క్లాస్‌లోనే ఉన్న జ్యోతి అనే పిల్లని ప్రేమించాడు. ఇద్దరూ ప్రేమ లేఖలు కూడా రాసు కుంటున్నారు..."

"ఇంపాజిబుల్...."

"ఇంగ్లీష్ మాట్లాడకు.."

"నేను నమ్మలేను వదినా!"

"రోజులలా ఉన్నాయ్! నమ్మక చేసేదే ముందీ? ఇదిగో- ఈ ఉత్తరం ఇందాక వాడి పుస్తకాల్లో దొరికింది..."

ఓ ఎక్సర్‌సయిజ్ నోట్‌బుక్ కాగితం అతని కందించింది కౌసల్య.

ఆత్రుతగా ఉత్తరం తీసుకుని చూశాడతను. చిన్న పిల్లల దస్తూరీ తెలుస్తూనే ఉంది.

"శీనూ, నేనూ నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను. కానీ మన కులాలు వేరు కదా! మరి మన తల్లిదండ్రులు వప్పుకుంటారా మన ప్రేమను? రేపు ఆదివారం సినిమాకు రమ్మన్నావు. కానీ నన్ను ఒక్కదాన్నే మాఇంట్లో సినిమాకు పంపరు. ఇట్లు నీ-జ్యోతి"

నవ్వూ, ఆశ్చర్యం రెండూ కలిగినయ్ గోపాల్రావ్‌కా లెటర్ చదువుతూంటే.

"వేలెడంత ఉన్నారో లేదో, ప్రేమలూ కులాల పట్టింపులూ, షికార్లూ, సినిమాలూనా .... వదినా! దేశం సర్వనాశనమయిపోతోంది. ఎంత దారుణం?"

"ఇందులో దారుణ మేముందిలే! చిన్నప్పటి నుంచే వాడికి వాళ్ళ బాబాయ్ బుద్ధు లొచ్చినాయ్.."

"ఇదిగో వదినా! అలా అనకు! కాలేజీకొచ్చే వరకూ అసలు 'సెక్స్' అంటేనే తెలిసొచ్చవలేదు నాకు!"

"అవునవును. ఏమీ తెలీందే నీ పేరూ జానకి పేరూ గోడలమీద ఎందుకెక్కాయ్?"

"అది కిట్టనివాళ్ళు చేసినపని! జానకికీ నాకూ కేవలం 'హలో—హలో' స్నేహం! అంతే!"

"హలో—హలో అంటే ?"

"అంటే—అదే—కనబడితే హలో—హలో అనడం...."

"ఐసీ..." అనుమానంగా అందామె.

"ఇంతకూ ఈవిషయం అన్నయ్యకు చెప్పావా ?" అడిగాడు గోపాల్రావ్ సబ్జెక్ట్ మారుస్తూ.

"లేదు! చెప్పినా ఏమిలాభం ఉందికనుక! ఆ లవ్ లెటర్ కూడా పైల్లో పెట్టుకుని ఆఫీస్ కెళ్ళిపోతారు..."

"అయితే ఇప్పుడేమిటి చేయడం ?"

"ఏమో! నాకేంతెలుసు? సైకాలజీ స్టూడెంట్‌వికదా! సైకాలజీమీద ఆకాశంలో చుక్కలు అని కథకూడా రాశావ్..."

"ఆకాశంలో చుక్కలు కాదు—"ఆకాశంలో నక్షత్రాలు" కథ అది..

"అదేలేవయ్యా! రెంటికీ పెద్ద తేడా ఏముందిగనుక?

"ఓకే-అయ్ విల్ సెటిల్ దిస్ ఎఫయిర్! నువ్వేం గాభరాపడకొదినా! ఇలాంటి విషయాలు సైకొలాజికల్‌గా డీల్ చేయాలి. అంటే అసలు దీని రూట్ కాజ్‌మీద మనం వర్క్ చేయాలన్నమాట. .ఓకే—నాకొదిలేసి నువ్వు నిశ్చింతగా ఉండు..."

కౌసల్య నవ్వింది.

"మరీ పెద్ద మొనగాడిలాగా ఓవరాక్షన్ చేయకు నాయనా! నేను ఈ విషయం శీనుగాడితో మాట్లాడడం డెలికేట్‌గా ఉంటుందని నీకు చెప్పాను. అంతే! వాడిని దారిలో పెట్టటం అంత కష్టమేంకాదు. ఓ బెత్తం తీసుకుంటే బుద్ధివచ్చేస్తుంది..."

"నువ్వు సైకాలజీ చదవలేదు కాబట్టి—అలా అనిపిస్తుంది నీకు..." అనేసి వెంటనే బయటకు నడిచాడు గోపాల్రావ్.

గ్రౌండ్‌లో శీను ఇంకా ఫుట్‌బాల్ ఆడుతూనే ఉన్నాడు. ఆట ముగిసేవరకూ కూర్చుని తర్వాత శీనుని తీసుకుని పార్క్ చేరుకున్నాడు గోపాల్రావ్. వాడితో ఎంత జాగ్రత్తగా మాట్లాడాలో ముందుగానే ప్లాన్ చేసుకున్నాడు. అందరిలాగా మొరటుగా ప్రవర్తించడం తన నియమానికి వ్యతిరేకం.

"మీ క్లాస్‌లో నీకెంత మంది ఫ్రెండ్స్ ఉన్నార్రా—శీనూ!" చాలా మామూలుగా అడిగినట్లు అడిగాడతను.

"చాలామంది ఉన్నారు బాబాయ్!"

"ఆడ పిల్లలు కూడా ఉన్నారా అందులో?"

"ఆ! నలుగురు నాతో చాలా స్నేహంగా ఉంటారు..."

"వెరీగుడ్! బావుంది. ఆ నలుగురిలో మరి నువ్వంటే లైక్ చేసేవాళ్ళు ఎవరయినా ఉన్నారా?"

"అవును బాబాయ్! జ్యోతి, రాధ—ఇద్దరూ నేనంటే ఎంతో ఇష్టంగా ఉంటారు"

దారి కొచ్చేస్తున్నాడనిపించింది గోపాల్రావ్‌కి. సైకాలజీ ప్రకారం వెళ్ళితే ఇలాగే విజయం సాధించవచ్చు.

"ఆ ఇద్దరిలోనూ ఎవరు ఎక్కువ నీకు?"

శీను ఆలోచనలో పడ్డాడు.

"అలా అడిగితే చెప్పడం కష్టం బాబాయ్!"

"పోనీ వాళ్ళిద్దరిలోనూ ఎవరు ఎక్కువ లైక్ చేస్తారు నిన్ను?"

"అదికూడా చెప్పడం కష్టమే బాబాయ్!"

గోపాల్రావ్‌కి ఆశ్చర్యం కలిగింది కానీ అది పైకి కనిపించనీలేదు.

"ఆల్‌రైట్—నీకు ఒకే ఒక అమ్మాయితో స్నేహం చేయడానికి పర్మిషన్ ఇచ్చారనుకో! అప్పుడు ఏ అమ్మాయిని కావాలనుకుంటావ్?"

శీను మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఇవన్నీ తను అద్భుతంగా ఆలోచించి వేస్తున్న సైకాలాజికల్ ప్రశ్నలు కాబట్టి శీనుగాడు మాటిమాటికి ఆలోచించాల్సి వస్తోంది అనుకున్నాడు గోపాల్రావ్.

"దీనికి సమాధానం కష్టం బాబాయ్! ఇద్దరూ నాకు రెండు కళ్ళ వంటివారు! ఏ కన్ను కావాలని అడిగితే ఏం చెప్పగలం?"

గోపాల్రావ్‌కి మతి పోయినట్లయింది. ఏదో సినిమాలో డైలాగులు వింటున్నట్లుంది కాని నాలుగో క్లాస్ చదివే కుర్రాడు మాట్లాడుతున్నట్లు లేదు.

"అదికాదురా! ఏదో కన్నుని ఎన్నుకోవాలిక దా—తప్పనప్పుడు!"

"అయితే జ్యోతే కావాలనుకుంటాను!"

"గుడ్! అంటే నీకూ జ్యోతికీ స్నేహమే కాక అంతకంటె ఎక్కువయిన దేదో ఉందన్నమాట! అంతేనా?" తెలివిగా అడిగాననుకున్నాడు గోపాల్రావ్.

"ఏదో—ఏముంది బాబాయ్! మేమిద్దరం ప్రేమించుకుంటున్నాము.." వాడు తడుముకోకుండా చెప్పేసరికి గోపాల్రావ్ ఖంగారు పడ్డాడు.

"ప్రేమా?"

"అవును!"

"ప్రేమ—అంటే—అదే—ప్రేమ—అనేది ఎంతో పవిత్రమయినది—మనం మన తల్లిదండ్రుల్ని, సోదరుల్ని ప్రేమిస్తాం! ఇదీ అలాగే కదూ!"


"ఛ! ఆ ప్రేమ వేరు—మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాం బాబాయ్. కానీ అనుకోకుండా ఓ చిక్కు వచ్చిపడింది...." దిగులుగా అన్నాడు వాడు.

"ఏమిటది?" ఆత్రుతతో అడిగాడు.

కాసేపు ఆలోచించి "ఇప్పుడు చెప్పలేను బాబాయ్. మనసు బాగోలేదు...."

గోపాల్రావ్‌కి శీను మాటలు, ఆ పదాలు వింటూంటే స్పృహ తప్పినంత పనవుతోంది.

"బహుశా ఆ కులాల తేడా గురించే


నీమీద నమ్మకం పోయింది ప్రసాద్!!
అందుకే దీన్ని కొన్నాను!!

దిగులుపడుతున్నాడేమో ననిపించింది. "కులాలను ఎవరు లెఖ్ఖ చేస్తున్నార్రా ఈరోజుల్లో—అదేం దిగులు పెట్టుకోకు..." అని చెప్పాలనిపించిందిగానీ, తను చేయాల్సిన పని వాడికి ధైర్యం చెప్పడం కాదనీ, వాడు ఈలేత వయసులో అలాంటి వ్యవహారాల్లో తలదూర్చడం తప్పన్న హితబోధ చేయాలనీ గుర్తుకొచ్చింది. వెంటనే గొంతు సర్దుకుని చిన్నగా దగ్గాడు.

"కానీ ఒరే శీనూ—ఇంత చిన్నవయసులో అలాంటి ఆలోచనలు చేయడం—ఎంత తప్పో నీకు తెలుసా!" అన్నాడు గంభీరంగా.

"తప్పేముంది బాబాయ్? దేవదాసు—పార్వతి చిన్నప్పటినుంచీ ప్రేమించుకోలేదూ? మరి ఆసినిమా తప్పని ఎవరయినా అన్నారా? ఎప్పుడు రిలీజయినా వంద రోజులాడుతోందది..."

గోపాల్రావ్‌కి అర్జంటుగా ఎవరయినా మంచినీళ్ళు ఆఫర్ చేస్తే బావుండుననిపించింది. కాని ఎవరూ చేయలేదు.

"అదివేరు? అది సినిమా" అన్నాడు గొంతు పెగల్చుకుని.

"నేను చాలా నవలలు కథలుకూడా చదివాను బాబాయ్! చాలా వాటిల్లో చిన్నప్పుడే ప్రేమించుకున్న పిల్లల కథలే ఉన్నాయ్..."

"ఐసీ..." అన్నాడు గోపాల్రావ్.

"అయినా ప్రేమ అనేదానికి వయసుతో సంబంధం లేదు బాబాయ్. ఇంతవయసొచ్చినా నీకీ విషయం తెలీలేదా?

గోపాల్రావ్ ఉక్కిరిబిక్కిరయాడు.

"ఇది ఏ సినిమాలో చూపించారు?"

"చాలా సినిమాలున్నాయ్ బాబాయ్! ఒకటేమిటి? బావా మరదళ్ళ మీదేగా చాలా సినిమాలు వచ్చేది?"

అంతవరకూ గోపాల్రావ్‌కి ఈ ఆలోచనరాలేదు. శీను చెప్పాక ఆలోచించి చూస్తే అన్నీ చిన్నపిల్లల ప్రేమకలాపాల సినిమాలే గుర్తుకి రాసాగినయ్.

"అయితే ఈ సినిమాలు చూసి ఇలా చెడిపోతున్నారన్న మాట మీరు!"

అన్నాడు అసలు 'రూట్ కాజ్' దొరికినందుకు లోలోపల సంతోషిస్తూ.

“అది చెడిపోవడమంటే నేనొప్పుకోను. ప్రేమించడం చెడిపోవడం అయితే మరి ప్రేమ వివాహాలే మంచివని అందరూ ఎందుకంటారు? కట్నాల గొడవ తగ్గాలంటే ప్రేమ వివాహాలని ప్రోత్సహించాలని మొన్న రేడియోలో ఎందుకు చెప్పారు?”

గోపాల్రావ్‌కి మొట్టమొదటిసారిగా కొన్ని నిజాలు తెలిసినయ్. తమ జనరేషన్ నాటి తొమ్మిదేళ్ళ పిల్లలకీ, ఈ తరం—తొమ్మిదేళ్ళ పిల్లలకూ నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంది, వాళ్ళకు తెలిసిన విషయాలు చాలా తక్కువ. వీళ్ళకు తెలీనివి చాలా తక్కువ, వాళ్ళు చిన్న పిల్లల్లాగానే ఆలోచించడం, ప్రవర్తించడం చూస్తే, వీళ్ళు చిన్నప్పటినుంచే పెద్దాళ్ళల్లా ఆలోచించడం, ప్రవర్తించడం చేస్తున్నారు. వాళ్ళు బొగ్గులాంటి వాళ్ళయితే, వీళ్ళు నివురు కప్పిన నిప్పులాంటి వాళ్ళు.

ఇప్పుడు ఇంక తను శీను విషయంలో చెయ్యగలిగిందేమీ కనిపించడంలేదు. ఇలాంటి ముదురు కేసులను లొంగదీయడం—అదీ సైకాలజీ ప్రకారం—చాలా కష్టం.

ఇలాంటి వాళ్ళ దగ్గర సైకాలజీ పని చేయదని తెలిపోయింది. ఈనాటి సినిమాలు చూసే చిన్న పిల్లలను ఏదీ రక్షించలేదు.

“ఇంక ఇంటికెళదాం బాబాయ్! ఆకలేస్తుంది” అన్నాడు శీను లేచి నిలబడి.

ఇద్దరూ ఇంటివేపు నడవసాగారు.

ఇప్పుడు ఇంటికెళ్ళితే వదినకేం చెప్పాలో గోపాల్రావ్‌కి బొత్తిగా అర్థం కాలేదు.

“నావల్ల కాలేదు వదినా” అంటే ఆమె తనని ఇన్సల్ట్ చేసి పారేస్తుంది జీవితాంతం. ఆలోచిస్తూంటే ఓ మెరుపులాంటి ఉపాయం తట్టింది.

“జ్యోతి ఇల్లెక్కడ్రా?” అడిగాడు చాలా మామూలుగా అడిగినట్లు.

“మా స్కూలు కెదురుగ్గా సందులో ఆరో ఇల్లు — పెంకుటిల్లులే వాళ్ళది! ఎందుకు?” అడిగాడు శీను అనుమానంగా.

“అహా! మరేంలేదు! ఊరికే అడుగుతున్నాను. మరి రాధ ఇల్లు?”

“జ్యోతి ఇంటి పక్కనే!”

“సరే! నువ్వింటికెళ్ళు! నేను బజారు వెళ్ళి వస్తువులు కొనుక్కొస్తాను—”

“అలాగే బాబాయ్” శీను వెళ్ళిపోయాడు.

గోపాల్రావ్ వెనక్కు తిరిగి శీను స్కూలువేపు వడివడిగా నడవసాగాడు.

ఇటునుంచి కాకపోతే, అటునుంచి నరుక్కు రమ్మన్నారు — ఎవరో గాని. అందుకే తను జ్యోతి, రాధల ఇళ్ళకు వెళ్ళి జరిగిన సంగతంతా చెప్పి వాళ్ళ పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టి ఉండమని హెచ్చరిస్తే సమస్య ఆటోమేటిక్‌గా పరిష్కారం అయిపోతుంది. నిజానికి ఈ గొడవలో రాధకేమీ సంబంధం లేదుగాని—చిన్న పిల్లల సైకాలజీ ప్రకారం - పక్క వాళ్ళు ఏ పని చేస్తే వాళ్ళకూ అదే పని చేయాలనిపిస్తుంది—కేవలం రాధ మేలుకోరి ఆమె తల్లిదండ్రులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత స్కూలుకెళ్ళి నాలుగో క్లాసు టీచర్‌తో మాట్లాడాలి ఈ విషయం. అన్ని వేపులనుంచీ ముట్టడించి శీనుగాడిని బయటకు లాగాలి. ఈ చెడు ఆలోచనల నుంచి జ్యోతి ఇల్లు తేలిగ్గా కనుక్కోగలిగాడతను.

జ్యోతి తండ్రిగాబోలు బయట అరుగు మీద కూర్చుని “సీతమ్మకూ చేయిస్తి చింతాకు పతకమూ రామచంద్రా— ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలూ రామచంద్రా” అని పాడుతున్నాడు.

“నమస్కారమండీ!” అన్నాడు గోపాల్రావ్ పాట మధ్యలో జొరబడి.

“ఎవరు?” కళ్ళజోడులోనుంచి దీక్షగా చూస్తూ అడిగాడతను.

“నా పేరు గోపాల్రావండీ! మీ అమ్మాయిపేరు జ్యోతే కదండీ!” అడిగాడు గోపాల్రావ్.

"అవును—అయితే ఏమిటి ?"

"మా అన్నయ్య కొడుకు శీనుకూడా మీజ్యోతి క్లాసులోనే చదువుతున్నాడండి! వీళ్ళవిషయం — చాలా ముఖ్యమయిన విషయం ఒకటి మీతో మాట్లాడదామని—" నసిగాడతను.

"శీను సంగతా !" చాలా తేలిగ్గా అన్నాడతను.

"శీను మీకు తెలుసాండీ ?" అడిగాడు గోపాలరావ్ ఆశ్చర్యంగా.

"ఎందుకు తెలీదు ? రోజూ మా జ్యోతిని స్కూలునుంచి ఇంటివరకూ తోడుగా దింపి వెళతాడుగా !"

"ఓహో..." అన్నాడు గోపాలరావ్ ఇంకేమనాలో తెలీక.

"ఇంతకూ ఏమిటి మాట్లాడాలన్నారు"

"అదే—వీళ్ళిద్దరూ వయసుకి మించిన పనిచేస్తున్నట్లు—ఋజువు—అయ్ మీన్—తెలిసింది !"

"ఏమిటది ?" కుతూహలంగా అడిగాడతను.

"వేలెడంత లేరు—చదివేది నాలుగో క్లాస్—ఇద్దరూ ప్రేమలేఖలు రాసుకుంటున్నారు !" తిన్నగా చెప్పేశాడు గోపాలరావ్.

ముసలాయన నవ్వాడు గలగలా.

"అదా ! ఇంకేమిటో అనుకుని అదిరిపోయాను గదయ్యా !"

"అంటే ఈ విషయం మీకు తెలుసా ?"

"ఎప్పుడో తెలుసు !"

"తెలిసీకూడా ఊరుకున్నారా ?"

"ఊరుకోక ఏంచేయమంటావయ్యా !"

"అదేంటండీ ! తొమ్మిదేళ్ళ వయసులో పిల్లలు ఇలాంటి పనులు చేస్తోంటే ఊరుకుంటారా ఎవరయినా ?"

"నేను చెప్పానులేవయ్యా ఇద్దరికీనూ ! పదేళ్ళూరాందే అలా చేయడం తప్పనీ !"

"అంటే — పదేళ్ళకు ప్రేమించుకోవచ్చా ?"

"శుభ్రంగా ! మా పెద్దమ్మాయ్ అంతేగా ! పదేళ్ళకే ప్రేమించి, మేము ఇలాగే కేకలేస్తే ఆ కుర్రాడితోపాటు లేచిపోయింది. తరువాత ఇద్దరనీ తీసుకొచ్చి పెళ్ళి చేశాను. ఇప్పుడు దానికి పదమూడో ఏడు వచ్చింది. సుఖంగానే ఉన్నార్లే ! అంచేత వీళ్ళకూ కూడా పదేళ్ళు వచ్చాకే పెళ్ళి చేద్దాం !"

గోపాలరావ్ ఉక్కిరిబిక్కిరయాడు.

"పెళ్ళా! పదేళ్ళకా? అసలు పెళ్ళి చేస్తామని ఎవరన్నారు? మీకేం మతి పోలేదు కదా!"

"చూడు నాయనా! ఈ గొడవలన్నీ నాకు తెలీదు. అమ్మాయిని పిలుస్తాను. దాంతోనే మాట్లాడు. నేనేనాడో ఇలాంటి విషయాలన్నీ పట్టించుకోవడం మానేశాను" అంటూ అక్కడినుంచి లేచి "జ్యోతీ-ఇలా రామ్మా" అని అరుస్తూ లోపలికి వెళ్ళాడు.

గోపాలరావ్ తెల్లబోయి తేరుకునేంతలోగానే జ్యోతి ఓ గాను - పిలక జడతో వచ్చి ఎదురుగ్గా నిలబడింది.

"నమస్తే!" అంది జ్యోతి గోపాలరావ్‌కి నమస్కరిస్తూ.

"నమస్తే-నమస్తే--నమస్తే" అన్నాడు గోపాలరావ్ తడబడుతూ.


"నాతో ఏదో మాట్లాడాలన్నారట!" వినయంగా అడిగిందాపిల్ల.

గోపాలరావ్ ఏం మాట్లాడాలా అని టకటక ఆలోచించాడు గానీ ఏమీ గుర్తురాలేదు. అసలు తను ఆ ఇంటికెందుకొచ్చాడో కూడా తెలీటం లేదు.

"అదే...ఎందుకంటే... మామూలుగా—అంటే - జస్ట్— ఫార్మల్‌గా... ఊరికే.... అలా...."

"మా నాన్నగారితో నేనూ శీనూ ప్రేమించుకున్న విషయం గురించి ఏదో అన్నారట..." తన చేతి వేళ్ళవంక చూసుకుంటూ అంది జ్యోతి.

గోపాలరావ్‌కి చెమటలు పట్టేస్తున్నాయ్. తను, నాలుగో క్లాస్ చదువుతున్న తొమ్మిదేళ్ళ పిల్లతో మాట్లాడుతున్నట్టు లేదు.



ఓ పాతికేళ్ళ యువతితో కబుర్లు చెపుతున్నట్లుంది.

"అదే... అలా చేయడం తప్పని.... మీ వయసెంత-మీ రెంత-అప్పుడే ప్రేమలూ ప్రేమ లేఖలూనా?" సర్దుకుని అడిగాడు గోపాలరావ్.

జ్యోతి చాలా కేర్ లెస్‌గా నవ్వింది.

"ప్రేమకు టైమూ, హైటూ, ఏజ్, వైటూ-ఇవేమీ అఖ్ఖర్లేదండీ! మనసులు కలిసినయ్. ప్రేమించుకున్నాం! ఇందులో తప్పేమిటి?"

ఆ పిల్ల సూటిగా చూసేసరికి గోపాలరావ్ చూపులు మరల్చుకోవాల్సి వచ్చింది.

"అయితే మా మాట మీకేమీ లెఖ్ఖలేదన్నమాట!" అన్నాడు ఇంకేమనాలో తెలీక.

"అయ్యో ఎందుకులేదండీ! మీరెలా చెప్తే అలా చేస్తాం!" అంది వినయంగా.

"అయితే మీ పెళ్ళి జరగడానికి వీల్లేదు. ముందు చదువు. అది పూర్తయాకే ఇంకో విషయం !"

"చదువనేది ఎప్పుడయినా చదువుకోవచ్చండీ! కానీ ప్రేమ అనేది-నిజం ప్రేమ-మనిషికి ఒకేసారి కలుగుతుంది. అదికాస్తా పోగొట్టుకుంటే ఇంక జీవితమంతా బాధ పడాల్సిందే ! అయినా మేము పెళ్ళి చేసుకోబోవటంలేదు లెండి ! మాకంతటి అదృష్టంలేదు..." అందామె దిగులుగా.

గోపాలరావ్ ఆమె మాటలు విని మళ్ళీ ఉలిక్కిపడ్డాడు.

"ఎందుకని ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మాదో పెద్ద విషాదగాథండీ! విధి మాకు ఎదురు తిరిగింది! అంతే! ఇంతకంటే ఇంకేమీ చెప్పలేను..." భారంగా అందామె.

గోపాలరావ్‌కి వొళ్ళు మండిపోయింది ఆ బరువయిన డైలాగ్ వినేసరికి. "డైలాగ్ చాలా బాగా చెప్పావ్ తల్లీ! సినిమాల్లో ప్రయత్నించు అవకాశం రావచ్చు!"

"మీకలాగే హేళనగా ఉంటుందండీ!

కానీ మా హృదయాలు ఎంత ఆక్రోశిస్తున్నాయో మాకే తెలుసు!"

"ఎందుకనో ?"

"ఎందుకేముందండీ! చెప్పానుకదా! విధి! అంతే! నేను కోరుకునేది ఒక్కటే నండీ! శీనూ, రాధా ఒకటవ్వాలి! అంతే! నాజీవితం ఏమయి పోయినా నాకిష్టమే!"

గోపాల్రావ్ అదిరిపడ్డాడు.

"శీనూ రాధా ఒకటవ్వాలా? అదేమిటి? ప్రేమించుకున్నది మీ ఇద్దరు కదూ ?"

"అవును! కానీ పరిస్థితులు అలా వచ్చాయ్. శీనూ రాధా ఒకటవక తప్పదండీ! తప్పదు—ఇంకనన్నేమీ అడక్కండి!" అనేసి కన్నీరు తుడుచుకుంది.

గోపాల్రావ్ కి కొద్దిసేపటి వరకూ జరుగుతుందేమిటో అర్ధంకాలేదు. పిచ్చి తనకన్నా పట్టిఉండాలి. లేదా వాళ్ళందరూ పిచ్చి వాళ్ళన్నా అయుండాలి.

జనరేషన్ గాప్—ఇంత పెద్దదా ?

"అంటే మీ ఇద్దరూ కలసి శీనుని ప్రేమించారన్నమాట! అంతేనా ?" అడిగాడు కొద్దిక్షణాల తర్వాత కోలుకుని.

అవునన్నట్టు తలూపిందామె.

"వాడూ మీ ఇద్దరినీ ప్రేమించాడా ?"

"అవును!"

"ఒకడే ఇద్దరినీ ప్రేమించడం ఎక్కడయినా జరుగుతుందా ?"

"ఎందుకు జరగదండీ! మీరు కార్తీకదీపం చూడలేదూ? ప్రేమాభిషేకం చూళ్ళేదూ? దేవదాసు చూళ్ళేదూ..."

గోపాల్రావ్ కింక అక్కడ ఉండడం సబబుగా తోచలేదు. లేచి ఆ ఇంటినుంచి బయటపడ్డాడు. రాధ ఇంటికి చేరుకునేసరికి రాధే తలుపు తీసింది.

"రాధ ఎవరు ?" అడిగాతను.

"నేనేనండీ! మీరు శీను బాబాయ్ కదూ ?"

"అవును! నీకెలా తెలుసు ?"

"శీను చూపించాడో సారి!"

"మీ అమ్మా, నాన్నా ఉన్నారా ?"

"లేరండీ! గుడికెళ్ళారు! ఇంకో అరగంటలో వస్తారు! మీరు ఏ పనిమీద వచ్చారో తెలుసుకోవచ్చా ?"

డైరెక్ట్‌గా సబ్జెక్ట్‌లోకి దిగిపోవడం మంచి దనిపించింది గోపాల్రావ్ కి.

"చెప్పమంటావా ?" అన్నాడు ఆపిల్ల వంక చూసి.

"చెప్పండి !"

"మీరు ఇంత చిన్న వయసులో నే ప్రేమలూ పెళ్ళిళ్ళూ అంటూ తప్పుదారి పడుతున్నారు. అవునా, కాదా ?"

"అవునండీ! కానీ ఆరోజు జరిగిన సంఘటనకు తప్పు మాఇద్దరిదీకాదు! పరిస్థితులది. ఆ పరిస్థితుల్లో ఎవరున్నా మాలాగే ప్రవర్తించి ఉండేవాళ్ళు..."

ఆమె ఏం మాట్లాడుతోందో గోపాల్రావ్ కి అర్ధం కావడం లేదు.

"నువ్వేం మాట్లాడుతున్నావో నాకేమీ అర్ధం కావడంలేదు..." అన్నాడు ఆశ్చర్యంగా.

"అయితే జరిగిందేమీ మీకు తెలీదన్నమాట !"

"ఎలా తెలుస్తుంది! జ్యోతి నడిగే వరకూ ఈ కథలో నీకూ ముఖ్య పాత్ర ఉందన్న విషయమే తెలీదు!"

"నిజానికి జ్యోతికీ, శీనుకీ మధ్య అడ్డు రావాలని నే నెప్పుడూ అనుకోలేదండీ! కేవలం శీనూకి ఓ స్నేహితురాలిగానే మిగిలిపోదామనుకున్నాను. కానీ ఆరోజు—ఆరోజు...." ఇంక చెప్పలేక పోయింది.

"ఏరోజు?" ఆత్రుతగా అడిగాడు గోపాల్రావ్.

"అదేనండీ—నేనూ శీనూ కలిసి అనుకోకుండా మళయాళం సినిమా మాట్నీ చూసి కాలు జారాము! ఆ తర్వాతగానీ, నాకు తెలీలేదు—నేను జ్యోతికి ద్రోహం చేసిన సంగతి! అప్పటినుంచీ నా హృదయం క్షోభించిపోతోంది. నేను ఆమెకు చేసిన అన్యాయానికి...."

గోపాల్రావ్ కింకేమీ వినబడడంలేదు.

ఆ పిల్ల చెప్పే మాటలు నిజమేనా? ఇంత దారుణమయిన స్థితిలో ఉందా ఈ తరం? హఠాత్తుగా అతనికో ఆలోచన వొచ్చి

"నువు చెప్పేవన్నీ అబద్ధాలు! మళయాళీ సెక్స్ సినిమాలకు చిన్న పిల్లలను ఎవరు రానిస్తారు?"

"గేటు దగ్గరతనికి రూపాయి ఇస్తే చాలండి! టికెట్టు అతనే తెచ్చిస్తాడు! అలా బోలెడు సినిమాలు చూశాను—"

ఇంకొక్క క్షణం కూడా అక్కడుండాలనిపించలేదతనికి. ఉంటే తనకు పిచ్చెక్కేది ఖాయం. సెకండ్-షో సినిమా కెళ్ళి, అర్ధరాత్రికి ఇల్లు చేరుకుని నిద్రలో మునిగిపోయాడు. వదినకు మొఖం చూపించ బుద్ధి కావడంలేదు. జరిగినదంతా చెప్తే వదినక్కూడా తప్పక పిచ్చి పడుతుంది.

తను చేయగల పని ఒక్కటే. మర్నాడు స్కూలు కెళ్ళి హెడ్మాష్టరుతో జరిగిన సంగతంతా చెప్పి ముగ్గురినీ వేర్వేరు సెక్షన్లలోకి మారిపించాలి! అప్పుడు గాని కొంత ఉపయోగం ఉండదు.

మర్నాడు ఉదయం నిద్రలేవగానే త్వరత్వరగా రడీ అయి, శ్రీను స్కూలువేపు బయల్దేరేడు. స్కూలు బిల్డింగ్ బయట ఉన్న సినిమాబోర్డులు చూస్తూంటే మతి పోయినట్టయింది. ఒకపాతిక బోర్డులున్నాయ్. మొత్తం వాటన్నిటిమీదా సెక్స్‌కి సంబంధించిన పోస్టర్లే. ఒకదానిమీద "స్త్రీ పురుష కామరహస్యాలు" అన్న పేరుంది. దానికింద పెద్దపెద్ద అక్షరాలతో ఇంకా వివరాలు కూడా ఇచ్చారు ఆ చిత్ర నిర్మాతలు.

ఆ అక్షరాలకింద నగ్నంగా ఉన్న ఓ పురుషుడు, స్త్రీ బొమ్మలు —

ఆతరువాత ఏదో తెలుగుచిత్రం. జయమాలిని...నవ్వుతోంది. అన్నీ ఇలాంటివే. చాలామంది పిల్లలు అయిదేళ్ళనుంచీ పదేళ్ళ వయసువాళ్ళు—వాటిముందు మూగి — వాటివంకే చూస్తూ—ఏదో మాట్లాడుకుంటున్నారు.

గోపాల్రావ్ హెడ్మాష్టరు గదిలోకి చేరుకున్నాడు. బయట ఏదో షాపులోనుంచి తెలుగుసినిమా తాలూకు బూతు పాట పెద్దగా వినబడుతోందక్కడికి.

గోపాల్రావ్ — హెడ్మాష్టర్ల సంభాషణల్లో ఆపాట మధ్య మధ్యలో జొరబడి అంతా కలగా పులగంగా తయారయింది.

"నమస్కారమండీ"—అనగానే "సూదిలో దారం" అన్న పాట పదం జొరబడింది.

"నమస్తే"...సందులో బేరం—అన్నాడు హెడ్మాష్టరు.

"మా అన్నయ్య కొడుకు శ్రీనివాస్—...ఏం బుల్లోడో—ఏం బుల్లోడో-మీ స్కూల్లో సూదిలో దారం – నాలుగో తరగతి బి సెక్షన్‌లో సందులో బేరం – ఉన్నాడు. మీ స్కూల్లో పిల్లలను సరయిన క్రమ శిక్షణలో - ఏం బుల్లోడో—ఏం బుల్లోడో-ఉంచటం లేదని చెప్పడానికి విచారిస్తున్నాను ..." అన్నాడు గోపాల్రావ్.

"వ్వాట్?" అదిరిపడుతూ అన్నాడు హెడ్మాష్టరు.


"అవును—సూదిలో దారం - నాలుగో క్లాస్ పిల్లలు సందులో బేరం—ఆఫ్టరాల్-పట్టుమని పదేళ్ళ వయసులేదు-అలాంటి పనులా? ఏం బుల్లోడో—ఏం చిన్నోడో-"

ఇంక లాభంలేదని హెడ్మాష్టరు కిటికీ తలుపులన్నీ మూసేసి వచ్చి కూర్చున్నాడు మళ్ళీ.

"ఎలాంటి పనులు చేస్తున్నారు." అనడిగాడు కుతూహలంగా.

"ఎలాంటి పనులేమిటండీ! ఇంతున్నారో లేదో—ప్రేమించుకోవడం— లవ్ లెటర్స్ రాసుకోవడం—"

"ఓస్ ఇంతేనా! ఇంకేవో కొంపలు మునిగేపని చేశారనుకున్నాను గదండీ! ఈ మాత్రాని కింత రాద్ధాంతం చేస్తారెందుక? మూడోక్లాస్‌లోనే లవ్ లెటర్లు రాసుకుంటూంటే దిక్కు లేదుగానీ - నాలుగోక్లాస్ గురించి ఆలోచిస్తున్నారా?—"



"ఏమిటీ? మూడోక్లాస్ పిల్లలే లవ్ లెటర్స్ రాసుకుంటున్నారా?" నెత్తికొట్టుకుంటూ అడిగాడు గోపాల్రావ్.

"ఇప్పుడేంటండీ! చాలా కాలంనుంచీ జరుగుతోందిది. రెండు మూడు కేసులు రెండోక్లాస్‌లోనే జరిగాయి కూడానూ!"

"దీసీజ్ టూ మచ్!" అన్నాడు గోపాల్రావ్.

"కాదు. త్రీమచ్" అన్నాడు హెడ్మాష్టరు.

"అయితే మరి దీని కేందారి?" నిరాశగా అన్నాడు గోపాల్రావ్.

"గోదారే-దేశం భావి పౌరుల గతి!"

"మా శీనుగాడు చేసే వెధవ పనులన్నీ చూస్తూ ఊరుకోవాలంటారు!"

"బెస్ట్ థింగేమిటంటే అసలు చూడకుండా ఉండడం! నేను స్కూల్లో ఏంజరిగినా అదేపని చేస్తుంటాను. చూడనట్లు, విననట్లు తప్పించుకుని పరువు కాపాడుకుంటాను. అయినా మీరింతగా అప్సెట్ అవుతున్నారుగా బట్టీ-పదండి! ఆ క్లాస్ కెళ్ళి వాళ్ళ క్లాస్ టీచర్‌తో మాట్లాడదాం!" అన్నాడాయన.

ఇద్దరూ క్లాస్‌రూమ్స్ వేపు బయల్దేరారు.

నాలుగో. తరగతి – ఏ సెక్షన్ – క్లాస్ టీచర్ కాబోలు – పాంటూ, షర్టూ వేసుకున్న అమ్మాయి క్లాస బయట నిలబడి ఓ హిప్పీ కుర్రాడితో ఏదో మాట్లాడుతోంది. "చూశారా! అతను ఆ అమ్మాయి అంటే ఈక్లాస్ - టీచర్ బాయ్‌ఫ్రెండ్! ఆపిల్లలెదురుగా వీళ్ళిద్దరూ ప్రేమ సంభాషణలు, ప్రేమచూపులు, ప్రేమకథలూనూ! నేనేమయినా కల్పించుకుంటే నా ఉద్యోగం గోవిందా! ఎందుకంటే ఆపిల్ల మాస్కూలు కమిటీ మెంబరు కూతురు!" అన్నాడు హెడ్మాష్టరు.

"ఐసీ" అన్నాడు గోపాల్రావ్ ఇంగ్లీష్‌లో కోపంగా.

ఇద్దరూ ఫోర్త్—బి కి చేరుకున్నారు.

ఆ టీచరుపిల్ల కూడా పాంటూ, ఒనీనూ వేసుకుని ఉంది. అటువేపు తిరిగి ఏదో పాఠం

చెప్తోండడం వల్ల వాళ్ళెవ్వరూ గమనించ లేదు.

ఆ పిల్ల బనీనుమీద పెద్దగా—ఎర్రగా రాసి ఉన్నాయ్ ఇంగ్లీష్ అక్షరాలు—అవన్నీ కూడబలుక్కుని చదివాడు గోపాల్రావ్.

"లైఫ్ ఈజ్ షార్ట్ — కమాన్ — ఎంజాయ్ —క్విక్"

"మంచి స్లోగన్" అన్నాడతను హెడ్మాష్టరుతో.

"నా ఉద్యోగం" అన్నాడు హెడ్మాష్టరు.

"మీ కమిటీ మెంబరుకి ఎంతమంది కూతుళ్ళు?"

"ఈ అమ్మాయి ఇంకో కమిటీ మెంబర్ కూతురు!"

గోపాల్రావ్ ఆ టీచర్ పిల్ల చెప్తోన్న పాఠం విన్నాడు. మామూలుగానే బయటి సినిమా బూతుపాట మరింత గంభీరంగా ఫ్రెష్‌గా వినబడుతూ పాఠంలో కలిసిపోతోంది. ఏది పాఠమో, ఏది పాటో తెలీడం లేదు.

"ఓయి బాటసారీ! (మొదలెక్కడ—తుదిఎక్కడ)—నీవు పేదవానివలె కనబడుచున్నావు! (ఈ తనువులు కలిసే దెక్కడ—ఎక్కడ—ఎక్కడ) ఈ చెరువులో స్నానం చేసి (మొదలెక్కడ) ఈ బంగారు కడియం (తుదిఎక్కడ) తీసికొనుము (ఈతనువులు కలిసే దెక్కడ, దెక్కడ—ఎక్కడో....)

గోపాల్రావ్‌కి నీరసం వచ్చేసింది. టీచర్ పాఠంకంటే ఆ బూతుపాటే స్పష్టంగా వినబడుతుందక్కడికి. ఈలోగా ఆ టీచర్ హెడ్మాష్టర్‌ని చూసి పాఠం ఆపింది. రెండు నిమిషాలు ఆ టీచర్‌తో ఏదో మాట్లాడి మళ్ళీ గోపాల్రావ్ దగ్గరకొచ్చి 'పదండి' అన్నాడు హెడ్మాష్టరు.

ఇద్దరూ మళ్ళీ హెడ్మాష్టరు గదికొచ్చారు.

"ఆమె అంతా చెప్పింది. మీ వాడూ ఆ జ్యోతీ ప్రేమ లేఖలు రాసుకోవడం, ప్రేమించుకోవడం-అంతా స్కూలు ఆవరణలో జరగలేదట—స్కూలు బయట జరిగింది. కనుక బయట జరిగిన వాటికి మేమెలా బాధ్యులవుతాము చెప్పండి! పైదీగాక వాళ్ళేం మరీ చిన్నపిల్లలు కాద! నాలుగో క్లాస్ చదువుతున్నారు. ఒక్కొక్కళ్ళకీ పదేసి సంవత్సరాలు వయస్సొస్తోంది! అలాంటివి మరి సహజమే...."

గోపాల్రావ్ మొదడు మొద్దుబారిపోయింది.

లేచి స్కూలు బయటకొచ్చి ఇంటివేపు నడవసాగాడు.

ఇప్పుడు బయటి రికార్డ్ మారింది. ఉండుండి గోపాల్రావ్ మెదడులో బలవంతంగా జొరబడుతోంది.


"అబ్బ - నిద్దరొస్తోందండీ! - ఏమిటంటే ఏమి చెప్పను"

ఇంట్లోకి వస్తూనే గట్టిగా 'వదినా' అంటూ అరిచాడు గోపాల్రావ్.

"ఏం మగాడా! ఏం సాధించావ్?" నవ్వుతూ ఎదురొచ్చింది కౌసల్య.

"భలేదానివే వదినా నువ్వు! ఏదో కొంపలు మునిగిపోయినట్టు చెప్పావా విషయం. అందులో అసలు తప్పేముందనీ? శీనుగాడూ, జ్యోతీ ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకుందామనుకున్నారు. కానీ పాపం వాళ్ళకా అదృష్టం లేదట! జ్యోతి చెప్పింది! ఎందుకో తెలుసా? అనుకోని పరిస్థితుల్లో—ఓ మళయాళీ సినిమా చూసి—పాపం ఆ శీనుగాడు-ఈ సమస్యతో ఎంత నలిగిపోతున్నాడో-తల్చుకుంటే....అయినా ఇలాంటివి రెండో క్లాసు నుంచే జరుగుతున్నాయనీ కనుక మనమేం దిగులు పడనక్కర్లేదని హెడ్మాష్టరు చెప్పాడ్లే—నువ్వేం భయపడకొదినా! హెడ్మాష్టర్ ఈజ్ గ్రేట్-నాక్కొంచెం కాఫీ ఇవ్వు తలనొప్పిగా ఉంది...." అనేసి కుర్చీలో కూలబడి పాట పాడసాగాడు గోపాల్రావ్..

"లే....లే... లే.... లేలేలే నారాజా!" ■



నేపాలీ అమ్మాయి



కావిలిపాటి విజయలక్ష్మి

సాంకీ బజారులో స్వెట్టర్లు అమ్మే అమ్మాయి అందంగా నవ్వింది. మల్లె మొగ్గలు పేర్చినట్టున్న ఆ చక్కని పలువరుస, నవ్వితే సొట్టలు పడే బుగ్గలు, పచ్చనిముఖం, విశాలమైన నుదురు, నున్నగా దువ్విన నల్లని తలకట్టు, పాపిట కిరువైపులా పాలపిట్ట రంగు పిన్నులూ, గౌను తొడుక్కున్న ఆ నేపాలీ అమ్మాయి అందం చాలామందిని ఆకర్షిస్తూంది.

అబ్బాయిలతో ఆమె దుకాణం రద్దీగా ఉంది. వాళ్ళకు స్వెట్టర్లు చూపిసూ చకచకా వాటి నాణ్యం వివరించి చెబుతూంది హిందీలో. క్యోంసేబేరహా! కాస్తా ఆదే నవ్వుతో ప్రశ్నిస్తూంది.

నేను ఎంతసేపయి అక్కడ నిల్చున్నానో నాకు తెలియటంలేదు. ఆ అమ్మాయిని చూస్తూ నిల్చున్నాను. అంతవరకే నాకు తెల్సు. ఈ అమ్మాయిలాగే ఎవరో ఉండేవారు. ఇదే అందం, ఇదే గొంతు, చలాకీ గుర్తు రావటం లేదు.

"ఏరా ఇలా నిల్చుండిపోయావ్!" స్రా భుజంమీద ఓ చెయ్యి పడింది.

ఉలికి పాటుగా పక్కకి చూశాను. రాజు. గుర్తు వచ్చింది, రాజు చెల్లెలు జాని ఇలానే ఉండేది. ఆ అమ్మాయిపేరు జానకి-ముద్దుకి కాబోలు అందరూ 'జానీ' అనే పిలిచేవారు.

"మీ జాని బాగుందా—ఉత్తరాలు వస్తున్నాయా?" అడిగాను వాడ్ని.

వాడు పకాల్న నవ్వేసి "ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఈ అమ్మాయి మా జానిలా ఉంటుందికదూ! స్వెట్టరు కొంటావా?" అడిగాడు.

"ఉహు" తల అడ్డంగా ఊపాను.

"మరెందుకు ఇక్కడ నిల్చున్నావ్: పద పోదాం" అని నన్ను ముందుకు నడిపించాడు. వాడితోపాటు నడుస్తున్నాను. వాడు వేసిన ప్రశ్నలకు వాడిగా జవాబు లిస్తున్నాను కాని నా మనసు గతంవైపు నడుస్తూంది.

రాజు మేమూ ఐదారు సంవత్సరాల క్రితం వరకూ ఖద్బాలో టి ఆర్ సైపు ఇళ్ళల్లో ఇరుగు పొరుగున ఉండేవారం. వాళ్ళ నాన్నగారికి పెద్ద ఇల్లు ఇవ్వటంతో వాళ్ళు వెళ్ళిపోయారా ఇంట్లోకి. రాజుకి నలుగురు చెల్లెళ్ళు, ఇద్దరు అక్కలు. వాళ్ళ నాన్న తాగుబోతు కావటం వలన తరుచుగా ఆర్థిక ఇబ్బందులకు లోనవుతూ ఉండేవారు. అప్పుడప్పుడు మేం కొద్దిగా ఆదుకునేవారం. రాజువాళ్ళమ్మ తెలివైనది. ఏదో వాళ్ళకి తగిన సంబంధాలు తెచ్చి ముగ్గురు ఆడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసేశారు. జానకి నాలుగవది. రాజుకి గత సంవత్సరమే పెళ్ళి అయింది.

బీహారీ అబ్బాయి 'కవి' వారింటికి తరుచు వచ్చి పోతూండేవాడు. జానకి అతనితో చాలా క్లోజ్‌గా తిరిగేది. ఆ అమ్మాయి అతనివైపు చూసే చూపుల్లో ఆ నవ్వుల్లో, భావాల్లో ఆరాధనా భావం కనుపించి ఓ రోజు రాజుతో అన్నాను "మరేం అనుకోకు అబ్బాయ్'—కవి'ని అస్తమానం ఇంటికి రానివ్వకు, అంతే అతను ఇంట్లోకి వచ్చి మీ చెల్లెలుతో బాతాఖానీ వేసుకునే అవకాశం ఇవ్వకు" అని.

దానికి వాడు కాస్త నొచ్చు కున్నట్లు కనబడి "కవి మంచివాడు. మా చెల్లెలు చాలా తెలివైనది. మాకు అలాటి అనుమానాలూ భయాలూ లేవు" అన్నాడు.

ఎందుకు నోరు జారానా అని నేను నొచ్చుకున్నాను తర్వాత.

నా గతస్మృతులు చెరిపేస్తూ, "నాకు జానిని చూడాలనిపించినప్పుడు తప్పక సాంకీ బజారుకి వచ్చి ఈ అమ్మాయితో స్వెట్టర్ల బేరానికి దిగుతాను" అన్నాడు రాజా నవ్వుతూ—ఆ నవ్వులో కొండంత విషాదం.

"జాతి, మతం, కులం ఇవ్వన్నీ మనం పెట్టుకున్నవి. కవికి ఇచ్చి పెళ్ళి చేసెయ్యవలసిందిరా రాజూ!" అన్నాను.

మళ్ళీ నవ్వాడు వాడు. "అది నా కూతురు అయితే అలానే చేసేవాణ్ణి. కాని

చెల్లెలు. నాన్నగారు బ్రతికి ఉన్నారు, విచారించటంతప్ప ఇంకేమీ చెయ్యలేని అశక్తుణ్ణి అయిపోయాను" అంటూ కదిలాడు.

మరేమీ ఆ విషయం చర్చించదలచుకోలేదు. చెరొక 'టీ' తాగి బస్‌స్టాపు వైపు నడిచాం.

ఎవరిళ్ళకు వాళ్ళం వెళ్ళిపోయాం. అయినా గతం నా మనస్సులో కదులుతూనే ఉంది. నా మనస్సంతా పచ్చిగా బాధగా తయారయ్యింది. కుల వ్యవస్థ ఎందరి అమ్మాయిల ప్రేమనిలా నాశనం చేసి వారి జీవితాలు నలిపేస్తూందో! ఎప్పటికి మారుతుందీ సమాజం! నరనరాల జీర్ణించుకు పోయిన ఈ మూఢాచారాలను ఎప్పుడు విస్మరిస్తారు జనం!

గతం నెమరు వేసుకుంటున్నాను చాలా రాత్రి వరకూ.....

○ ○ ○ ○

జానకి పది చదువుతూ బడికి వెళ్ళటం సడన్‌గా మానేసింది. ఫలానా కారణంగా ఆ అమ్మాయిని బడి మానిపించామని ఆ ఇంటివారెవరితోనూ అనక పోయినా చాలామంది అనుకున్నారు 'కవి' తో స్నేహమే కారణమని.

కాని మరికొద్ది రోజులకే ఓ స్కూల్లో టీచరుగా చేరింది జానకి. నలభై ఏభయి రూపాయలజీతం వచ్చేదనుకుంటాను ఆడబ్బు ఆ అమ్మాయి బట్టలకే ఉపయోగించేదట. రాజు చెప్పాడు. అందమైన జానకి అందమైన బట్టల్లో మరీ అందంగా కనులకు మిరుమిట్లు గొలుపుతూ, చూపులు మరల్చలేనంత ఆకర్షణీయంగా కనిపించేది.


కవి; వారింటికి రావటం మానేసినా ఆమెను కలియటం మానలేదని చాలా మందికి తెలుసు. జానకి ప్రతి సాయంత్రం అంజలీ మందిరానికి వెళ్ళేది కవి ఆమె రాక కోసం ఎదురుచూస్తూ ముందుగానే అక్కడికివచ్చి ఉండేవాడు.

రాధాక్రిష్ణ ఆలయ మండపంలో ఇద్దరూ కూర్చుని చాలాసేపు కబుర్లు చెప్పుకునేవారు. మళ్ళీ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయేవారు, ఈ విషయలు రాజుకి తెలుసుననే అనుకుంటాను.

జానకికి సంబంధాలు వెదకటం ప్రారంభించారు ఆమె తల్లితండ్రులు. పెళ్ళివారిముందు బుద్ధిగా తలవంచుకు కూర్చునేది జానకి ముస్తాబయి. వారు వెళ్ళిన తర్వాత వాళ్ళింట్లో చిన్న ఘర్షణ జరిగేది. తర్వాత మళ్ళీ మరొక సంబంధం కోసం వెతకటం. పెళ్ళివారువచ్చి వెళ్ళిన మర్నాడు రాజుని అడిగేవాణ్ణి 'ఏమయ్యింది సంబంధం కుదిరిందా?' అని. వాడు పెదవి విరిచి నవ్వేవాడు, "లేదు జానక్కి ఆ అబ్బాయి నచ్చలేదట" అని. ఓసారి ఓ సంబంధంవచ్చి వెళ్ళాక రాజు కంటతడి పెట్టుకుని గద్గద స్వరంతో చెప్పాడు "ఏమిటోరా ఖర్మ, కుర్రాడు బాగుంటాడు. చదువుకున్నాడు ఉద్యోగముంది. పెద్దగా కట్నం ఆశలేదు, మా అందరికీ చాలా నచ్చింది కాని అది వద్దంది. నాన్న దాని మీద చెయ్యి చేసుకున్నారు- ఆవేశంతో దాన్ని చంపేస్తారేమో అని భయపడిపోయాం. తర్వాత అదిబలవంతంగా ప్రాణం తీసుకుంటుందేమో అని దానికి నచ్చచెప్పాను. నీకు ఇష్టంలేని పెళ్ళి జరగనివ్వనని అభయం ఇచ్చాను. కాని అది నా చేతుల్లో ఉందా! నీకు తెల్సు అది. అది ఒకరికి మనసిచ్చింది. ఎలా జరుగుతుందో ముందు, దైవం ఏం నిర్ణయించాడో తెలియదు"

"పోనీ వాళ్ళిద్దరికీ పెళ్ళి జరిపించేస్తే! నువ్వూ నేను ఏ రిజిష్ట్రారు ఆఫీసుకో తీసుకుపోయి రిజిష్టరు మేరేజి జరిపించేద్దాం." అన్నాను

వాడు తల అడ్డంగా ఊపి నవ్వాడు. "వీలవదు. కవితండ్రికీ ఇష్టంలేదు. అతను కొడుకుని మందలిస్తున్నాడు. నాన్నగారితో చెప్పాట్ట అమ్మాయిని కాస్త అదుపులో ఉంచండి అని, ఆరోజు నాన్న, ఎదిగిన ఆడపిల్ల అనికూడా ఆలోచించకుండా జానకిని తిట్టారు,కొట్టారు. అయినా అది మొండిది. దాని ఉద్దేశమేమిటో



మరి. తమ ఇద్దరికీ పెళ్ళిజరగటం అసంభవమని తెలుస్తుంది కదా? పిచ్చిగా అతని వెంట ఎందుకు తిరుగుతూందో అర్థంకాదు. లేచిపోయి పెళ్ళిచేసుకునే ధైర్యం ఇద్దరికీ లేదు. నువ్వన్నట్లుగా మనం చేశామనుకో — ఎంత రభస! తర్వాత మాచెల్లెళ్ళకు మరి పెళ్ళిళ్ళు కావు. మన ఆదర్శాలన్నీ ఉపన్యాసాల వరకే పరిమితం.- ఆచరణ అంత సులభం కాదు. అది బహుశా ఆత్మహత్య చేసుకుంటుందేమో అని భయం" అన్నాడు.

నేను తరుచుగా జానకి గురించే ఆలోచించేవాణ్ణి. అందమైన ఆ అమ్మాయి జీవితం ఏమవుతుందో అని. రూపం ఇచ్చిన దేవుడు అదృష్టమివ్వలేదు కాబోలు అనిపించేది.

మళ్ళీ జానక్కి ఆరోజు పెళ్ళి చూపుల తతంగం. నేను వాళ్ళింటికి వెళ్ళి రావటానికి అభ్యంతరాలేం లేవు. అందుకని వెళ్ళాను. జానకి పెళ్ళికొడుకుల్ని అసలు చూస్తుందా? చూడకుండానే నచ్చలేదని చెబుతూందా అని.

ముదురు నీలం పువ్వుల వాయిలు చీర, అదే కలర్ బ్లౌజు మెడలో తెల్లని పూసల దండ-చెవులకు రింగులు, లూజు జడ, జడలో కనకాంబరాలు. ఇదీ తలవంచి కూర్చున్న జానకి ముగ్ధమోహనరూపం. ఆమె ఎవరివైపు చూడటంలేదు. పరచిన పాత తివాసీ తాలూకు వెలిసిమాసినపువ్వులు చూస్తూంది. అంతే.

పెళ్ళికొడుకు నల్లగా జీడిగింజలా ఉన్నాడు. ఒత్తుగా ఒలిసిన కనుబొమ్మలు, మిడిగుడ్లు, చప్పిడి ముక్కు, దళసరి దవడలు, పెద్దపెద్ద తాటి పెదవులు. చందమామలో రాక్షసుడిబొమ్మలా ఉన్నాడు. అతనెక్కడో లోకో షెడ్‌లో పనిచేస్తున్నాడట. ఎవడయినా సరే కూతుర్ని ఇచ్చేయాలనే ఉద్దేశ్యంలో ఉన్న జానకి తండ్రి అతి మర్యాదలు చేస్తున్నాడు. పెళ్ళికొడుకు జానకివైపు తినేసేట్లు చూస్తున్నాడు. అతని కన్నుల్లో, ముఖంలో తృప్తి స్పష్టంగా కనుపిస్తూంది.

"అమ్మాయి అబ్బాయిని ఓసారి చూడమ్మా! తర్వాత అన్ని నిశ్చయమయిపోయాక తణ్ణి చూడలేదు, నాకు నచ్చలేదు అంటే ఇబ్బంది." తెలివిగా నవ్వాడు పెళ్ళికొడుకు పక్కకుర్చీలో కూర్చున్న పెద్దతను

ఎవరో.

జానకి తలఎత్తి ఆ అబ్బాయివైపు, చెప్పినతనివైపు ఓసారి చూసింది. ఆమె ఉద్దేశ్య మేమిటోమరి. వెంటనే ఆముదం తాగినట్లు అసహ్య భావం ఆమె మొఖ మంతా పరచుకుంది.

జానకి వప్పేసుకున్నట్లు, తమందరికీ ఇష్టమయిపోయినట్లు కట్నకానుకల దగ్గర నుంచి పెళ్ళి ముహూర్తం వరకూ అన్నీ అక్కడే వాళ్ళు మాట్లాడేసుకుంటూంటే నాకు గాభరా పుట్టింది. రాజుని ఇవతలికి పిల్చి అన్నాను. "కాస్త ఆలోచించరా డా ఆ అబ్బాయి పిశాచంలా ఉన్నాడు అని."

"చెప్పానుకదా నేనేం చెయ్యలేను-బాధ పడటం తప్ప!" అన్నాడు.

"మగవాడివి కాదూ! అంత చాతకాని వాడివా! ఆపిల్ల నీ చెల్లెలుకాదూ! ఆమె జీవితం సరిదిద్దటంలో నీకు బాధ్యతలేదూ! నీ తండ్రి మూర్ఖుడు, తాగుబోతు. అతనికి వదిలేస్తావా? నీ చెల్లెలి భవిష్యత్ కసాయి వాడిచేతిలో మేకపిల్లలా ఉందిరా—నీ చెల్లెలి పరిస్థితి. ఇదే జానకి నా చెల్లెలు అయితేనా! అందర్నీ ఎదిరించేవాణ్ణి—అవసరమయితే ఈ తండ్రినీ, తల్లినీ, కుటుంబాన్ని చివరికి సమాజాన్నీ ఎదిరించి జానక్కి పెళ్ళి జరిపించేవాణ్ణి కవితో. ఛ ఛ ఏమిటి మను షుల్లా మీకు?" ఆవేశంగా అన్నాను.

"ఉష్. నెమ్మది." నోటికి చేతికి వేళ్ళు పెట్టుకుని నన్ను గట్టిగా మాట్లాడకు అన్నట్లు వారించాడు.

ఆవేశం నుంచి కాసేపటికి తగ్గి ఆలోచించాను. నామాట చెల్లదు. పైగా వాళ్ళ కుటుంబ వ్యక్తిగత విషయాల్లో జోక్యం పెట్టుకోవటం నేరం అని మాఇంటికి వెళ్ళి పోయాను. కాని జాలి, సానుభూతి నా హృదయాన్ని దహిస్తున్నాయి. మరోక వారం పదిరోజులు గడిచాక అనుకుంటాను రాజు. నాచేతిలో శుభలేఖ పెడుతూ ఇలా చెప్పాడు. శుభలేఖ అంటే పసుపు బొట్లు నాలుగు మూలలా పెట్టి వ్రాసిన కార్డు.


అతనీ పేరు మార్కండేయుడు; చదువు, క్వాలిఫికేషన్లు ఏంలేవు.

"పెళ్ళివారువెళ్ళిపోయాక జానకి నాన్న రెండుకాళ్ళు పట్టుకుని నన్నుచంపెయ్యండి, నాన్న నాకీ పెళ్ళివద్దు అని ఏడ్చింది. నాన్న కుడికాలు విసిరి దానిముఖం మీద తన్నారు. పూర్ణా, దీన్ని ఇల్లు కదలనివ్వకు అని అరిచారు. వెనక్కిపడి సర్దుకుని మోకాళ్ళలో తలపెట్టుకుని చాలాసేపు ఏడ్చింది జానకి. దాన్ని ఎవరూ ఓదార్చలేదు. నాన్న అందరి వైపు కాల్చేసేట్టు చూస్తూ ఎదురుగా మంచం మీద కూర్చున్నారు. పెద్దగొంతుతో జానకిని నానా తిట్లు తిట్టారు. అమ్మ వచ్చి ఏమండీ ఏమిటది? నలుగురు వింటే ఏమను కుంటారు-పిల్లకు పెళ్ళి అయేట్లులేదు మీ ధోరణిచూస్తే! అంది మందలింపుగా! ఏమను కున్నారో ఏమో కొంచం తగ్గారు. నన్ను పిల్చి నీలకంఠంగార్ని పిలవమన్నారు.

నేను నీలకంఠంతో వచ్చేసరికి జానకి ఆగదిలో లేదు. ఆరోజు మొదలు అది ఇంట్లో ఏపనీ ముట్టుకోవటంలేదు. సరిగా తిండి తినటంలేదు. మౌనంగా నిర్వేదంగా ఉండి పోతూంది. హరించిన మేఘంలా గంభీరంగా ఉంది. ఏంజరుగుతుందో ఏమిటో: పెళ్ళికి తప్పకుండా రా, ఏం మాఇంటికి రావటం మానేశావు!" అడిగాడు

"నాకూ చాలా బాధగా ఉందిరా. మీ జానకి ముఖం చూడలేక, సహించలేక ఏం నోరు జారతానో అనే భయం, అందుకే రావటం మానేశాను"-అన్నాను.

"అన్నట్లు నన్ను నిన్నరాత్రి అడిగింది పాపం! అన్నయ్యా, పెళ్ళి నువ్వు తప్పించ లేవా ? అని-తప్పించగల శక్తి నాలో ఉంటే ఇంతదాకా రానిస్తానా ? అన్నాను. నాకు సర్వీసు ఇచ్చారు నాన్న, కాని నా ఉద్యోగం పేరమనెంటు కాలేదు కదా ! నేనే ఆ నాన్నగారి సంపాదనతో బ్రతుకు తున్నప్పుడు !... అతన్ని చూస్తే నాకు అసహ్యం పుట్టింది-అలాటివాణ్ణి పెళ్ళి చేసు కుని అతనితో కాపురం నేనెలా చెయ్య



"అన్నయ్యా! అని ఏడ్చింది ఏం చెయ్యను! నేనూ ఏడ్చాను. దాని ముఖంలో ఇప్పుడు కళాకాంతులు లేవు" అన్నాడు.

నేను మౌనంగా తలవంచుకున్నాను. రెండు నిమిషాలు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం. "కవి కనిపించాడా నీకు? వాళ్ళ నాన్న వాణ్ణి వెతుక్కుంటున్నాడట" అన్నాడు రాజు.

"వాళ్ళనాన్న వెతుక్కుంటున్నాడని నీకెలా తెల్సు?" నవ్వబోతూ ప్రశ్నించాను.

"బిష్ణుపూర్ బజార్లో బట్టల దుకాణం దగ్గర కనుపించాడు. ముందు నీ చెల్లెలికి పెళ్ళి చేస్తున్నారటగా! అన్నాడు 'అవును' అన్నాను తాపీగా, మా 'కవి'ని పాడు చేసింది నీచెల్లెలు. వాడు ఎటో పరారయి పోయాడు అన్నాడు. నేనేం జవాబివ్వ గలను — తలవంచుకున్నాను! ఆ బజార్లోనే అతను ఎన్నో నిందారోపణలుచేసి కోపంతో దుఃఖంతో వెళ్ళిపోయాడు. నాకు జాలని పించింది—ఏంచెయ్యను?"

"అన్నిటికీ ఏంచెయ్యను, ఏం చెయ్యను! అనడం అని నవ్వి, అతనికి శుభలేఖ ఇవ్వక పోయావా?" అన్నాను-రాజు ఊరు కున్నాడు.

ఒకప్పుడు ఇంటిపక్క వాళ్ళే కనుక అమ్మావాళ్ళు ఇంచుమించుగా పెళ్ళిపనులు ప్రారంభ మయినది మొదలు వాళ్ళింట్లోనే ఉంటున్నారు ఏదో సహాయం చేస్తూ. నాన్నగారికిచ్చినది కాక నాకో శుభలేఖ ఇచ్చాడు రాజు.

పెళ్ళి జరిగేప్పుడు చూశాను జానకిని. ఆ కొద్ది రోజుల్లో మనిషి పూర్తిగా మారి పోయింది. జీవచ్ఛవంలా కనుపించింది నా కళ్ళకు. మెరిసే కళ్ళు గాజు గుడ్లలా ఉన్నాయి. అస్సలా ముఖంలో నవ్వేలేదు. పక్కన కూర్చున్న బకాసురుడు పువ్వు లాటి జానకి జీవితం మింగేశాడనిపించింది. అతను చాలా కులాసాగా ఉత్సాహంగా కనుపించాడు. సుకుమారంగా అందంగా ఉండే కవికీ ఇతనికీ ఎంత వ్యత్యాసం? అనుకున్నాను. జానకి తనకు తగిన వరుణ్ణి ఎంచుకుంది. ఆమె తండ్రి క్రూరంగా ఆమె ప్రేమనూ సున్నితమైన హృదయాన్నీ దహించి ఈ పెళ్ళి జరిపిస్తున్నాడు-ఇంత కన్నా ఆమె కోరినట్టు ఏ విషమో ఇచ్చి చంపెయ్యకూడదూ! అనుకున్నాను.

పెళ్ళి జరిగిన రెండవనాడు జానకి అత్తవారింటికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోవట మేమిటి, పంపించేశారు. రాజుని అడిగాను జానకి ఏడ్చిందికాబోలు పాపం అని.

వాడు అదోలా నవ్వేస్తూ, "ఏడవనూ లేదు నవ్వనూలేదు మతిపోయిన దానిలా ఉండిపోయింది" అన్నాడు. తర్వాత జానకి పుట్టినింటికి రాలేదు చాలారోజులవరకూ. ఉత్తరాలుకూడా వ్రాయలేదుట. వాళ్ళ అమ్మ ఓసారి జానకిని పిలవటానికి వెళ్ళి చూసివచ్చారు. జానకి వారితో రావటానికి నిరాకరించింది. ఆమెకు ఓ ఆడపిల్ల పుట్టిపోయినట్లుకూడా విన్నాను. ఆమె డెలివరీకికూడా పుట్టినింటికి రాలేదు. కనీసం వారిచ్చిన పువ్వులు, చీరలూ, లాటివి కూడా తీసుకోలేదుట.

ఓరోజు నాకు బిచ్చగాళ్ళ వరసలో కూర్చుని అంజలీ మందిరం దగ్గర 'కవి' కనుపించాడు. దగ్గరగా వెళ్ళి పలకరించ బోయాను.పకపకా పిచ్చివాడిలా నవ్వాడు. పిచ్చివాడిలా ఏమిటి? పిచ్చివాడయి పోయాడని తర్వాత తెలిసింది. ఈ వార్త జానక్కి తెలిస్తే గుండె పగిలి చచ్చిపోతుం దేమో అనిపించింది. రాజుతో ఈ వార్త చెప్పాను. నాకు తెలుసు - "వాణ్ణి అంజలీ మందిరం దగ్గర చాలాసార్లు చూశాను" అన్నాడు.

"నీకేమనిపించింది?" అడిగాను.

"ఏమనిపి స్తేఏంచెయ్యగలను?" అన్నాడు, పాతమాటే.

"ప్రేమ విఫలమైతే స్త్రీ నిగ్రహించుకో గలదు కాని పురుషుడికి ఆ శక్తి లేదేమో అనిపించింది. జానక్కి తెలుసా 'కవి'

పిచ్చివాడయి పోయాడని?" రాజుని అడిగా నో రోజు.

"తెలియదు-ఎందుకు మానిన గాయాన్ని రేపటం? వాడు పిచ్చివాడయి పోయా డంటే అది సంతోషిస్తుందా? ఓ సారి అడి గింది నెమ్మదిగా బావగారు ఇంట్లో లేన ప్పుడు. కవి బాగున్నాడా?" అని.

అబద్ధం చెప్పాను, 'కవి'కి వాళ్ళ నాన్న పెళ్ళి చేశాడు వాళ్ళ నాన్న రిటయిరయి పోయారు, వాళ్ళంతా వాళ్ళ ఊరు వెళ్ళి పోయారని, నాతో ఓసారి రమ్మన్నాను. మౌనంగా తల అడ్డంగా తిప్పింది. ఎప్పుడో వస్తాను, ఇప్పుడు రాలేను. ఆ ఊర్లో నేను నడిచిన ప్రతి అడుగులో నాకు 'కవి' కనుపిస్తాడు. మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది అంది" అన్నాడు.

"మళ్ళీ ఆత్మహత్యా ప్రయత్నమా? అంటే" అదరిపాటుతో అడిగాను.

"అవును నీకు తెలియదు. పెళ్ళి నిశ్చయ మయిన రెండో రోజు జానకి నిద్ర మాత్రలు మింగేసింది. మా ప్రయివేటు డాక్టరుచేత గుట్టుగా వైద్యం చేయించాం. దైవ కృపవలన బ్రతికి బయట పడింది. చావుకూడా నేను కోరుకున్నట్లుగా రాలే దురా అన్నయ్యా అందా నాడు" అన్నాడు.

"పోనీ కొంతకాలం ఆమె మీ ఇంటికి రాకపోవటమే మంచిది" అన్నాను.

కనులు మంటలు పుట్టాయి, నిద్ర కుపక్రమించాను.

○ ○ ○

మరో సంవత్సరం గడిచింది. "జానక్కి ఆడపిల్ల పుట్టింది. వాళ్ళ ఊర్లోనే" అని రాజు చెప్పాడు. బాలసారె మహోత్స వానికి వీళ్ళంతా వెళ్ళి వచ్చారు. కాని అప్పుడు కూడా జానకి ఈ ఊరు రాలేదు. ఆమె భర్తకూడా వెళ్ళమని మందలించా డట. అయినా ఆమె మొండిగా రానందని రాజు చెప్పాడు.

'కవి' చింపిరిజుట్టు మాసి పీలికలయిన చొక్కాలు, వీధులమ్మట అడుక్కు తినటం ప్రారంభించాడు. అతన్ని అతని తండ్రి పూర్తిగా వదిలేశాడను కుంటాను.

ఉన్నట్లుండి కవి కనుపించటం మానే శాడు.

చాలా రోజులు గడిచాయి. నేను నెల రోజుల క్రితం రామచంద్ర పురం తాత గారింటికి వెళ్ళి ఆరోజే వచ్చాను. ఎందుకో ఆ నేపాలీ అమ్మాయిని చూడాలని బుద్ధి పుట్టింది. అంజలీ మందిరంవైపు నడిచాను. బిచ్చగాళ్ళ వరుసలో నాకు తెలియకుండానే నా కనులు వెతికాయి కవి కనుపించలేదు.

సాక్షీ పోయే బస్సెక్కాను.

నేపాలీ అమ్మాయి నవ్వుతూంది. స్వెట్టర్లు బేరమాడే అబ్బాయిలతో మాట్లా డుతూ.

రుమాలుతో కనులు వత్తుకుంటూ రాజు కనుపించాడు ఆ దుకాణం దగ్గర.

"ఏంరా? జానకిని చూడాలనిపించి ఇటు వొచ్చావా?" అడిగాను.

"అవును ఇంక చూడాలని, జానకిని చూడాలని అనిపించి నప్పుడల్లా ఈ అమ్మాయినే చూడాలి. - ఈ అమ్మాయికి పెళ్ళయింది చూశావా? దానిపక్కన అతను కూర్చుని స్వెట్టర్లు మడతలుపెడుతున్నాడు భర్త—చక్కని జోడి" అన్నాడు తడి కనులు రుమాలుతో వత్తుకుంటూ.

"ఏమిటి? జానకి ఏమయింది? ఈ అమ్మా యినే చూడాలంటున్నావు?" అడిగాను గాభరాగా—"జానకి చచ్చిపోయింది."

"ఆ!" అన్నాను దిగ్భ్రాంతుడయి.

"అవును, ఆత్మహత్య చేసుకుంది."

"ఏం? ఎందుకు? ఎవ్వరైనా చెప్పావు ఆమధ్య. ఎంత పని జరిగింది. ఎంత మూర్ఖత్వముందిరా మనలో"....అన్నాను బాధగా.

"పద, జూపార్కుకి పోదాం—అక్కడ చెబుతాను" అన్నాడు వాడు. పార్కుకివెళ్ళి సిమెంటు బెంచీ మీద కూర్చునే వరకు

రాయి - కొబ్బరికాయ

సి
నా
పుణ్యం కోసం
అవి
తలలు బద్దలు కొట్టుకుంటున్నాయ్
పాపం !!

వి. పి, చందన్‌రావ్

ఎవ్వరం మాట్లాడలేదు.

రాజు అన్నాడు. "కవి, జానకి ఇదే బెంచి మీద కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు" అని

"ప్చ్....దురదృష్టవంతులు" అన్నాను.

రెండు నిమిషాల మౌనం తర్వాత "మా బావకి తెలిసిందట పెళ్ళిలోనే-కవిని జానకి ప్రేమించిందని. వాడు గుట్టుగా దాన్ని చిత్రహింసలు పెట్టిఉంటాడు. మనకు తెలియదు. అందుకే అది మా ఇంటికి రానసేడి. పెద్దమనిషిలాగా ఓ మర్యాదస్థుడిలా మా ఎదుట వెళ్ళమనేవాడు".

"నీ కెలా తెల్సు!" వాడి మాటమధ్యలో అడిగాను. "అతనే అన్నాడు. మీ చెల్లెలు ఎవ్వర్నో ప్రేమించిందని నాకు పెళ్ళిలోనే తెలిసింది. అది ఎప్పుడో పారిపోవటమో! చావటమో చేస్తుందని తెల్సు. నాతో ఇష్టంగా కాపురం చేసి చచ్చిందేమిటి? అని అన్నాడు కసిగా" అని నిట్టూర్చాడు.

"ఇద్దరం కలసి వస్తున్నామని ఉత్తరం రాసింది. చాల సంతోషంతో అమ్మ వాళ్ళు వస్తున్నారని ముందుగానే పిండి వంటలు చేసింది.

కాని వాళ్ళు వస్తానన్న రోజు రాలేదు. ... బావ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది నాకు. 'మీచెల్లెలు యాక్సిడెంట్‌లో పోయిందని'. నేను, నాన్నగారు బావగారి ఊరు వెళ్ళాం విషయ మేమిటో వివరంగా తెలుసు కోవాలని-ఏముంది? అతనే ఓ ముందుసారిగా మాట్లాడేడు. తర్వాత చెప్పాడు. ఇద్దరూ ఈ ఊరు రావాలని రైలెక్కారట-నాలుగైదు స్టేషన్ల తర్వాత ఓ పిచ్చివాడిలా ఉన్నతను రైలెక్కాడట. జానకివైపు చూస్తూ ఏడవటం ప్రారంభించాడట. జానకి బాత్‌రూంకి వెళ్ళే నెపంతో లేచివెళ్ళిందట. ఆమెవెనుక ఆ పిచ్చి వాడు వెళ్ళాడట. బావగారు పాపనెత్తుకు కూర్చున్నారట. ముందు పిచ్చివాడు బండిలోంచి గంతేశాడు. బండి స్లో అయింది, వెనుక జానకి గంతేసింది. రైలాగిపోయింది.

అతనికి మతి స్థిమితం లేకా, ఆమె ప్రమాదవశాత్తూ, యాక్సిడెంటులో మరణించారు. ఇది వార్త." అంటూ భోరున ఏడ్చాడు రాజు.

o o o o

స్వెట్టర్లు అమ్ముకునే నేపాలీ వాళ్ళు స్వదేశం వెళ్ళి మళ్ళీ దుకాణాల్తో ప్రత్యక్షమవటం మామూలేకాని, ఆ నేపాలీ అమ్మాయి రాలేదు.

రోజూ సాక్షి బజారుకి వెళ్ళేవాళ్ళం నేనూ రాజూ ఇద్దరం. ఆ అమ్మాయిలో జానకిని చూడాలనే, రోజులూ, నెలలూ గడిచాయి కాని ఆ అమ్మాయి రాలేదు.

మా రాజు పక్కదుకాణాల వాళ్ళని అడిగాడు. నేపాలీ అమ్మాయి అనుకోవటమే కాని ఆమెపేరు అడ్రసు మేం ఎప్పుడూ అడిగి తెలుసుకోలేదు. వాళ్ళు తెలియదన్నారు. కొందరు రాలేదన్నారు, కొందరు రావచ్చు సీజన్ కదా అన్నారు.

ఇప్పటికీ ఆ అమ్మాయి కోసం మా కనులు వెతుకుతూనే ఉన్నాయ్.

కానీ, ఆ నేపాలీ అమ్మాయి మాత్రం మళ్ళీ స్వెట్టర్ల దుకాణంలో కనుపించలేదు. ■

సీరియల్ సాహిత్యలత

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవీ రామశాస్త్రి

జరిగిన కథ

ఎలాగో పెళ్ళికి ఒప్పుకున్నాడు శ్రీమంత్—ఎలాంటి ఆర్భాటం లేకుండా వకుళ, శ్రీమంత్‌ల పెళ్ళయిపోయింది. హృదయ పూర్వకంగా తనని దగ్గరకి తీసుకునేదాకా తను ఏమాత్రం శ్రీమంత్‌ని ఇబ్బంది పెట్టకూడదని నిశ్చయించుకుంది వకుళ—ఇద్దరి ఒప్పందం ప్రకారం జరుగుతున్న నిశ్శబ్దాన్ని భరించలేక పోతున్నారు శ్రీమంత్ తండ్రి, చెల్లెలు శారద.

—చదవండిక—

23

ఆ శనివారం ఇల్లంతా శుభ్రంచేసి కడుగుతూన్న శారద సామాన్ల గదిలోకి వెళుతూనే ఏదో అర్థమైనట్లు అచ్చెరువుతో నిలబడి పోయింది.

ఒక దుప్పటి, తలగడ, మంచినీళ్ళపాత్ర, కొన్ని పుస్తకాలు, ఒక బెడ్‌లైటు, వాడిన పూలు............

వకుళ ఆగదిలో రాత్రులు ఒంటరిగా గడుపుతున్నట్లు చెప్పక చెబుతున్నాయి.

"దంపతుల నడుమ ఇంకా అన్యోన్యత కుదర లేదని ఇంతవరకూ అనుకుంటూన్నాను కానీ వారిరువురూ దంపతులే కాలేదన్నమాట? మరి ఎందుకీ వివాహం చేసుకున్నట్టు? ఎవరి బలవంతమూ లేదే? ఆ యిరువురే యిష్టపడి చేసుకున్నారు కదా?"

సమాధానాలులేని సవాళ్ళే లేతలుగా రేకెత్తి శారద మెదడును గందర గోళం కావించ సాగాయి.

మరొక రెండురోజులు అన్నా వదినలను అతి జాగ్రత్తగా పరిశీలించిన శారద మూడవ రోజునే ప్రయాణమైంది అత్తవారింటికి.

"క్రొత్తలో కొన్నాళ్ళు నువ్వుంటే వకుళకు సహాయంగా సంతోషంగా వుంటుంది.

కదమ్మా ? ఇంత తొందరగా వెళ్ళక పోతేనేం ?" అన్నాడు కోటయ్య.

"వకుళకు మరయిల్లు క్రొత్త ఏముంది నాన్నగారూ ? మళ్ళీ త్వరలోనే వస్తాను." అన్నది.

"ఏమిటింత తొందర ? బెంగ బావకా, నీకా ?" అడిగాడు శ్రీమంత్.

"పెళ్ళయిందిగా ? ఇంక అవన్నీ నీక్కూ అనుభవమౌతాయిలే, నేనుంటే ప్రతిదానికీ 'శారదా కాఫీ' 'శారదా ఆఫీసుకు వెళుతున్నాను'.......అంటున్నావే కానీ 'వకుళా' అని నోరారా పిలవడం వినలేదుమరి, సిగ్గుపడుతున్నారేమో—మీమధ్య నేనెందుకనీ...."

అన్నను పరీక్షగా చూచింది.

"ఊ, మాటలు నేర్చావ్," అంటూ ఏదో పని కల్పించుకని వెళ్ళి పోయాడు.

ఆమె మాటలు అతడిని అలరింపలేక పోయాయి.

ఆ ముఖంలోని అమవస తిమిరాన్ని, కఠిన గాంభీర్యాన్ని ఇసుమంతైనా సడలించలేక పోయాయి.

"అపుడే వెళతావా ? ఇంకొన్ని రోజులుండలేవా శారదా ?"

అంటూన్న వకుళ మాటలలో మనస్ఫూర్తియైన అభ్యర్థన వున్నది. నిరుత్సాహం వున్నది.

జాలిగా చూస్తూ, వకుళ చేతిని పట్టినొక్కి వదిలింది శారద.

స్నేహ పూరితమైన ఆ క్రియలో భాషకందని భాష్యాలెన్నో వెల్లువలైనాయి.

బయలుదేరేముందు వకుళ యిచ్చిన పసుపు కుంకుమలు తీసుకుంటూ ఆర్ద్రతా పూరిత స్వరంతో అన్నది శారద;

"అమ్మను ఎరుగని నేను, ఇతరుల ఇండ్లలో యిటువంటి లాంఛనాలూ, ఆచారాలు చూచి అబ్బుర పడేదాన్ని, నేటికి నువ్వు వచ్చి నాకు అమ్మలాగా.........."

ఆనందాశ్రువు తొలికించుతూ మాటలను పూరింప లేక పోయింది.

"శారదా! నా వల్ల ఏ లోపం లేదు కదా! ఇంత త్వరగా వెళ్ళి పోతున్నావు?"

"ఛ. అదేం మాట వదినా?"

"మరి?"

"వకుళా! నువ్వూ, అన్నా వుండ వలసి నట్లు లేరు, అందుకే నేను వెళ్ళిపోతున్నాను." ఈ మాటలు చెప్పడానికి శారద కొంచం బలం కూడ గట్టుకో వలసి వచ్చింది.

అపరాధిని వలె తల వాల్చుకున్నది వకుళ.

"నేను మీ నడుమ లేకుంటే కొంతైనా తప్పని సరిగా చేరువ అవ్వగలరనే ఆశతోనే వెళుతున్నాను." అంటూ వకుళ కనులలోనికి పరీక్షగా చూచింది.

జల పూరితమైన వకుళ నేత్రాలు వసుధ వాలాయి,


ఆ హృదయంలోని హోరును పసిగట్ట గలిగిన శారద ఆర్ద్ర స్వరంతో అనునయంగా అన్నది!

"వకుళా! నా పుట్టినింటిని కోరి మెట్టిన సుగుణాల రాశి నా వలెనే అన్ని సుఖాల్నూ అందుకోవాలని సాటి యువతిగా నా కోరిక, నేను మళ్ళీ వచ్చినపుడు కళ కళ లాడే మీ ఇంటను చూడ గలగాలి."

"................................"

"మీ మధ్య అగాధానికి కారణమేమిటో నాకు తెలియదు వకుళా. కానీ మొన్న నేను ఉదయం సామానుల గదిలోనికి వెళ్ళినపుడు మాత్రం అక్కడి వస్తువులు మీ నడుమ గల ఆ అగాధం సాధారణంగా పూడగలది కాదని చెప్పాయి."

బల్లిపడే శాస్త్రం   కంఠంముందుభాగాన - ఆత్మహత్యా ప్రయత్నం



ఉలికి పాటుతో చూచింది వకుళ.

"నా దగ్గర అభిమానం వద్దు కానీ, అందుకు కారణం ఏమిటో తెలుసు కుంటే ఏదైనా సాయపడగల నేమోనని.........."

కొంత తడవు మనసులో మథన పడుతూ మౌనంగా వున్న వకుళ ప్రకాశంగా అన్నది:

"శారదా, స్పష్టంగా చెప్పలేక పోతున్నందు కేమీ అనుకోవద్దు..................... ఎవరికైనా మనసున ప్రేమ జనించేది ఒక్కసారే—ఒక్క వ్యక్తి పైననే, రెండవసారి జరిగేది మాత్రం ప్రేమకాదు—కేవలం జీవితంలో పడే రాజీ? అందుకు కూడా కొంత వ్యవధి అవసరం కదా?"

శారద ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో వకుళను ఆపాద మస్తకం చూస్తూ అన్నది.

"మానసికంగా ఎంత ఎదిగావు? మరెంత ఉన్నంతగా ఆలోచిస్తున్నావు? అన్నయ్య నిజంగా చాలా అదృష్ట వంతుడు. అది ముందు ముందు తానే గ్రహించుతాడు!"

"ఆ ఆశతోనే ఈ వివాహం చేసుకున్నాను శారదా,"

"ఒక్కమాట, అన్నయ్య వల్ల ఏమైనా లోటు జరిగినా సర్దుకుపో వకుళా."

"అలాగే, ఈ విషయాలన్నీ మన మధ్యనే...................."

"నాకు తెలుసు, వెళ్ళొస్తాను మరి?"

"ఊ...ఉత్తరాలు వ్రాయి."

కొద్దిసేపు తటపటాయింపుతో గడిపిన శారద ఆఖరుకు తెగించి తన మనస్సులో మాట చెప్పింది.

"వకుళా, సిగ్గు పడకుండా విను, సామీప్యం కొన్ని సమస్యలను అవలీలగా పరిష్కరించుతుంది. అన్న అడగక పోయినా, నీకై నీవే అతడికేం కావాలో తెలుసుకొని అమర్చాలి. దూరంగా మూగిగా వుండకూడదు."

నిర్లిప్త హాసంతో తల పంకించి అంగీకారం తెలిపిందేకానీ, వకుళ మనస్సు అందుకు ఏమాత్రం ఆమోదకరంగా లేదు.

"అతడు నన్ను నాకోసమే పరిగ్రహించే రోజు రావాలి. అంతవరకూ వేచి వుంటాను కానీ సిగ్గులేమిగా ప్రవర్తించను" అనుకొన్నది మనసున స్థిరంగా.

24

"ఏమిటి శ్రీమంత్? పెండ్లి చేసుకుని ఓపార్టీ అయినా యిచ్చావు కాదు?"

"మాకు పార్టీ ఇచ్చిన గంటా రెండుగంటల కాలంలో కూడ శ్రీమతిని వదలి వుండలేకనా?"

చనువుగల సహోద్యోగుల ఛలోక్తులకు శ్రీమంత్ చిరుహాసమే జవాబు.

అయితే, కొందరు గుసగుసలతో చాటుమాటు కబుర్లు చెప్పుకోవడం కూడ శ్రీమంత్ గమనించాడు.

"పెద్దామెతో తిరిగేవాడు—చిన్నామెను కట్టుకున్నాడు, కారణమేమిటో?"

"ఆవిడా తక్కువేం కాదు, పెద్ద కాంట్రాక్టర్ని ఎన్నుకుంది, పసినిమాలో చూచినా వాళ్ళే, చూడలేదూ?"

"ఇంతకూ ఎవరు ఎవర్ని కాదన్నారు? శ్రీమంత్ శశిని వద్దన్నాడా లేక శశిరేఖ గారే...."

"అ....ఇతగాడికి అంతగా ఔనూ కాదనే అర్హతకూడానా? ఆమె ధనవంతురాలు. తన యిష్టం!"

"మరి ఆమె చెల్లెలే............ఏమిటో?"

"ఔను! అక్కగారంత సౌందర్యవతి కాదట! అందుకేమో?"

"యేమోకానీ అదే ఇంటిలో, అల్లుడుగా ఆమెను చూస్తూ ఎలా తిరుగుతాడంటావ్?"

గుంభనమైన నవ్వులు.

శ్రీమంత్ ఏమీ సరకు చేయనట్లే నిశ్చలంగా తనపని చూసుకో సాగాడు.

"శ్రీమంత్!"

ఒకతడే పిలిచాడు!

"ఏమిటి?"

అప్పుడే కాగితాల లోనుండి తలఎత్తినట్లు, ఏమీ విననట్లు గంభీరంగా తల ఎత్తి అడిగాడు శ్రీమత్.

"నువ్వు పిలవక పోయినా మేము మీ ఇంటికి వస్తున్నాం ఈరోజు. మీ శ్రీమతిని చూడాలి."

అనుకోని ఈ బాణం శ్రీమంత్‌ను కలవర పరచగా నిరుత్తరుడై చూడసాగాడు.

ఇంతటి నిరాడంబరుడవైన నీ అర్ధాంగి ఎలాగుంటూరో—మేం ఇంటర్వ్యూ చేయాలి."

మరొకతడు లేని చనువును తెచ్చిపెట్టుకుని కొంటెనవ్వుతో అడిగాడు.

శ్రీమత్ మెదడు చురుకుగా పనిచేయగా క్షణాలలో తనను తాను సంబాళించుకుని చిరుహాసంతో జవాబిచ్చాడు.

"ఆల్ రైట్, స్వాగతం! సుస్వాగతం!" నవ్వుతూనే అన్నాడు, అంతలో గంభీరంగా మారిపోయాడు.



"కానీ అక్కడ మీకు విందులుకాదు సరికదా బహుశః కాఫీ కూడా ఇవ్వనేమో? ఎందుకంటే ఆమె నవవధువు—నేను పనిచెప్పి ఇబ్బంది పెట్టలేను."

"వ్వారెవ్వా! పెండ్లామంటే ప్రేమా, భయమా?" ఒకతడు కొంటెగా ప్రశ్నించాడు.

వినట్లే తనమాటలు పొడిగించాడు శ్రీమంత్!

"మరి మర్యాదలు జరపగల ఆడవారెవరూలేరు మాయింట—అమ్మలేని దురదృష్ట వంతుడిని నేను!"

సన్నివేశం గంభీరంగా మారిపోగా కొలది క్షణాలు నిశ్శబ్దం నాట్యం కావించింది.

పెద్దరికమూ, మంచిమనసూగల ఇద్దరు—శ్రీమంత్‌కంటె వయసులో పెద్దవారు కలుగజేసుకున్నారు.

"శ్రీమంత్! శేకిటీజీ, వాళ్ళు 'జోక్' చేస్తున్నారంతే. ఈ సాయంత్రం అప్సరాలో మీ నవదంపతులకు మేము విందు ఏర్పాటు చేస్తున్నాం; మీరు రావాలి."

ఏ భావమూ ప్రదర్శించక శ్రీమంత్ మౌనం దాల్చాడు.

చనవుగా దగ్గరగా వచ్చి భుజంతట్టి అన్నాడు మిత్రుడు శేఖరం.

"నువ్వు క్లుప్తంగా చేసుకున్న వివాహం నీవెంత నిరాడంబరుడవో చెప్తోంది, నీకు ఇటువంటి అట్టహాసం యిష్టం లేకున్నా మా తృప్తికోసం రావాలి, కాదనకు."

అంగీకారంగా తల పంకించక తప్పలేదు శ్రీమంత్‌కు.

కానీ మనసంతా వ్యాకులమైంది.

తాను ఎటువంటి ఇబ్బందికర పరిస్థితినుండి తప్పుకోవాలనుకున్నాడో అంతకంటె యిరకాటమైన స్థితులు కల్పించే సందర్భం ఎదురైంది.

సంఘంలో బ్రతికేవారు తప్పించుకోలేని సామాజిక ఆచార వ్యవహారాలతో కొన్నిటికైనా తలవంచక తప్పదు.

అస్థవ్యస్థమైన ఆలోచనలతో ఇల్లు చేరిన అతడు వీధి వసారావోనే ఆగిపోయాడు.

ఇరువురి వాగ్వాదం వినవస్తోంది లోనుండి.

ఒకరు వకుళ; మరొకరి గొంతు?

తనకు ఒకానొకప్పుడు ప్రియాతి ప్రియమైన ఆ గొంతునే గుర్తింప లేడా?

ఆమె శశిరేఖ!

"ఇదేమి ఖర్మ? పెండ్లి కాగానే వంటలక్కవై పోయావు! ఎప్పుడు చూచినా గిన్నెలు కడుగుతూనో, ఇల్లు శుభ్రం చేస్తూనో కన్పిస్తావే కానీ క్రొత్త జంటలాగా హాయిగా సినిమాలూ, షికార్లూ ఏమి లేవే?"

"నా ఇంటిపని నేను గాక చేసే వారెవరూ లేరిక్కడ, అందుకు నీ అనవసర ఆక్షేపణలు నేను వినగోరడం లేదు."


"ఓ! ధర్మపత్నినన్పించావు! కాని నా కళ్ళు కప్పలేవు, నేను ఆనాడే హెచ్చరించాను. బీదవాడు నిన్ను సుఖపెట్ట లేడని......................."

"అక్కా!" గర్జించింది వకుళ, "నా ఇంట, నా సమక్షంలో నా భర్తను విమర్శించుతావా? ఇందుకే నా చెల్లి యింటికి అక్కవచ్చేది?"

"ఎందుకే అలా భుజాలు తడుము కుంటావు? నీ కష్ట సుఖాలు అడగే హక్కు నాకు లేదా?"

"హు— హక్కు! ముందు ప్రేమ ముఖ్యం. ఒక మనిషిపై నీకు ప్రేమవుంటే దానిని వెన్నంటి అనురాగమూ, హక్కు వుంటాయి. ఈ మూడింటిలో ఏ ఒక్కటీ, విడిగా

బల్లిపడే శాస్త్రం — మోకాలిమీద - వస్త్రలాభం!



వుండదు, ఇవి లేకుండా వట్టిఆరాలు తీసి అడిగితే అది అవహేళన అవుతుంది!"

"పోనీ అలాగే అనుకో, ఇంతటి కలవారి అమ్మాయివైన నీ బ్రతుకు హేళనగానే కన్పడుతోంది అందరికీ. పెండ్లి అంటే ఒకయింటి దాసీగా, వంటలక్కగా, ఒకడి అవసరాలు చూచే ఆయాగా మారడంకాదు. నాస్నేహితుల నడుమ నీవిషయం నాకెంత తలవంపుగా వున్నదో తెలుస్తోందా నీకు? ఛీ, పెండ్లయిన క్రొత్తలోనైనా భార్యను కాస్త వినోద విహారాలకు తీసుకెళ్ళలేని వాడికి అసలు పెండ్లి ఎందుకు? నన్ను కాదని చేసుకుని నువ్వు బావుకుంటున్నదేమిటి?"

"అక్కా! నీ అన్నిమాటలకూ నా సమాధానం ఒక్కటే. బుద్ధికి ధనవంతుడైన నా భర్త బుద్ధిమాంద్యమూ, ధనమదమూ గల నీకు తెలిసిన శ్రీమంతులందరికంటే శ్రీమంతుడు. అతడి నామోచ్చారణ చేయగల అర్హతకూడ నీకు లేదు. అయినింటి ఆడపిల్ల వివాహం కాకుండా ఎవడితోనో చెట్టాపట్టా లేసుకు విహారాలు చేస్తే లోకం నవ్వుతుందికానీ, భార్యాభర్తలు గుట్టుగా యింట పడివుంటే నవ్వదు. గుట్టుగా అందంగా వున్న సంసారాన్ని చూచి పరిహసించేవారు సంసార్లలో జమ కాదు. నీవు వెళ్ళవచ్చు."

శ్రోత శ్రీమంత్ మనసులోని భావాలు వర్ణనాతీతం. వకుళ అంతఃకరణశుద్ధికీ, ఉన్నత భావాలకూ అతడి హృదయం నీరాజనాలర్పించింది. మనసును మలినం చేసే శశి వాచాలతను మరి వినగోరక అపుడే వస్తూన్నవాడిలా "వకుళా" అంటూ హడావుడిగా లోనికి ప్రవేశించాడు దూకుతూన్నట్లే.

"త్వరగా తయారుకా డాళింగ్. అప్సరాలో ఈరోజు మనకు గ్రాండ్ పార్టీ వున్నది. ఊ"

అతి ప్రేమనూ ఆరాటాన్నీ ఒలికించుతూ వకుళను చేరబోయి, అపుడే శశిని గమ

నించినట్లుగా హఠాత్తుగా ఆగిపోయాడు.

"హల్లో? ఏమిటిలా వచ్చావ్?" అని నామమాత్రంగా శశిని పలుకరించి తన గది లోనికి వెళ్ళిపోయాడు.

వకుళ ఒకవిధంగా, శశి ఓవిధంగా ఆశ్చర్యానికి లోనైనారు. కొద్దిసేపు శ్రీమంత్ గది దెసగానే చూస్తూండిపోయారు.

వకుళ కాఫీకప్పుతో శ్రీమంత్ గదిలోకి నడచింది.

అవమానంతో శశి గిరుక్కున తిరిగి బయటికి నడచింది.

తన అల్మైరాలో బట్టలు తీసుకుంటూన్నట్లు అటు తిరిగి నిలబడిన శ్రీమంత్ వకుళ ప్రవేశాన్ని గమనించి ఇటు తిరగలేదు.

"ఆఫీస్ స్టాఫ్ అంతా పార్టీ ఇస్తున్నారు వకుళా. వెళ్ళాలి. ఏడున్నరకు సిద్ధంగా వుండు" అన్నాడు ఇటు తిరగకండానే, నిర్లిప్తంగా నిరుత్సాహంగా వున్న స్వరంతో.

"అలాగే" నెమ్మదిగా అని తిరిగి ఈవలకు వచ్చేసింది వకుళ.

పనులు చేసుకుంటూనే ఆమె అనేకం ఆలోచించింది.

"ఏమిటి శ్రీమంత్ అంత ఉత్సాహంగా రావడానికి కారణం? మరలా యిపుడంత నీరసంగా మామూలుగా అయిపోయాడేమిటి?"

తెలివైన ఆమె సమాధానం వెదుక్కోగలిగింది.

"శశి అహంభావమూ, స్వభావమూ ఎరిగున్న శ్రీమంత్ ఆమెఎదుట నటించాడు. తాము అరమరికల్లేని జంట అని నమ్మించాలనే తాపత్రయం అది!"

ఆమె ఊహ పొరపాటు కాదు.

శ్రీమంత్ ముందుగానే వెళ్ళిపోయి, వకుళకోసం ఆఫీస్ జీప్ పంపించాడు.

వకుళ మనసు బాధగా మూల్గింది. ఒక్కతే వెళ్ళాలంటే అమితమైన సంకోచంగా వున్నది. తాను నవవధువు; విందు తనగురించే ఏర్పాటైనది; అందరూ తనను ప్రత్యేకంగా శ్రద్ధగా గమనించుతారు. మరి అటువంటి తావుకు ఒక్కతెగా...

తప్పదు. శ్రీమంత్ ఆదేశించి వెళ్ళాడు.

"రండి రండి. పెండ్లికుమారుడుగారు ఎక్కడా?"

"మా చెల్లి అమాయకురాలు కాబోలు. అప్పుడే మరది గైర్‌హాజర్ అయ్యాడు"

"అలా వూరుకోకూడదమ్మా. పార్టీకి ఇద్దరం కలసి వెళ్ళాలి అని మొరాయించలేక పోయావా? నిన్ను విడచి ఏమిటా రాచకార్యాలు మా తమ్ముడికి?"

అప్పటికే వచ్చివున్న ఆడవాళ్ళు పరాచికాలాడుతూ స్వాగతం పలికారు వకుళకు.

స్త్రీలు త్వరగా వరసలు కలిపేస్తారు. అంతకంటె త్వరగా అన్నీ అవగాహన చేసుకొని అందుకు కొన్ని ఊహాగానాలను మిళితం చేస్తారు.

అందుకే వకుళ జాగ్రత్తగా మెలగాలని తెలుసుకున్నది.

"ఎక్కడినుండి ఊడిపడ్డావోయ్, భార్యను వంటరిగా పంపి? పాపం క్రొత్తకదా అమ్మాయికి?"

అంటూ విరుచుకుపడ్డారు శ్రీమంత్ తాగానే పురుషులంతా.

అతడు చిరునవ్వు నవ్వేశాడు.

"మీ అమ్మాయిని ఈలోగా పిల్లి ఎత్తుకు పోదుగానీ, ఏదో పనివుండే వెళ్ళానులే, మానేజర్ గారింటికి." అన్నాడు.

సరసం మిళాయించి మాట్లాడుతూన్నా అతి సహజధోరణిలా కన్పడుతోందే గాని నటనవలె లేదు అతడితీరు. ఎవ్వరికీ అనుమానం కల్గించేట్లులేదు ఆతడి ప్రవర్తన, అందరి



ప్రశ్నలకూ ఓపికంగా సమాధానాలు చెబుతూ చిరునగవు చెదరకుండా తిరిగాడు శ్రీమంత్.

వకుళ మౌనమూ, బిడియమూ వధువుకు సహజమే గనుక ఎవరి కనుబొమ్మలూ పైకి లేవలేదు.

కంఠంలో గరళాన్నీ దాచి, పైకి చిరునగవులు చిందించగల శక్తిశాలి! కడుపులో దావానలాన్ని దిగమ్రింగి కసులతో సంతోషాన్ని చిందించగల ధీశాలి! పదిమందిలో నా గౌరవాన్నీ, పరువునూ పదింతలు వృద్ధిచేయగల ప్రజ్ఞాశాలి నా భర్త! ఆతృప్తి చాలు!

అనుకొని హాయిగా తేలికగా నిట్టూర్చింది వకుళ.

"మీ వివాహం ఎందుకంత రహస్యంగా క్లుప్తంగా జరుపు కొన్నారు?"

ఒకామె అడిగింది వకుళా శ్రీమంత్‌లను.

చుట్టూ వున్న వారు సమాధానం కోసం ఆత్రుత ప్రకటించుతూ చూచారు.

"క్లుప్తంగా జరుపుకొని, అధిక ఖర్చు తగ్గించామని ప్రభుత్వంవారి ప్రశంశ పొందాలనే స్వార్థం మాత్రమే" అన్నాడు శ్రీమంత్ అమాయకంగా ముఖంపెట్టి.

అంతా హాయిగా నవ్వేశారు.

"మరి మీరు అంగీకరించారా అతడి వాదనని? పెండ్లి అంటే ఒకేసారి వచ్చే వెలుగండి మన జీవితాలకి! ఎంత గొప్పగా గ్రాండ్‌గా చేసుకోవాలి!"

కళ్ళు త్రిప్పుతూ అడిగిన ప్రౌఢ విపరీతాలంకరణను ఎగాదిగా చూస్తూ సమాధానమిచ్చింది వకుళ!

"ఆమాట నిజమేకానీ, ఆయన అతిలోక సౌందర్యంపై అందరి దృష్టి పడరాదనే నా స్వార్థం అలా చేయించింది."

ఈసారి అందరి నవ్వులూ తారస్థాయిని అందుకున్నాయి.

"అలా అనకండి. ఆయన గర్వంతో విర్రవీగుతారు. మీ అందంకూడ తక్కువేమీ కాదు. ఒకరికొకరు అన్నట్టు ఏర్చి కూర్చబడిన జంట!" అన్నదామె తిరిగి.

"థాంక్స్." వకుళా శ్రీమంత్‌లు ఒకేసారి అన్నారు.

"జాతి పక్షపాతం కూడదండీ. ఓటింగ్ పెడితే మా శ్రీమంత్‌కే అధిక మెజారిటీ." పురుషులు కవ్వింపుగా అన్నారు.

"జాత్యహంకారం కూడా తగదు. అందాల పోటీలో మా అమ్మాయికి బహుమతి ఖాయం. రంగు ముఖ్యం కాదు, కళలు ముఖ్యం" అన్నారు స్త్రీలు తీసిపోకండా.

"బాబోయ్! అయితే ఓటమిని అంగీకరించి ఓ మంచి బీరువాను సమర్పించుకుంటున్నాం నవవధువుకు, ఆ వచ్చే బహుమానాలన్నీ దాచుకోవడానికి."

అక్కడివారిలో ప్రముఖుడు చేసిన ప్రకటనకు చప్పట్లు మిన్నంటాయి.

"సరే. మా అమ్మాయికి మీరిస్తే మీ అబ్బాయికి మేమూ ఇస్తున్నాం. ఒక మంచి రిస్ట్‌వాచీ, సూటూ."

స్త్రీలు తీసిపోకుండా ప్రకటించారు.

మరలా కరతాళ ధ్వనులు చెలరేగాయి.

శ్రీమంత్ ఏదో అభ్యంతరం పలుకబోగా ఎవరూ అతడికా అవకాశమే ఇవ్వలేదు.

"కాదనకూడదు. నీ పెళ్ళి అందరి సంతోషమూ. ఒక ఇంటివాడవైనావు. రేపే

మన ఆఫీస్ ట్రక్‌లో బీరువా మీ ఇంటికి చేరుతుంది.

"మా బహుమానం మాత్రం ఇపుడే ఇచ్చేస్తాం. ఇదుగో వాచీ, వకుళగారు శ్రీమంత్‌కు స్వయంగా చేతికి పెట్టాలి."

వకుళ సిగ్గునూ అభ్యంతరాన్నీ ఎవ్వరూ సరకు చేయలేదు.

శ్రీమంత్ చేతికి వాచీని స్వయంగా అలంకరింపక తప్పలేదు.

ఆ అనుభూతి ఆమె గుండెలలో అపురూపంగా నిలచింది. ఒక్కసారి శ్రీమంత్ వదనంలోనికి చూచింది. అతడిలో ఏ భావమూ లేదు. స్నేహితుడితో ఏదో మాటలు కల్పించుకు మాట్లాడసాగాడు.


"పార్టీ గొప్పగా సరదాగా ముగిసింది" అనుకున్నారు అందరూ తృప్తిగా.

ఎప్పుడైనా మా ఇళ్ళకి తీసుకు వస్తూండవోయ్, ఇక బ్రహ్మచారివి కావు. మా సొసైటీలో చేరావుమరి!" అన్నారు వీడ్కోలు తీసుకుంటూ కొందరు.

"మీరు పిలవకపోయినా మేమూ వస్తూంటాం. రోజూ మీ ఆయనకు ఎన్ని దిష్టిలు దిగదుడుస్తావో మరి!" అంటూ బెదరించింది ఆ విపరీతాలంకరణ ప్రౌఢ వకుళను.

"భగవాన్! ఈనాటి అభినయం ఇంతతో అయిపోలేదన్నమాట! ఇక ఎప్పుడూ ఇలా నటించాలా? ఎన్నాళ్ళు? ఎంతకాలం?" ఇద్దరూ భయంభయంగా తలపోశారు.

[సశేషం]



ఆక్యుపంక్చర్ వైద్యవిధానం

డా॥ గురుకుల మిత్ర

ఒక జబ్బును నయం చేయటానికెన్నో రకాల వైద్యాలున్నాయి. ఒకే వైద్య విధానంలో ఒకే జబ్బుకు ఎన్నో రకాల మందులున్నాయి. మన దేశంలో అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, యూనాని, సిద్ధ, యోగ, ప్రకృతి వైద్య విధానాలున్నాయి. ఇవిగాక గత పదేళ్ళల్లో శరీరం మీద సూదులు గుచ్చి వ్యాధి నయంచేసే ఒక కొత్త వైద్య విధానం-'ఆక్యు పంక్చర్' ప్రచారంలోకి వచ్చింది.

మానవ జీవితం చీకటి గుహల్లో, కొండ చరియల్లో సంచరిస్తున్న ఆటవిక దశలోనే ఆక్యుపంక్చర్ విధానం ప్రారంభమయినట్లు చైనీస్ పాత వైద్య గ్రంథాల్ని బట్టి తెలుస్తోంది. కడుపు నొప్పితో బాధపడుతున్న ఒక ఆటవికునికి అనుకోకుండా ఒక రోజున మోకాలి దగ్గర రాయి దెబ్బ తగిలింది. ఆ రోజు నుండి కడుపునొప్పి తగ్గటం ప్రారంభమైంది. మోకాలి కేంద్రానికి కడుపుకు ఏదో సంబంధముందని గుర్తించటానికి ఆ ఆటవికుడు కడుపునొప్పి వున్న యితర ఆటవికుల మీద రాతి దెబ్బల ప్రయోగం చేశాడు. మోకాటి చిప్పకు కింద మూడు విడితెల దూరం కింద అని ఒక కేంద్రాన్ని గుర్తుపెట్టి కొనతేలిన రాయితో ఒక దెబ్బకొట్టి, కడుపునొప్పి తగ్గుతుందేమోనని చేసిన ప్రయోగం ఫలించింది. అందుకే ఆ కేంద్రాన్ని చైనీస్ భాషలో 'చుఫన్ లి' అని పేరు పెట్టారు. మోకాటి చిప్ప 'కింద మూడు విడితెలు' అని దాని అర్థం. రాయితో కొట్టినప్పుడు కాలి వేళ్ళ వరకు జిల్లు మని నరాలు లాగినప్పుడు దెబ్బ బాగా పనిచేసినట్లు గుర్తించాడు.

ఆ జిల్లుమనే అనుభవం రావటానికి కావలసిన ప్రక్రియలకోసం ఆలోచించి దెబ్బ కొట్టటం కన్నా సూదిలాంటి కొనదేలిన రాయిని 'చుసన్ లి' కింద గుచ్చితే సరిపోతుందని తెల్సుకున్నాడు. రాయిని వదిలిపెట్టి రాతి సూదుల్ని వాడకంలోకి తీసుకొచ్చాడు.

ఒక్క కడుపునొప్పికేనా యీ రాతి సూదులు ఉపయోగం, మరేదైనా నొప్పులకు కూడా పనికొస్తుందా అని ప్రయోగాలు చేయటం ఆరంభించాడు. ఆ ప్రయోగాల ఫలితంగా శరీరంలో వివిధ కేంద్రాల వద్ద రాతి సూదులతో గుచ్చినరాల్ని జల్లుమనిపిస్తే వివిధ రకాలైన నొప్పుల్ని తగ్గించవచ్చుని అనుభవం పొంది తెల్సుకున్నాడు. ఆటవిక దశనుండి మానవ కూటాలు రాచరిక వ్యవస్థలోకి వచ్చేవరకు ఎన్నో వందలఏళ్ళు యీ ప్రక్రియను ఒక వైద్య విధానంగా వాడుతు వచ్చారు. రాతి సూదులు నుండి వెదురు సూదులు పెంపొందాయి. నాగరికత పెరిగి రాతి యుగంపోయి లోహ యుగం వచ్చేసరి బంగారు సూదులు, కంచు సూదులు, రాగి సూదులు, చివరకు యినప సూదులు వాడకం అమలులోకి వచ్చింది. చైనాలో రాజులు సమాధుల్ని యిటీవల తవ్వి బయటకు తీసిరినప్పుడు, ఆ సమాధుల్లో ఆ రాజు కిష్టమైనవస్తువుల్ని వుంచటం గమనించారు. ఆ వస్తువులో వాళ్ళు వాడిన బంగారు సూదులు కూడా వున్నాయ్. అంటే యీ వైద్య విధానానికి రాజాదరణ లభించింది. రాజాస్థానంలోకి యీ వైద్యం పాకే ముందుగానే పాటక జనం దీన్ని ఎన్నో జబ్బులకు వాడుతు వచ్చింది. రాజు వైద్యులు దీన్ని గుర్తించాక దీన్ని అప్పటి తాత్త్విక ధోరణులతో వివరించటానికి ప్రయత్నం చేశారు. ఆ జిల్లుమనే అనుభవం ప్రాణశక్తి యొక్క రూపమని, అది ఎంతవరకు తెలిసిందో అంత దూరం ప్రాణశక్తి,లేక చైనీస్ భాషలో 'చి' ప్రవహించిందని, ప్రాణశక్తి కొన్ని నిర్దుష్టమైన కాలవల్లో ప్రవహిస్తుందని, అలాంటి కాలువలు ముఖ్యంగా పధ్నాలుగున్నాయని వివరించారు. యీ ప్రాణశక్తులు - కాలువ లోపలి అవయవాలకూ బాహ్య అవయవాలకూ బంధించి ఉన్నాయని. బాహ్యంగా వున్న కాలవల కేంద్రాల్లో ఉత్తేజాన్ని కల్పిస్తే ఆ ఉత్తేజం ప్రవహించి అంతరేంద్రియాల్లో ఉత్తేజాన్ని తీసుకొస్తుందని సిద్ధాంతం చేశారు. అంతరేంద్రియాలకు, బాహ్య కేంద్రాలకున్న సంబంధాల్ని ఒక పద్ధతిలో వివరించారు. పంచభూతాలకు, వాటి తత్వాలకున్న గుణాల్ని



ఆక్యుపంక్చర్ చేసే ప్రదేశాలని సూచించే మినియేచర్



ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

సమైక్యత - సంఘీభావం- నేటి తక్షణావశ్యకతలు

మన దేశం వివిధ మతాలు, జాతులు, భాషలకు పుట్టినిల్లు. ఈ వైవిధ్యం, సొగసు మన దేశాన్ని రంగుల పుష్పగుచ్ఛంగా తీర్చిదిద్దాయి. ఈ గుచ్ఛంలోని ప్రతి పుష్పాన్ని సంరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైనా వుంది.

అశోకుడు, అక్బరు, నానక్, చిష్టి, గాంధీ, నెహ్రూ వంటి మహాపురుషులకు జన్మనిచ్చిన మనదేశం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. హింసాత్మక చర్యలకు పూనుకుని జాతి ప్రగతికి మనం అవరోధం కల్పించడం తగదు.

మతం, భాష, ప్రాంతీయ తత్వాల పేరుతో జరిగే హింసాత్మక సంఘటనలు మన ఆర్థిక వినాశనానికి దారితీస్తాయి.

మన ఆంధ్రప్రదేశ్ ఆదర్శప్రాయమైన మత సామరస్యానికి ఐక్యతకూ పేరుపొందింది.

❊ ప్రతి మతాన్ని, ప్రార్థనా స్థలాన్ని గౌరవిద్దాము,

❊ అన్ని పండుగలు కలిసి జరుపుకుందాం.

❊ సాంఘిక సమానత్వం, అభివృద్ధికోసం చేయి, చేయి కలిపి పనిచేద్దాం.

❊ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానాల రక్షణకు ప్రతిజ్ఞ చేద్దాం.


❊ సహోదరుల్లా కలిసి మెలిసి బ్రతుకుదాం.

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

నెం. 85

ఆక్యు పంక్చర్ మొదట చైనా దేశంలో ప్రారంభమైంది. క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దంలో 'యుద్ధ రాష్ట్రా'లున్న కాలంలో 'హువాంగ్డి నెయిజుంగ్' అనే చైనా వైద్య గ్రంథం వెలువడింది. దాంట్లో ఆక్యుపంక్చర్ ను గూర్చి చాల విపులంగా వివరించారు. చైనాభాషలో ఆక్యుపంక్చర్ ను 'జెన్ జుయు' అంటారు.

ఆక్యు పంక్చర్ లో వున్న ఈ తాత్విక అవగాహనను చైనాలో 1966–67 లో సంస్కృతీ విప్లవం జరిగే రోజుల్లో భౌతికశాస్త్రరీత్యా మార్పు చేశారు. ప్రాణ వాహికలంటూ శరీరంలో వేరుగా లేవని, అవి కేవలం నరాలు మాత్రమేనని, ఆక్యుపంక్చర్ నాడీ కేంద్రాన్ని ఉత్తేజ పరస్తుందనీ, తద్వారా అవయవాల పనిని సక్రమంగా చేయించగల్గుతోందని గుర్తించారు.



ఆక్యుపంక్చర్ సంప్రదాయక విధానం


లాటిన్ లో 'ఆకస్' అంటే సూది, 'పంక్చర్' అంటే పొడవటం అని. ఈ సూది పొడుపు వైద్యం చైనా నుండి, తూర్పు దేశాలయిన జపాన్, వియత్నాం, రష్యా, కాంబోడియా, మలేషియా, ఇండోనేషియా. బర్మాలకే కాక, అరబ్ దేశాలు, యూరప్ దేశాలలోకి కూడా పాకింది. దీనికి సైంటిఫిక్ వివరణ మంచి ప్రచారమిచ్చింది. ఆక్యుపంక్చర్ ను ఒక ప్రత్యేకమైన వైద్య విధానంగా తీర్చి దిద్దటానికి మావోసే టుంగ్ హయాంలో గట్టి ప్రయత్నాలు జరిగినై. యీ ప్రయత్నాల్లో ఒక కొత్త విషయం కనుక్కున్నారు. ఆక్యుపంక్చర్ ఎనస్తీషియా, అంటే మందులేకుండా ఆపరేషన్ చేసే రోగిని సూదుల ద్వారా మత్తు కలిగించి ఆపరేషన్ చేయటం.

బట్టీ ఆ కేంద్రాల్ని అవయవాలు పనిచేసే తీరును వివరించారు. ఆ కాలపు తావోయిజం, బౌద్ధ తాత్త్విక ధోరణుల్ని యీ వైద్య విధానంలోకి కూడా చొప్పించారు.

అక్యుపంక్చర్‌ను గూర్చి అధునాతన వైద్య సిద్ధాంతాల వివరణతో చేస్తున్న కృషి ఒక వైపు సాగుతుంటే, మరోవైపు పాత గ్రంథాల్లో చెప్పిందే అన్ని కాలాలకు సరి పోతుందనీ, అసలు ఆక్యుపంక్చర్‌ను సైన్సు రీత్యా వివరించటం చాల కష్టమనే ఆధ్యాత్మికవాద సైంటిస్టులైన కొందరు, ఎందరో పాశ్చాత్యులు బయలు దేరారు. మతం, ప్రాణశక్తి దృష్టితో చూస్తే వివరణ యిప్పుడు చాలావరకు సన్నగిల్లింది. ఆక్యుపంక్చర్‌కు సైంటిఫిక్ దృక్పథాన్ని కల్గించే ప్రయత్నం తెలుగు దేశంలో అక్యు పంక్చర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ద్వారా జరుగుతోంది.


శరీరం లోపల ఉన్న అవయవాలకు సంబంధించిన నాడీమండలాన్ని సూదుల ద్వారా ఉత్తేజపేరచి ఆయా అవయవాలకు రక్త ప్రసరణ, హార్మోన్లు అందటం సరిగ్గా జరిగేట్టు చూచి, అవయవాల్ని సక్రమ పద్ధతిలో పని చేయించటం యీ వైద్యం యొక్క ప్రత్యేకత. సూదులకు మందూ మాకూ ఏమీ అంటించరు. తుప్పు పట్టని స్టెయిన్‌లెస్ స్టీలు సూదుల్ని శరీరం మీద గుచ్చి రోగాల్ని నయం చేస్తారు.

ఈ వైద్య విధానం వలన ఇతర వైద్య విధానాలకన్న, ఏ మందు లేకుండానే పక్షవాతం, పోలియో మైలైటిస్, తల నొప్పి, రక్తపుపోటు, నపుంసకత్వం, పిచ్చి, గర్భాశయ వ్యాధుల్ని నయం చేయవచ్చు. ఎన్నో వ్యాధులకు యీ వైద్య విధానాన్ని ఉపయోగించటాన్ని పరిశీలిస్తున్నారు. 1/10 అంగుళం పొడవు సూదులు నుండి 10 అంగుళాల సూదుల వరకు వాడుతారు. 29, 30, 32 గేజ్‌తో చేసిన సన్నని స్టెయిన్‌లెస్ సూదుల్ని మాత్రమే వాడుతున్నారు యిప్పుడు. పూర్వపు పద్ధతిలో బంగారం, వెండి,



ఆధునిక పద్ధతిలో ఆక్యుపంక్చర్ ట్రీట్‌మెంట్

బల్లిపడే శాస్త్రం మీసంమీద - అధికారలాభం



పంచ లోహాలలో తయారైన సూదుల్ని వాడేవారు. మన దేశంలో కూడా బంగారు సూదులతో ఎక్కువ ఫలితాలిస్తాయనే చాదస్తులూ ఉన్నారు.

ఎన్నడూ చూడనివారు ఆక్యుపంక్చర్ వైద్యం జరిగేప్పుడు చూస్తే అందరిలా పొడవు సూదులు శరీరంలో చొప్పించటాన్ని చూసి భయపడతారు. నిజానికి అనుకున్నంత బాధగాని నొప్పిగాని వుండవు.

ఇది డబ్బు తక్కువగా ఖర్చయ్యే వైద్యం. సూదులు, దూది, స్పిరిట్ దీంట్లో వాడే పరికరాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వైద్య సౌకర్యాలు నోచుకోని పేద ప్రజల దగ్గరకు దీన్ని తీసుకుపోవాలని సమతా ఘుం వైద్య కేంద్రాలు చాలా కృషి చేస్తున్నయ్. ప్రభుత్వం చేయలేని పనిని ప్రజలే చేపట్టి చేయాలని వీళ్ళు గ్రామాల్లో వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఆక్యు పంక్చర్ తెలుగు దేశంలోనే గాక, బెంగాల్, పంజాబు, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోకూడా వుంది. సైన్సు రీత్యా, సరైన పద్ధతుల్లో ఉన్నత ప్రమాణాల్లో ఆక్యుపంక్చర్‌కు అభివృద్ధి, ప్రచారం చేయాలని ట్రస్టు పర్ రిసెర్చ్ అండ్ ఇంటిగ్రేషన్ అనే సంస్థ హైదరాబాదు లో కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా యీ సంస్థ కృషి ప్రోత్సహిస్తూ కొన్ని ప్రకటనలుచేసింది. యీ వైద్య విధానం గుర్తింపుకు మన ప్రభుత్వం చేయాల్సిన చర్యల్ని గూర్చి కూడా ఆలోచిస్తున్నది. ■

గుమాస్తా ఆత్మహత్య

మూలం :
A. P. చెకోవ్

అనువాదం :
P. S. R. మూర్తి

ఆ రాత్రి ఒపేరాలో రెండో వరుసలో కూర్చొని నాటకం చూస్తూ ఆనందిస్తున్నాడు గుమస్తా ఇవాన్ మిత్రిచ్. నాటకం చూస్తూ తాను ప్రపంచంలోని అదృష్ట వంతుల్లో ఒక డనుకున్నాడతను. జీవితంలో చాలా సంఘటనలు హఠాత్తుగా జరుగుతాయి. అలాగే హఠాత్తుగా.......అవును హఠాత్తుగా మొహంలో మార్పొచ్చింది; కుంచించుకు పోయింది. తలపై కెత్తాడు మిత్రిచ్....ఊపిరి ఆగింది ఒక్క క్షణం.... నాటకం నించి చూపు మరల్చాడు. సీటు ముందుకు జరిగాడు. 'హా....ఛ్....'అంటే మిత్రిచ్ తుమ్మాడు. ఎవరైనా, ఎక్కడైనా ఎప్పుడైనా తుమ్మొచ్చు. తుమ్మే హక్కు ప్రతి వాడికీ ఉంది. రైతు, పోలీసూ, ప్రివి కౌన్సిలర్-ఎవరైనా తుమ్మొచ్చు. తుమ్మినందుకు మిత్రిచ్ ఏ మాత్రం బాధ పడలేదు. జేబు రుమాలుతో ఓ సారి ముక్కు అద్దుకొని, పెద్ద మనిషిలా చుట్టూ చూశాడు. తన తుమ్ము ఎవరికన్నా ఇబ్బంది కలిగించిందేమోనని, అప్పుడు మిత్రిచ్ నిజంగా బాధ పడ్డాడు. ముందు వరుసలో కూర్చున్న బట్టతల ముసలాయన బుర్ర తడుముకుంటూ అస్పష్టంగా ఏదో గొణిగాడు. మిత్రిచ్ ఆయన్ని గుర్తు పట్టాడు. కమ్యూనికేషన్ మినిస్ట్రీలో సివిల్ జనరల్ బ్రిజాలోవ్ ఆయన.

"నా తుమ్మువల్ల బాధ పడినట్టున్నాడు. నా ఆఫీసరు కాక పోయినా తుమ్మడం తప్పే. సారీ చెప్పాలి" అనుకున్నాడు మిత్రిచ్. చిన్నగా దగ్గి ముందుకు వంగి జనరల్ చెవిలో అన్నాడు.

"క్షమించాలి. ఇప్పుడు తుమ్మింది నేనే ఇబ్బంది కలిగిం......................"

"ఫరవాలేదు" అన్నాడు జనరల్.

"మీరలా అంటే కుదరదు. నే నసలు తుమ్ముతానని అనుకోలేదు."


"నన్ను నాటకం చూడనిస్తావా లేదా!" విసుగ్గా అన్నాడు జనరల్.

మిత్రిచ్ బాధ పడ్డాడు జనరల్ క్షమించ నందుకు. వెర్రి నవ్వొకటి నవ్వి స్టేజీ మీదికి దృష్టి మరల్చాడు. నాటకం చూస్తున్నాడే కాని మొట్ట మొదట అనుకున్నట్టు ప్రపంచ జీవుల్లో తానో అదృష్ట వంతుణ్ణిని అను కోలేక పోయాడు. ఘోరమైన తప్పు చేసినట్టు ఫీలయ్యాడు. విశ్రాంతి సమయంలో జనరల్ దగ్గరకు వెళ్ళాడు. కాసేపు తటపటాయించి ధైర్యం తెచ్చుకున్నాడు.

"ఇందాక తుమ్మి మీకు చాల ఇబ్బంది కలిగించాను. అలా చేసినందుకు చాలా బాధ....దయచేసి....క్షమించాలి"

"ఆ సంగతి నేనప్పుడే మర్చిపోయాను" అన్నాడు జనరల్ అసహనంగా కింది పెదవిని బిగబట్టి.

మర్చిపోయానని అంటున్నాడు కాని, ఆ చూపులు అలాలేవు అనుకున్నాడు మిత్రిచ్ జనరల్ వంక అపనమ్మకంగా



చూస్తూ. నాతో మాట్లాడ్డం ఇష్టం లేనట్టుంది. సంజాయిషీ చెప్పడం ధర్మం. నేనసలు తుమ్మాలనుకోలేదని........ అది ప్రకృతి ధర్మమని.... లేకపోతే నా మీద ఉమ్మేయ బోయాడని అనుకుంటాడు: ఇప్పుడు కాక పోయినా తర్వాత అనుకోవచ్చు........

ఇంటికెళ్ళాక తన 'దుష్ప్రవర్త' ను భార్యకు చెప్పాడు మిత్రిచ్. ఈ విషయం ఆమెకూడా చాలా సీరియస్‌గా తీసుకుంది. మిత్రిచ్ కోరుకున్నదీ అదే. ఆమె కాసేపు ఆలోచనలో పడిపోయినా జనరల్ తమ 'ఆఫీసర్' కాదని తెలిశాక ఆమె ఆలోచన విరమించింది.

"అయినా నువ్వు పోయి క్షమించమని అడుగు. లేకపోతే నీ కసలు నలుగురిలో ఎలా మెలగాలో తెలీదను కుంటాడు" అన్నదామె.

"నువ్వు చెప్పింది నిజమే. క్షమించమని అడిగాను. కాని ఆయన చాలా వింతగా ప్రవర్తించాడు. క్షమించానన్నే ముక్కే అన్లేదాయన. పైగా అక్కడ టైమ్‌లేదు"

మర్నాడు మిత్రిచ్ శుభ్రంగా క్రాఫ్ చేయించుకొని, కొత్తడ్రస్ వేసుకొని జనరల్ దగరక్కు బయల్దేరాడు. తనను క్షమించమని అడుగుదామని ఆత్రంగా ఉందతనికి. మిత్రిచ్ వెళ్ళేసరికి జనరల్ ఇంటిలో చాలామంది పిటిషనర్లు కూర్చొ

నున్నాడు. జనరల్ వాళ్ళ పిటిషన్లు వింటూ ఇంటర్వ్యూ చేస్తున్నాడు. కొంత మంది నలాగ ఇంటర్వ్యూ చేసి జనరల్ మిత్రిచ్ వంక చూశాడు.

"మీకు గుర్తుండే ఉండాలి. రాత్రి.... తుమ్మాను....మీరు దయచేసి నన్ను........ క్షమిం........" అన్నాడు గుమాస్తా నీళ్ళు నములుతూ.

"వెధవగోల.... మీ పిటిషన్ ఏమిటి?" పక్కనున్న వ్యక్తితో అన్నాడు జనరల్ గుమాస్తా మాటలు పట్టించుకోకుండా.

నా మాటలు వినడంలేదు.... బాగా కోప మొచ్చినట్టుంది. తప్పకుండా సంజాషి చెప్పాలి....తప్పకుండా.... అనుకున్నాడు మిత్రిచ్ జనరల్ ఉదా సీనతకు గాయ పడి.

జనరల్ చివరి పిటిషన్నర్ని పంపించి, ఇంట్లోకి వెళ్ళడానికి లేచాడు. మిత్రిచ్ ఆయన పక్కనే పరుగు లాంటి నడకలో అనుసరిస్తూ మెల్లిగా అన్నాడు.

"క్షమించండి జనరల్! జరిగిన దానికి నేనెంతో బాధ పడుతున్నాను. అందుకే మీకు చెప్పడానికి ఇన్నిసార్లు ప్రయత్నించాను. మీరు తప్పకుండా నన్ను క్షమించాలి"

జనరల్ కోపం దిగమింగుకొని, పొమ్మ నట్టు చెయ్యి ఊపాడు.

"ఇన్నిసార్లు నన్ను పీడించడంలో నీ ఉద్దేశ మేమిటి? నన్ను ఎగతాళి చేస్తున్నావు" అన్నాడు జనరల్ బుసలు కొడుతూ, మిత్రిచ్ మొహం మీద తలుపేస్తూ.

ఎగతాళి చేశానా? ఇందులో హాస్యానికి అన్నదేముంది? నా బాధ నర్థం చేసుకోడు గదా జనరలైయ్యుండి కూడా. సరే.... నా సంజాయిషీలతో ఆయన్ని ఇక బాధ పెట్టను. ఉత్తరం రాస్తాను. అంతే... ఈ సారి తప్పకుండా క్షమిస్తాడు" అనుకున్నాడు మిత్రిచ్ ఇంటికి పోతూ. అయితే మిత్రిచ్ ఉత్తరం రాయలేక పోయాడు. చాలాసేపు ఆలోచించాడు గాని, ఎలా మొదలు పెట్టాలో బోధ పడ లేదతనికి. మర్నాడు మళ్ళీ జనరల్ ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది.

"మీకు నిన్న చాలా ఇబ్బంది కలిగించాను పనిలో ఉన్నా" అన్నాడు గుమాస్తా. జనరల్ ప్రశ్నార్థకంగా చూశాడతని వైపు.

"మిమ్మల్ని ఎగతాళి చేశానని అన్నారు, కాని, అది నిజంకాదు. ఆరోజు నా తుమ్ము మిమ్మల్నెంతో బాధ పెట్టిందని నాకు తెలుసు. దానికి క్షమించమని అడుగుతున్నాను. మిమ్మల్ని ఎగతాళి చెయ్యాలనే దురుద్దేశం మాత్రం లేదు. నా కంత సాహసం లేదు ప్రజల్ని ఎగతాళి చేస్తున్నామంటే వాళ్ళ మీద మనకే మాత్రం గౌరవం లేదని....ఏ మాత్రం గౌ...."

"పో ఇక్కడ్నుంచి" పెద్దగా అరిచాడు జనరల్ కోపంతో, అసహనంతో వణికి పోతూ.

"దయచేసి నన్ను క్షమించానని........ మెల్లిగా అన్నాడు గుమాస్తా.

"గె........ట్ అవుట్............"నేల మీద కాలితో గట్టిగా తన్ని ఇంకా పెద్దగా అరిచాడు జనరల్.

ఏదో పెద్ద దెబ్బ గుండెలోపల గట్టిగా తగిలినట్టు ఫీలయ్యాడు గుమస్తా. అతడికేమి కనిపించలేదు. వినిపించలేదు, గేటు దగ్గరకి వెళ్ళేదాకా. వీధుల్లో అటూ ఇటూ తిరిగాడు. యాంత్రికంగా ఇంటికెళ్ళి కుర్చీలో వాలాడు తన కొత్త సూటుతో, గుమస్తా పిరికి గుండె ఆగిపోయింది. శాశ్వతంగా. ■

మాయదారి మగాడు

జి.ఎస్. సూరి

మధుసూదనాన్ని తను చేసిన తప్పు కృంగదీస్తోంది.

అతనీమధ్య తరుచు అన్యమనస్కంగా ఉంటున్నాడు. భార్య నిర్మలమైన ప్రేమాభిమానాలూ, నిండు మనసుతో అందించే సేవలు అతన్ని మరింత సిగ్గుపడేలా చేస్తున్నాయి.

"ఏమిటండీ ఈ మధ్య అదోలా ఉంటున్నారు? ఆరోగ్యం బాగోలేదా?" అందోళనగా అడుగుతూ వచ్చింది రేణుక అతని తీరు చూస్తూ.

మధుసూదనం సమాధానం చెప్పలేక పోయేవాడు.

"ఓవర్ టైము.... ఓవర్ టైమంటూ అర్ధరాత్రి వరకూ ఆఫీసు నుంచి కదిలిరాక పోవటం....ఆరోగ్యం పాడు చేసుకోవటం. మీకో దణ్ణం పెడ్తాను కాని....ఎంతవస్తే అంతటితోనే సంసారం గడుపుకోవచ్చు కాని వొళ్ళు మాత్రం గుల్ల చేసుకోకండి." ఆపుకుందామనుకున్నా ఆగని కన్నీటితో అర్థింపుగా అంది రేణుక.

ఆ మాటలకు మధుసూదనం చలించి 'ఎంత అమాయకురాలు!....ఎంత ప్రేమ తనంటే!.... అటువంటి దాన్నా తను మోసం చేసేది?.... అర్ధరాత్రి వరకూ తన తిరుగుళ్ళు ఓవర్ టైము అని భావిస్తోందా ఆ పిచ్చిది?'

మధుసూదనం మనసు విలవిల లాడి పోయింది.

అతను మింగాలేక కక్కాలేక పోతున్నాడు. అలా అని తనకంటుకున్న జాడ్యాన్ని వదుల్చుకోనూ లేక పోతున్నాడు. అతను భార్యముందు నిలబడటానికి నేరస్థుడి మల్లే జంకుతున్నాడు.

ఆ రాత్రి నిద్రపోతున్న మధుసూదనం ఉలిక్కిపడి లేచాడు. నిశ్శబ్దమైన వాతావరణంలో ఎక్కిళ్ళ శబ్దం వినపడి ప్రక్కనే పడుకున్న భార్య మొహంలోకి వొంగి చూశాడు. రేణుక కళ్ళల్లోంచి ధారగా నీళ్ళు వర్షిస్తూంటే వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"రేణుకా....రేణుకా...." అన్నాడు భుజం కుదుపుతూ మధుసూదనం ఆందోళనగా.

"ఊ?"- అంది ఏడుస్తూనే రేణుక.

"ఏమిటి?....ఎందుకూ ఏడుస్తున్నావ్."

మధుసూదనం ప్రశ్నించాడు.

రేణుక జవాబు చెప్పలేదు.

అడిగాడన్న మాటేకాని మధుసూదనానికి తెల్సు భార్య కంటి నీరుకి తనే కారణం అని. తన మీద తనకే కోపం వచ్చింది మధుసూదనానికి. 'ఛ ఛ....ఎలా ఏడిపిస్తున్నాను!' మనసులోనే అనుకున్నాడు.

"రేణుకా!" అన్నాడు మెల్లగా మధుసూదనం.

రేణుక భర్తవైపు తిరిగింది.

మధుసూదనం క్షణం ఆలోచనల్లో పడ్డాడు.

చెప్పవల్సింది ఎలా చెప్పాలో తోచలేదతనికి. కాని, చెప్పి తీరాలి, ఇంక తను భార్య దగ్గర నేరస్థుడిలా ఉండలేడు.





ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ



ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య

బలహీన వర్గాలకు చేయూత

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని అమలు జరపడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా బలహీన వర్గాల సంక్షేమానికి ఇటీవలి సంవత్సరాలలో అమోఘమైన పథకాలెన్నింటినో అమలు జరుపుతున్నారు.

సంక్షేమ కార్యక్రమాలలోని కొన్ని ముఖ్యాంశాలు :

❊ మిగులు భూములు పంపిణీ :

74,062 మంది షెడ్యూలుకులాలవారికి **1.05** లక్షల ఎకరాలు
24,371 మంది షెడ్యూలు తరగతులవారికి **39.9** వేల ఎకరాలు
40,871 మంది వెనకబడిన తరగతులవారికి **58.7** వేల ఎకరాలు

❊ ప్రభుత్వ భూములు పంపిణీ :

4,63 672 మంది బలహీనవర్గాల ప్రజలకు **8.11** లక్షల ఎకరాలు

❊ 2 లక్షల మంది పేదలకు ఇళ్ళ స్థలాల పంపిణీ, వారిలో చాలా మంది బలహీన వర్గాల వారికి చెందినవారు ఉన్నారు.

❊ **12,701** మందిని వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగించారు. ఇంతవరకు **5,800** మందికి పునరావాసం కల్పించారు.

❊ వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల అమలు : వారిలో చాలా మంది వెనుకబడిన తరగతుల వారు ఉన్నారు.

❊ ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకానికి వెనుకబడిన తరగతుల వారికి ఇచ్చే రిజర్వేషను మరో 10 సంవత్సరాలకు పొడిగించారు.

❊ వర్ణాంతర వివాహాలు చేసుకునేవారికి ప్రోత్సాహం కలిగిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ లో ఈనాడు బడుగు వర్గాలవారు ఎంతో ఉత్సాహంతో ముందడుగు వేస్తూ ఉజ్వల భవిష్యత్తుపై పయనిస్తున్నారు

డైరెక్టరు, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

నెం. 86

అయినా అందం, ఆకర్షణ....అంతకు మించి అభిమానం, అనురాగం కాదని అడ్డదార్ని ఎందుకు పట్టాడో అర్థం కాలేదతనికి. ఊహూ....ఇంక తను ఆదార్న పోకూడదు... తన ప్రేమా, తన అనురాగం అంతా భార్యకే చెందాలి. ఇంత వరకు తను చేసిన పాపం ఆమె ముందు ఒప్పుకోవాలి. తనను తాను ప్రక్షాళనం చేసుకోవాలి, మధుసూదనం మనసు ఓ నిర్ణయానికి వచ్చేసింది.

రేణుక భర్త మొహంలోకి చూస్తోంది.

ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ఉన్న గంభీరమైన అతని మొహం ఆమెకు భయాన్ని కలిగించింది. తన కంట నీరు అతన్ని చికాకు పరిచిందా? తన జాలితనం అతనికి కోపం కలిగించిందా? ఏం చేస్తుంది? మనసుని నీరై పోకుండా ఎంత కాలం సముదాయిస్తుంది? .... అలసటతో నలిగి పోతున్న అతని మొహం, అతను అహర్నిశలూ పడే శ్రమా అవన్నీ చూస్తుంటే తనని తాను అదుపు చేసుకోలేక పోయింది. అంతే-ఎంత ఆపుకుందామనుకున్నా ఆగలేదు కన్నీరు. ఒక్క మాటు వరదై ఉరికింది. అతనికి నిద్రాభంగం కలిగించినట్లుంది, రేణుక ఆలోచిస్తోంది, ఆ ఆలోచన్లనుంచి తేరుకొని—

"ఏమండీ?....మంచి నీళ్ళు కావాలా?" అడిగింది రేణుక.

చల్లటి నీళ్ళు తాగితే ఉద్వేగం తగ్గుతుందని ఆమె నమ్మకం.

కావాలన్నట్లు తలూపాడు మధుసూదనం.

ఆ కాస్త వ్యవధిలోనూ చెప్పదల్చుకున్న దాన్ని గురించి మరోసారి మననం చేసుకోవచ్చునని అతని ఉద్దేశ్యం. రేణుక గది మూలనున్న టీపాయ్ మీదున్న మంచి నీళ్ళ కూజా దగ్గరకు వెళ్ళింది.

ఆ కాస్త విరామంలోనూ అతని మనసు అటూ ఇటూ తెగ ఊగిసలాడి పోయింది. భార్య అందించిన మంచినీళ్ళ గ్లాసు అందుకుని త్రాగి తిరిగి అదామె చేతికిస్తూ—

"రేణూ! నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను....చెప్పనా?" అడిగాడు.

రేణుక గ్లాస్ అందుకుంటూ ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసింది.

"విన్న తర్వాత కోపగించుకోవటం—బాధపడటం లాంటివి చేయవుగా?"

రేణుకి ఈ మాటు ఆ విషయం మీద ఆసక్తి కలిగింది.

తనకి బాధ-కోపం కలిగించే విషయాలేమున్నాయి అతనిలో....ఆమె మనసుకు అంతు చిక్కలేదు.

మధుసూదనం కాసేపు ఆమె సమాధానం కోసం చూసి— "నా పిచ్చిగాని కోపమూ, బాధ కలిగించే విషయాలు చెబుతూ కలిగిస్తాయా అని అడగటం ఏమిటీ? అయినా ఈ అగ్నిగుండం నా హృదయంలో దాచుకోలేను. ఇది నన్ను నీ ముందర నిలబడ నీయకుండా చేస్తోంది........" అంటూ కాసేపు ఆగాడు.

రేణుకకు మతి పోయినట్లవుతోంది.

ఏమిటతను చెప్పబోయేది?....ఎందుకలా మథనపడి పోతున్నాడు? అంతగా అతని మనసుని నలిపేస్తున్న విషయం ఏమిటీ? రేణుక ప్రశ్నల సుడిగుండాల మధ్య ఉక్కిరి బిక్కిరైపోతోంది.


"రెండు మూడు నెలలుగా ఆఫీసునుంచి ఇంటికి ఆలస్యంగా రావటం నువ్వు గమనిస్తూనే ఉన్నావు కదూ రేణూ?........ ఓవర్ టైమంటూ దానికో సాకు కూడా చెబుతూ వచ్చాను. అసలు నిజం ఏమిటంటే నాకీమధ్య మా ఆఫీసులో పనిచేసే అనూరాధ అనే అమ్మాయితో సంబంధం ఏర్పడింది. ఆ....సంబంధం....అంటే....అంటే....నీకీపాటికి నేను చెప్పదల్చుకున్నది అర్థం అయ్యే వుంటుంది. ఆ అమ్మాయితో తిరుగుళ్ళూ, సినిమాలూ....ఇంకా....ఇంకా....రేణూ! అదేం దిక్కుమాలిన ఆకర్షణో తెలీదు నన్నో పిచ్చివాణ్ణి చేసేసింది. నా కళ్ళను కప్పేసింది....నన్నో మూర్ఖుణ్ణి చేసేసింది. నిన్ను అమాయకురాల్ని చేసేసి నేను వేరే ఆడదానిలో సుఖాలు వెతుక్కోవటం ...ఛ...ఛ....నామీద నాకే అసహ్యం వేస్తోంది రేణూ!"

మధుసూదనం చెప్తోన్న దాన్ని తెల్లబోయి వింటోంది రేణుక.

"అనుభవం — ఆనందం ఎన్నో రకాలన్నట్లు మనిషి శ్రమ పడతాడు కాని.... ఊహూ....అదొట్టి మూర్ఖత్వం.... అమాయకత్వం. అనూరాధకి నేనెలా బానిసనయ్యానూ అని ఆలోచిస్తే నాకు సరైన కారణం ఒక్కటీ మనసుకి తోచటంలేదు. నీకన్నా అందమైనదా? ....నీకంటే ఆకర్షణ ఏమైనా ఉందా?........ నీకంటె ప్రేమించగలదా? లేదు....లేదు నీ ముందు నూరో వంతు కూడా పోటీ పడలేదామె వీటిలో. నేను కాస్త నలిగిపోతే విలవిలలాడి పోయే నువ్వుండగా—నన్ను క్షణం క్షణం అమితంగా ప్రేమించే నువ్వుండగా ఎందుకు నేనలా అయిపోయాను అనుకున్న మరుక్షణం నుంచి నేను చేస్తున్నదీ....నేను నడుస్తున్నదీ ఎంత తప్పో—ఎంత తప్పుదారో తెలిసిపోయింది. అందుకనే రేణూ! ....అందుకే నేను చేసిన నేరం నీ ముందు ఒప్పేసుకుని నువ్వేశిక్ష వేసినా అనుభవించాలనుకున్నా. చెప్పు రేణూ! ఈ మూర్ఖుణ్ణి, ఈ అవివేకిని ఎలా శిక్షిస్తావో?

అయితే ఒక్క విషయం రేణూ!.... నేను చేసింది గొప్ప తప్పేకావచ్చు. ఆ తప్పుకు ఒకలా మానసిక క్షోభతో శిక్ష ఎలాగూ అనుభవించేను. నీ ప్రేమనూ-నీ అనురాగాన్నీ దూరం చేసేటంత పెద్ద శిక్ష వేయకు ప్లీజ్!" మధుసూదనం చెప్పవల్సిందంతా చెప్పేసి అర్థింపుగా అన్నాడు.

రేణుక కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి అతను చెప్పినదంతా వింటూంటే. ఆమెకు కోపం మాత్రం రాలేదు. అదో రకమైన బలహీనత. అది మనుషుల్లో అత్యంత సహజం. ఏదో బలహీనతకు........ ఏదో క్షణంలో లొంగిపోని వాళ్ళుండరు. అలాంటి లోపమే లేకపోతే మనుషులూ—దేవతలూ వేరు వేరు ఎందుకవుతారూ!



పాట

అందం-ప్చ్....
ఎంత కమ్మని అబద్ధం
శిధిలం ఎప్పుడూ
పగిలిపోయిన మృదంగమే
అందమైన భ్రమ సుడి గాలిలా
వుధృతంగా పై కెగసి
క్రమేపీ పొగరు తగ్గి పిల్లగాలై
నాలోంచి నాదంగా జన్మిస్తుంది
నిరంతరం సజీవంగా ప్రవహించే
శబ్దం లోంచి
కనిపించని అందం
వినిపిస్తూ వుంటుంది.

వి. చంద్ర

ఒకలా రేణుకకు భర్తను చూస్తే చాలా ఆనంద మని పించింది. తనది తప్పు అని అతి తక్కువ కాలంలో గ్రహించ గలిగే అతను నేరస్థుడెలా అవుతాడు? అతను మూర్ఖుడూ-అవివేకి ఎలా అవుతాడు. పైగా స్వచ్ఛందంగా తన నేరాన్ని అంగీకరించే ఆవ్యక్తి ఎంత నిర్మలుడు........ఎంత ఉత్తముడు?

రేణుక చటుక్కున భర్త చేతుల్ని అందుకుంటూ– "ఎంత మంచి వారు మీరు!" అంది.

మధుసూదనానికి ఆశ్చర్యం వేసింది. ఆమెకు కోపం రాలేదా?........ జరిగింది విన్నాక ఆమె కోపానికి ఆహుతై పోతానని- ఆమె శాశ్వతంగా తనకి దూరం అయి పోతుందనీ—తనని అసహ్యించుకుంటుందనీ- ద్వేషిస్తుందనీ అనుకుంటే ఇంత తేలిగ్గా క్షమించగల్గిందేమిటి? ఏమైనా మధుసూదనం మనసు తేలిక పడింది.

"నన్ను క్షమించినట్లే కదూ రేణుకా?" మధుసూదనం భార్య మొహంలోకి చూస్తూ అడిగాడు.

రేణుక తేలిగ్గా నవ్వేస్తూ "క్ష...క్షమించటం ఏమిటండీ? మీలాంటి వాళ్ళని చూసి ఏ ఆడదైనా గర్వపడుతుంది కాని...." అంది.

ఆ రాత్రి మధుసూదనం మనసుకు శాంతి చిక్కి హాయిగా నిద్రపోయ్యాడు. రేణుక మనసులో అశాంతి తలెత్తింది. ఆమెకి తను భర్తముందు చాలా అల్పురాలి ననే భావం తలెత్తింది. అతనంత నిర్మలంగా ఉంటూంటే తను మాత్రం కల్మషాన్ని దాచుకుని జీవిస్తోంది?

ఆమెలో ఏవేవో జ్ఞాపకాలు తుఫానులై లేచాయి.

అవామె మనసునీ, ఆలోచనల్నీ అల్లకల్లోలం చేయసాగాయి. రేణుక ప్రశాంతంగా నిద్రపోతున్న భర్త మొహంలోకి చూసింది. అతని మొహం తేటగా వుంది. 'అవును మరి....తనని తాను కడిగేసుకుని పవిత్రత నింపు కున్నాడు' రేణుక అనుకుంది.

తన తప్పుని చెప్పుకుని క్షమార్పణ అడిగిన ఆవ్యక్తిలో మరొకరి తప్పుని క్షమించగలిగే గుణం వుండదా? రేణుకలో తలెత్తింది ప్రశ్న. ఏమో ఎందుకుండదు?.... వుంటుంది....వుండాలి.... రేణుక నిర్ధారణ చేసేసుకోసాగింది తనలోతను.

రేణుక పైన తిరుగుతున్న ఫేన్ కేసి చూస్తూ పడుకుంది.

ఆ ఫేన్‌లాగే ఆమెలోని ఆలోచన్లూ, జ్ఞాపకాలూ అతి వేగంగా కదులుతూ గందరగోళ పరుస్తున్నాయి.

భర్త అన్నట్లు అనుభవం - ఆనందం క్షణికం....కాని అది తెలుసుండీ కూడా మనిషి తప్పు చేయటం జరుగుతూనే వుంటుంది. యాదృచ్ఛికంగా జరిగిందనుకున్నా—అజ్ఞానం వలన జరిగిందనుకున్నా తను కూడా ఓ తప్పు చేసింది. అది....అది ఆడదాని జీవితాన్ని అగాధాల్లోకి విసిరేసే

తప్పు....అరిటాకులా పీలికలు చేసి చిందర వందర చేసే తప్పు....అయినా అదృష్ట మనుకోవాలో, మరేమనుకోవాలో ఆ తప్పును పిండెగానే చంపేసి....మధుసూదనాన్ని పొందగల్గింది తను.

అతని ప్రేమనీ — అభిమానాన్ని పరిపూర్ణంగా పొంది జరిగిన పీడ కలని మనసు తెరపైనుంచి తొలిగించి మధురమైన జీవితం గడుపుతోంది.

అప్పుడప్పుడు ఆ పీడకల మసక మసకగా మనసులో మెదలబోతే, బలవంతాన్న చెదర గొట్టేసేది.

కాని—ఇప్పుడు ఇన్నేళ్ళకు మధుసూదనం వలన ఆ జ్ఞాపకాల తెరలు కదిలాయి. అవి వేధిస్తున్నాయి. బాధిస్తున్నాయి. అతనిలాగే తనూ ఆ నిప్పుని హృదయంనుంచి తొలగించుకుని ఆ మంటను చల్లార్చుకోవాలా?....అలాగే ఆ చేదుని గరళంలా దాచుకుని అసహజమైన తీయదనం కురిపించాలా?

రేణుక మనసు సందేహ-సంశయాల మధ్య కొట్టుమిట్టాడి పోతోంది.

అలా అలా ఆలోచనల మధ్య చాలా సేపటికికాని నిద్ర పట్టలేదు రేణుకకు. ఆ నిద్రకూడా కలవర పరిచే కలత నిద్ర.

ఆ తర్వాత మధుసూదనం మామూలు మనిషయిపోయాడు. ఎప్పటిలాగే ఆఫీసు నుంచి సరాసరి ఇంటికి వచ్చేయటం—వస్తూ వస్తూ భార్యకి పువ్వులు తవటం చేస్తున్నాడు.

రేణుక పరిస్థితి అందుకు భిన్నంగా తయారయ్యింది. భర్త ఏదో కబుర్లు చెప్పబోతే పరాకుగా వూకొట్టటం....ఎక్కడో ఏదో ఆలోచిస్తూన్న దానిలా వుండిపోవటం చేస్తోంది.

నాలుగు రోజులు అలా గడిచేసరికి మానసిక సంఘర్షణకు తట్టుకోలేకపోయింది రేణుక. మగాడే తన తప్పుని దాచుకోలేక బయటికి వెళ్ళకక్కి పశ్చాత్తాపపడితే ఆడదానిగా తను రహస్యంగా అణిచిపెట్టి ఉంచటం అసహజంగా అనిపించిందామెకు.

పైగా భార్యాభర్తలమధ్య రహస్యాలు ఉండకూడదంటారు. దాపరికం అన్నది సంసారం సాఫీగా సాగనీయదు.

రేణుక ఈరకం ఆలోచనలతో ఓరోజు భర్త సమక్షంలో కబుర్లలో ఉండగా—"మీకో విషయం చెప్తాను....నన్ను క్షమిస్తారా?" అంది మెల్లగా.

మధుసూదనం ఆశ్చర్యంలా మొహం పెట్టాడు.

"మీ కల్మషాన్ని మీరు కడిగేసుకుని ఎంతో స్వచ్ఛంగా అయ్యారు. ఎంతో ఉన్నతమైనవారుగా నా దృష్టిలో ఎదిగిపోయారు. నేనుకూడా నా కల్మషాన్ని బహిర్గతం చేసి నిర్మలత్వం నింపుకోవాలనుకుంటున్నాను...."

రేణుక చెప్తోన్నదీ—చెప్పబోయేదీ అర్థం కావడంలేదు మధుసూదనానికి. అయోమయంగా చూస్తూ వుండిపోయాడు.

రేణుక అతని ముఖకవళికల్ని పట్టించుకోవడంలేదు. తన ధోరణిలో తను చెప్పుకుపోతోంది—

"మంచీ-చెడూ, తప్పూ-ఒప్పూ మనుషులం కనుక మనల్ని అంటిపెట్టుకునే వుంటాయి. అందులో ఒక వయసు మరీ ముందూ వెనుక చూపులు లేకుండా ఉరకలేస్తుంది. అలాంటి వయసులో ఎందుకు చేసానో ఎలా చేసానో తెలియకుండా ఓ తప్పు చేసేశాను. అది అజ్ఞానమో—అమాయకత్వమో మరి నాకిప్పటికీ అంతుపట్టదు.

హైస్కూలు వదిలి కాలేజీ కొచ్చిన రోజుల్లో మాటలూ—మనసూ కొంటెతనానికి దారులు వెతుక్కునేవి. ఆడా—మగా మధ్య ఆకర్షణకు అంకురం వేసే సమయం అది.

నాతో చదివే ఓ అబ్బాయి....పేరు రాజు....తెల్లగా....పొడుగ్గా చలాకీగా మాట్లాడుతూ కవ్విస్తూ నవ్విస్తూ ఉండేవాడు. అతనితో మాట్లాడటం—అతనితో కల్సి నడవటం తమాషాగా ఉండేది.

కాలేజీ వదలగానే ఇంటివరకూ కూడా వచ్చేవాడు. అతనలా వెంటపడి వస్తూంటే అదో రకమైన గర్వం-ఆనందం మనసుని ఊపేసేవి.

ఒకమాటు ఇంట్లో వాళ్ళందరూ పెళ్ళికి వెళ్ళారు. సాయంకాలానికి వచ్చేస్తారు కదా అని క్లాసులు చెడిపోతాయని నేను మాత్రం వెళ్ళలేదు.

కాని ఆరోజు మార్నింగ్ క్లాసులు అవ్వగానే కాలేజీకి సెలవు ఇచ్చేశారు. యథాప్రకారం ఇంటివరకూ నవ్వుతూ—నవ్విస్తూ రాజుకూడా వచ్చాడు.

"ఇవాళ కాఫీకి వస్తున్నాను!"—రాజు అన్నాడు ఇంటిని సమీపించగానే.

"రండి!" అప్రయత్నంగా అనేశాను.

"నిజంగా?" రాజు అడిగాడు.

ఇంట్లో ఎవరూ లేరు....పైగా లోన్గా వుంది....రమ్మంటే నేం అనిపించింది, అలా అనుకోగానే—"అబద్ధంగా కూడా రమ్మంటారా?" అనడిగాను నవ్వుతూ....

రాజు నావెనుకే ఇంట్లోకి వచ్చాడు.

నేను కాఫీ తీసుకొచ్చాను.

కబుర్లు మొదలయ్యాయి....కవ్వింపులు మొదలయ్యాయి.

"ఆ కవ్వింపు....ఆ కవ్వింపు...."-రేణుక చెప్పటం ఆపేసింది.

మధుసూదనం కనుబొమలు ముడిపడ్డాయి. అతని హృదయం అదోలా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

రేణుక మళ్ళీ మొదలు పెట్టింది—"రాజు వెళ్ళిపోయాడు - అతను వెళ్ళాక ఇలా జరిగిపోయిందేమిటన్న ఆలోచన వచ్చింది. ఏమైనా ఎంతాలోచించినా జరిగిపోయింది....అంతే!....జరిగిన విషయం ఎవరికైనా చెప్పాలా!....చెప్పి ఏం చేయాలి అన్న ఆలోచన నాకసలు రాలేదు. నెల తర్వాత పరీక్షలు అయిపోవటం ఎవరి దార్ని వాళ్ళు వెళ్ళిపోవటం జరిగింది.

రాజుతో కలసి చేసిన తప్పు ఒక రోజు ప్రొద్దుటే తన ఉనికిని తెలియ చేసింది. ప్రొద్దుటే లేచి బాత్ రూమ్‌కి వెళ్ళబోతే తల తిరిగి నట్లయ్యింది. నాకు భయం వేసింది. కాని ఏంచేయాలి?.

ఎంత దాచాలన్నా దాగని తప్పది.... అమ్మకీ నాన్నకీ, తెల్సి పోయింది. అమ్మ ఏడ్చింది—నాన్నగారు ఇల్లెగిరి పోయేలా అరిచారు. మరో నిముషం తర్వాత మరింత అల్లరవుతుందని గాబోలు నోరుని అదుపు చేసుకున్నారు.


మరో వూళ్ళో నా తప్పుని పిండెగానే తుంచేసే ఏర్పాటు చేశారు.

ఆ పీడకలని సమాధి చేసి మీతో మధురమైన కలకు పునాది వేసుకున్నాను. సుఖాల కోసం ఆరాట పడటం — ఆ వేళ పడటం ఎంత అవివేకమో అనిపిస్తుంది. మొన్నటి మీ సంఘటన విన్న తర్వాత అంతా ఒక భ్రమ అనిపిస్తుంది. నాకు మీ క్షమార్పణ కావాలి. మీ క్షమలో నేను పునీతమవాలి. ఏమంటారు?"—రేణుక భర్త ముఖంలోకి చూస్తూ వుండిపోయింది.

మధుసూదనం సమాధానం చెప్పలేదు.

○ ○ ○ ○

"అలాంటి దాన్తో నేనెలా కాపురం చేయగలను చెప్పండి లాయరు గారూ!....ఒకసారి తప్పుచేసిన ఆ ఆడది మరోసారి తప్పు చేయకుండా ఉంటుందా? అందుకనే, అందుకనే నాకామె నించి విడాకులు కావాలి లాయరు గారూ!"—మధుసూదనం భార్య చెప్పిన కథ మాత్రమే లాయరుకి చెప్పి ఆయన జవాబు కోసం ఆతృతగా ఎదురు చూడ సాగాడు. ■



కొత్త పుస్తకంతో కొంతసేపు

"మెహబూబ్ జిందాబాద్"

'చార్‌మినార్'-

నెల్లూరి కేశవ స్వామి కథల సంపుటి

ప్రత్యూష ప్రచురణ

హైదరాబాదు

170 పేజీలు - ఎనిమిది రూపాయలు

"మూసీనది ముతక శృంగారాన్నీ పాపకర్మలాన్నీ మౌనంగా దీనంగా మోసుకు పోతూ వుంటుంది.... ముసలి గద్ద చార్మినార్ మీద గత వైభవాన్ని తలచుకుని మూలుగుతూ 'మోసం'! అని అరుస్తుంది.'

అయినా యౌవనం తగ్గలేదు, లావణ్యం తగ్గలేదు; మెహబూబ్ జిందాబాద్! ఫ్యూడల్ రహస్యాలు నేటికీ దాచుకున్న పుంద్రేక్షు కోదండం హైదరాబాద్!"

అంటాడు బాల గంగాధర తిలక్, తన 'నగరం మీద ప్రేమగీతం'లో.

కేశవ స్వామిగారి కథల సంపుటిలో- స్వాతంత్ర్య పూర్వం, స్వాతంత్ర్యం వచ్చిన కొత్తల్లో, ఆ తర్వాతా హైదరాబాద్ నగరం మీద ప్రేమగీతాలు, విరహ గీతాలు, విషాదగీతాలు ఆలపిస్తూ- ఆ ఫ్యూడల్ రహస్యాల పుంద్రేక్షు కోదండాన్ని విరిచి వివిధ రసాలు పిండుతున్నారు; రహస్యాలు వివరిస్తున్నారు.

ఇందులో వున్న పదకొండు కథలూ కూడా హైదరాబాద్ నగరం నేపథ్యంగా రాసినవే. ఇంకో విశేష మేమిటంటే ఇవన్నీ కూడా ప్రధానంగా ముస్లింల కథలు. అసఫ్ జాహీ నవాబుల కాలంనుంచి ఈ నాటిదాకా వివిధ దశల్లో—హైదరాబాద్ నగరంలోని ముస్లిం ప్రజల జీవిత చిత్రాలివి.

ప్రతి రాజ్యానికి, ప్రాంతానికి, జాతికి, మతానికి ప్రత్యేకమైన సంస్కృతి వుంటుంది. అయితే పాలకుల సంస్కృతి వేరు; పాలితుల సంస్కృతి వేరు. ఫ్యూడల్ వ్యవస్థతో పాలకుల సంస్కృతే ప్రచారంలో వుంటుంది. ప్రబలంగా వుంటుంది. ఈ సంస్కృతినే చిత్రిస్తూ, అందులో భాగస్వాములయిన నవాబులూ, నవాబు సాహెబులు, బేగం సాహెబాలూ, దుల్హాన్ పాషాలూ, వారి అనుచరులు, ఆశ్రితులు, భృత్యులు, పరిచారకులు పాత్రలుగా, ఆసక్తికరంగా, అతి సహజంగా కేశవ స్వామిగారి కథలు రాశారు.

ఈ కథల్లో ఇంకో విశేష మేమిటంటే- పరాయి మతాన్ని, పరాయి సంస్కృతిని, పరాయి వారి అలవాట్లని, ఆచార వ్యవహారాలని తక్కువగా చూడటం గాని, వెక్కిరించడం గాని, హేళన చెయ్యటం గాని ఎక్కడా లేదు. పైగా ఆ సంస్కృతి

పట్ల, ఆ అలవాట్ల పట్ల, ఆచారాల పట్లా సదవగాహన వుంది; సానుభూతి వుంది; సద్విమర్శ కూడా వుంది. మతం పేరుతో మనుషులింకా కొట్టుకు చస్తున్న 'ఈ రోజుల్లో-మంచి తనాన్ని, మానవత్వాన్ని మించిన మతం లేదని చెప్తున్నాయి కథలు.

ముస్లిం పాత్రలతో, ముస్లిం జీవితాన్ని చిత్రిస్తూ, ఇప్పటి దాకా తెలుగులో కథల్లోనూ నవలల్లోను, నాటకాల్లోను - సహజంగాను సక్రమంగాను వున్నవి చాలా తక్కువ. 'చార్మినార్' కథల్లో ఈ లోపం కనబడదు. కేశవస్వామి గారు- పాఠకుల్ని ఎకా ఎకీ-ఆనాటి అంతఃపురాల్లోకి, దేవిడీల్లోకి, దివాన్ ఖానాల్లోకి కోఠీల్లోకి, మెహబూబ్‌కి మెహందీల్లోకి, నాటి హైదరాబాద్ నగరంలోని మూరు మూల పేటల్లోకి, వీధుల్లోకి-చెయ్యి పుచ్చుకు మరీ తీసుకెళ్ళి, తిప్పి చూపిస్తున్నారు. మన చేత ముఖమల్ కుర్తాలు, మాడిదార్ పైజామాలు, షల్వార్లూ, కమీజులు, దుపట్టాలు, జలతారు చమ్కీలు ధరింప చేస్తున్నారు. ఖీమా పరాటాలు, ఖుష్కాలు, ఖూబానికా మీఠాలు, చాయ్ షర్బత్తులు, తినిపిస్తున్నారు, తాగిస్తున్నారు; ఇంకా ఆ కాలంనాటి అనేక అందాలు, వింతలు విచిత్రాలు, వినోదాలు, విపరీతాలు అతి సహజంగా ఆవిష్కరిస్తున్నారు.

'తెలుగు వాళ్ళ తెలివిలేని తనం ధోవతి కుచ్చెళ్ళతో పాటు మోటుగా, ఎం. ఎల్. ఏ క్వార్టర్స్ దగ్గర ఎబ్బెట్టుగా జీరాడుతుంది,' (తిలక్) అని విచారిస్తూ, తెలుగు ప్రజల రాజధానిగా మారి పాతికేళ్ళు గడిచినా హైదరాబాద్‌లో తెలుగు సంస్కృతి కనబడ్డం లేదని మొత్తుకుంటున్న మన వాళ్ళకి - మన మెరగని మరో హైదరాబాద్‌ని, మరుగున పడిపోతున్న మరో సంస్కృతిని కాలపు తెరలు కదిలించి కళ్ళకి కట్టినట్టు చూపిస్తున్నారు.

ఇందులో 'యుగాంతం' అన్నది హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనాంతాన్ని చక్కగా చిత్రీకరించిన కథ. 'విముక్తి' 'కేవలం మనుషులం' ఈ రెండు కథలు పాతుకు పోయిన అనాచారాలని, మూఢ విశ్వాసాలని దుస్సంప్రదాయాలని కూకటివేళ్ళతో పెళ్ళగించి పారెయ్యడానికి ప్రయత్నించినవారి కథలు. 'షరీఫా' 'కన్నెరికం'-కంట తడి పెట్టించే కథలు. 'ఆఖరికానుక' లో ఆఖరి ఘట్టం కృత్రిమంగా అనిపించినా, హైదరాబాద్ నగరంలోని ముస్లింల్లో అమాయకపు ఆడపిల్లలనేక మంది ఆకలి బాధకి తట్టుకోలేక గల్ఫ్ దేశాల ధనవంతులకి అమ్ముడు పోవడాన్ని చిత్రిస్తుంది.

కథారచన పటిష్టంగా లేకపోవడం, సన్నివేశాలు సంఘటనలు కేవలం కల్పితంగా కృత్రిమంగా అనిపించడం- ఈ లోపాలీ సంపుటిలోని కొన్ని కథల్లో వున్నాయి.

'చార్మినార్' అన్నది సంపుటికి సముచితమైన పేరు.

-రాంబాబు

> **నవలలకు, కథలకు, మినీలకు, గేయాలకు, కార్టూన్లకు**
>
> **చిరు గమనిక :**
>
> **మీ** రచనల బరువును చూసుకుని మరీ పంపించండి. పోస్టేజి బేరింగు డ్యూలఇబ్బందివుండదు ఉభయులకూ! పోస్టేజి జత పరచని రచనలు తిప్పి పంపే విషయంలో మా పూచీ లేదు సుమా! రిజిష్టర్డు పోస్టులో వచ్చిన రచనలకే బాధ్యులం - మీ రచనలు, ఉత్తరాలూ 'ఎడిటర్' పేరనే రాసి పంపండేం.

నేనూ - నా పాత్రా

గోపీచంద్రుడి వెన్నెల కిరణాన్ని ఒకటి ప్రత్యేకించి వారి 71వ జన్మదిన సందర్భంగా ప్రసరింపచేస్తున్నాము.

ఒకరోజు రాత్రి నేను కన్ను మయ్యగానే నా కథల్లోని ఒక పాత్ర వొచ్చి నన్ను లేపింది.

నేను నిద్రమొహంతోనే, "ఏమిటి, ఇప్పుడొచ్చావ్?" అని అడిగాను.

నా పాత్ర దిక్కుమొహం పెట్టుకొని, "నన్నిట్లా చెయ్యటం మీకు న్యాయంకాదు. నన్ను సృష్టించి, నా కథంతా రాయకుండా, మధ్యలో విడిచిపెట్టటం మీకు న్యాయంకాదు. మీ రెప్పుడూ నన్నిట్లాగే చేస్తున్నారు" అన్నది.

"నేను రాసేది నీ కథకాదు! నేను రాసే కథల్లోకి కావలసిన అంశాలు నీ జీవితంలోంచి తీసుకుంటాను. మిగిలిన నీ జీవితం నా కనవసరం. నా చదువరునకు అనవసరం. వెళ్ళు, నీ జీవితం రాయించుకోవాలని వుంటే ఈ వూళ్ళో చాలామంది కథకులు వున్నారు. వాళ్ళ దగ్గరకు వెళ్ళు" అని మళ్ళీ నిద్రపోయాను.

ఇంతవరకు ఆ పాత్ర మళ్ళీ నామీద కంప్లెయింట్ చెయ్యలేదు.

గోపీచంద్

పెద్ద చేప

మోదుకూరి జితేంద్ర శర్మ

బ్యాంక్ మేనేజర్ గొంతు వినయంగా పలికింది ఫోన్‌లో.

"వాట్ కెన్ అయ్ డూ ఫర్ యూ సర్?"

"చిన్న ట్రబుల్" అన్నాను. వీలైనంత విచారం గొంతులో ధ్వనింపజేస్తూ "చెక్ బుక్ డ్రాయర్ తాళం యింట్లో మర్చిపోయాను. పార్టీలు వచ్చారు. డబ్బు కట్టాలి. గుమాస్తాని పంపుతున్నాను, లెటర్‌తో. డబ్బు పంపండి. రేపు చెక్ పంపుతాను. యివేళ మరి యింటికి వెళ్ళి తాళం తెప్పించే సమయంలేదు. మరో అరగంటలో మూసేస్తారు మీరు. సారీ ఫర్ ది ట్రబుల్."

"దానికేముంది సర్! అలాగే పంపండి. రేపటి చెక్ మీద యివేళటి తేదీ వెయ్యడం మర్చిపోకండి." అన్నాడతను.

"చాలా థాంక్స్! ఈసారి మంచి పార్టీ యిస్తాను మీకు" అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

గిరి సందేహంగా నావైపు చూస్తున్నాడు.

"ఓకే గిరి. పది నిమిషాలాగి వెళ్ళు." అన్నాను.

యిద్దరం ఎదురుగా ఉన్న కాఫీబార్‌లో దూరాం.

ఆ ఫోన్ నిజంగా నా పేరు మీద చెయ్యలేదు. నేను 'పూనా' లోని ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త తిర్పుడే పేరుమీద చేసేను. తిర్పుడే దగ్గిర పనిచేశాను కనక తిర్పుడే పేరు ప్రఖ్యాతులు నాకు తెలుసు. తిర్పుడేతో బిజినెస్ చాలా ముఖ్యం కర్వేరోడ్‌లో ఉన్న ఆ బాంక్‌కి, పూనాలో చాలా బాంక్‌లకు యిది అలవాటే. వారికి ముఖ్యమైన కష్టమర్లకి యిటువంటి సహాయాలు చేస్తారు వాళ్ళు. లెటర్ పంపకుండా ఫోన్ మాటమీదే డబ్బుయిస్తారు తిర్పుడేకి. కానీ నేనేం ఛాన్సెస్ తీసుకోదలుచుకోలేదు.

పది నిముషాలు గడిచేక గిరి వెళ్ళాడు ఆ బాంక్‌కి. డక్కన్ జిమ్‌ఖానా నుంచి కర్వేరోడ్‌లో ఉన్న ఆ బాంక్‌కి ఆటోలో అయిదు నిముషాల ప్రయాణం సుమారుగా. టైమ్ ఫాక్టర్‌ని అమలు పరచటం మరిచిపోలేదు నేను.

నలభై వేల రూపాయలు కావాలి అని తిర్పుడే రాసినట్లుగా ఓ ఉత్తరం టైప్ చేసి గిరిచేత పంపాను. ఫోన్ చెయ్యకుండా ఒక్క ఉత్తరమే పంపితే బాంక్ మేనేజర్‌కి అనుమానమొచ్చి క్లారిఫికేషన్ కోసం తిర్పుడేకి ఫోను చేయవచ్చు. అందుకని ముందుగా ఫోన్ చేసేను.

డైరీ

నా సుందరమైన డైరీలో
మున్నూటా అరవై ఐదు
దుఃఖాలు..........

విద్యారణ్య కామ్లేకర్

అతని కంపెనీలో పనిచేస్తున్నపుడు తిర్పుడేకి ఈ విధంగా చాలాసార్లు నాచేత డబ్బులు తెప్పించుకొనేవాడు. అది యిపుడు నాకు బాగా ఉపయోగించింది.

బాగా ఆలోచించి ఓ పథకం వేస్తే సాగని దేదీ లేదీ ప్రపంచంలో.

అరగంట వెయిట్ చేసాక గిరివచ్చాడు. నవ్వు ముఖంతో. గిరి మొఖం చూస్తూనే పోల్చేసేను వెళ్ళిన పని సవ్యంగా జరిగి పోయింది అని. వెంటనే ఆటో ఎక్కి ముందు వాలో ఉన్న నా రూంకి వెళ్ళి పోయేను. తిర్పుడే కంపెనీ శాంబే-పూనా రోడ్‌లో ఉంది. దార్లో రెండు ఆటోలు మారేం.

యింటికి వెళ్ళాక గిరితో అన్నాను. "యీ గడ్డం మీసం తీసేయ్. క్రాఫ్ బాగా దగ్గిరగా చేయించుకో. క్విక్."

"నా డబ్బులో!" అన్నాడు గిరి చెయ్యి చాపుతూ.

నాలుగు వేల రూపాయలు లెక్కపెట్టి యిచ్చాను గిరికి. మిప్పై ఆరువేల రూపాయలు యిపుడు నాకు లాభం.

రేపు తిర్పుడే ముఖం చూడాలి బాంక్ మేనేజర్ చెక్ కోసం కబురు చేసినపుడు.

బాస్టర్డ్!

కసి తీర్చుకున్నాను యిన్నాళ్ళకి తిర్పుడే మీద.

సంతకాలు, తమాషాగా ఉన్న సంతకాలు ప్రాక్టీస్ చెయ్యడం ఓ హాబీ నాకు. తిర్పుడే సంతకం ప్రాక్టీస్ చేస్తూ తిర్పుడేకి దొరికి పోయాను. అతని కంపెనీలో పని చేస్తున్నపుడు.

అపుడేం అనలేదు. చిన్నగా మందలించి ఊరుకున్నాడు.

రెండు రోజులు తరువాత సోంవార్ పేట్‌లో ఉన్న నా రూంకి వచ్చారు పోలీసులు. ఫోర్జరీ నేరం కింద అరెస్ట్ చేసారు.

సంవత్సరంన్నర క్రితం జరిగింది ఆ సంఘటన.

ఏం జరిగిందో తరువాత కోర్ట్‌లో అర్థం అయింది.

నేను సంతకాలు ప్రాక్టీస్ చేస్తున్నపుడు తిర్పుడే మెదడులో వెలిగి ఉండాలి ఆ ఉపాయం. పాతిక వేల రూపాయలకు ఓ చెక్ రాసి నా చేత తెప్పించేడు డబ్బుని. మరునాడు తన చెక్ బుక్‌లో ఓ ఫోలియో పోయిందని, ఆనర్ చెయ్యవద్దనీ బాంక్‌కి రిపోర్ట్ చేసేడు. బాంక్ మేనేజ్‌మెంట్ వెంటనే నా మీద పోలీస్ కంప్లెయింట్ చేసేరు. కోర్టులో నేను సంతకాలు చేసిన రఫ్ పేపర్ సబ్‌మిట్ చేసేడు ఎవిడెన్స్ క్రింద పబ్లిక్ ప్రాసిక్యూటర్. నాచేత తిర్పుడే సంతకం చేయించాడు. కోర్టులో నేరం ఋజువు అయిపోయింది.

సంవత్సరం శిక్ష పడింది నాకు. డబ్బు కట్టలేక పోయినా మొదటి తప్పిదం కనుక తక్కువ శిక్ష వేస్తున్నానని మందలించి పంపేశాడు జడ్జి.

జైల్ నుండి బయటికి వచ్చాక, ఉద్యోగం కోసం తిరుగుతుంటే ఆ ఆలోచన స్ఫురించింది.

తన లాభం కోసం నన్ను ఎరగా ఉపయోగించుకున్నాడు తిర్పుడే. అతనికి గుణపాఠం ఎందుకు చెప్పకూడదు.



ఎస్! ఎందుకు చెప్పకూడదు?

తిర్పుడే సంతకం నాకు కొట్టిన పిండి. అయితే నేరం జరిగిన వెంటనే పోలీసులు నన్ను అనుమానిస్తారు కనక ఎలిబీ చూసుకోవాలి నేను.

బాంబేదగ్గర కళ్యాణ్‌లో నాచిన్నాన్న

కొడుకు ఉన్నాడు. వాడి దగ్గరకు ఉదయం డక్కన్‌లో వెళ్ళాను. తొమ్మిదికి కార్లో తన కంపెనీకి వెళ్ళిపోతాడు. ఆవేళంతా ఉంటానని చెప్పి వెళ్ళిపోయాక మళ్ళీ వెనక్కి పూనా వచ్చేశు.

గిరిని పోలీసులు ట్రాప్ చేసి పట్టుకొన్నా, నా సంగతి తెలీదు గిరికి. అందుకని గిరిని యిన్ఫర్మేషన్ లాగలేదెవరూ!

గిరిని పంపేశాక మళ్ళీ కళ్యాణ్ వెళ్ళిపోయాను. రాత్రి ఎనిమిదింటి వరకూ మా చిన్నాన కొడుక్కి తెలీదు. ఆ మధ్య కాలంలో నేను ఏం చేసినది అయినా చెప్పాలి. చెప్పేస్తే కావలసిన ఎలిబీ వాడిస్తాడు.

తిర్పుడే మీద కసి తీర్చుకున్నానన్న సంతృప్తితో వెళ్ళిపోయాను కళ్యాణ్.

రాత్రి వాడు రాగానే చెప్పాను. జరిగిందంతా.

"నీక్కావలసిన ఎలిబీ నేను యిస్తాను. భయపడక!" అన్నాడు.

అప్టరాల్ - ఈ ప్రపంచం అంతా పెద్ద చేప-చిన్న చేపని తింటూ బ్రతుకుతోంది.

ఆ రాత్రి సంతృప్తిగా నిద్రపోయాను.

o o o

వారంరోజులు గడవక ముందే వచ్చారు పోలీసును నన్ను వెతుక్కుంటూ.

కళ్యాణ్‌లోని నా చిన్నాన కొడుకు గదిలో పడుకున్నాను అదే సమయానికి.

ముప్ఫయారువేల రూపాయలూ యింకా ఖర్చు పెట్టలేదు. ఒకవేళ ఆ నోట్ల నెంబర్స్ ఆ బాంక్ వాళ్ళు గుర్తుపెట్టుకొన్నారేమో అన్న భయంతో.

తలుపు మీద టక టక మని శబ్దం అవుతుంటే నా చిన్నాన కొడుకేమోనని తలుపు తీసి, పోలీసుల్లను చూసి ఆశ్చర్య పోయాను.

నన్ను అరెస్ట్ చేసి ఆగదంతా సోదా చేసేరు. చాలా సులువుగానే దొరికి పోయింది ఆ డబ్బు.

స్టేషన్‌లో యిన్‌స్పెక్టర్ అడిగాడు ఆ డబ్బు లెక్క పెట్టాక.

"మిగిలిన తొంభై వేలు ఏంచేసేవ్?"

ఆశ్చర్య పోయ్యాను. "తొంభై వేలా?"

"అవును. గుప్తే పేరుమీద ఫోర్జరీ చేసి బాంక్‌లోంచి విత్‌డ్రా చేసిన లక్షా, యిరవై అయిదు వేలలో మిగిలిన ఎనభై తొమ్మిది వేలు రూపాయలు. ఏం చేసేవ్? ఎక్కడ దాచేవ్?"

కొద్ది కొద్దిగా అర్థమవు తోంది నాకు.

తిర్పుడే పేరు మీద నేను ఫోర్జరీ చేసి ఉండాలి, ఆ నేరం నా మీదకి ఎలా వచ్చిందో అంతు పట్టలేదు.

"నేను ఫోర్జరీ చెయ్యలేదు. అసలు గుప్తే ఎవరో నాకు తెలీదు." అన్నాను నీరసంగా.

"సరే! నీకు గుప్తే తెలియదు. ఈ డబ్బెలా వచ్చింది నీకు?" అడిగాడు.

సమాధానం చెప్పలేరు నేను. తిర్పుడే సంతకం ఫోర్జరీ చేస్తే ఆ డబ్బు నా దగ్గర ఉందని చెప్పలేను కనుక.

"ఎలా వచ్చాయ్!?" గద్దిస్తూ అడిగాడు.

"లాటరీలో" అప్రయత్నంగా అన్నాను

"అబద్ధం." గట్టిగా అరుస్తూ ఒళ్ళ మీద కొట్టాడు ఆ ఇన్‌స్పెక్టర్. "గుప్తే పేరు సంతకం ఫోర్జరీ చేసి లక్షా యిరవై అయిదు వేలు కాజేసేవ్ నువు. ముందుగా గుప్తే ఫోన్ చేసినట్లు చేసి, తరువాత లెటర్ పట్టుకొని వెళ్ళి డబ్బు తీసుకున్నావ్! గుప్తే అలవాటు అది. ఆ! నీకు తెలుసు. బాంక్ వాళ్ళకూ అది మామూలే. ఆ బాంక్‌కి చాలా ముఖ్యమైన కస్టమర్ గుప్తే కనుక నిన్ను అను మానించక యిచ్చేసేరు డబ్బుని తరువాత గంటకి గుప్తే వెళ్ళాడు ఆ బాంక్‌కి. అపుడు తెలిసింది ఆ లెటర్ గుప్తే పంప లేదని, ఆ బాంక్‌ని నువు మోసం చేసేవని, నీ వివరాలు కేషియర్ చెప్పారు. ఎక్కడ మిగిలిన సొమ్ము?"

తత్తరపాటుతో సమాధానం చెప్పలేదు నేను.

"లేదు. నాకు తెలీదు." అయోమయంగా.

"నీలాటివాళ్ళు ఎలా చెప్తారో నాకు తెలుసు" అన్నాడు లాఠీ పట్టుకొని లేస్తూ.

సుమారు రెండు గంటలసేపు నానా రకాలుగా హింసించాడు నన్ను. చివరికి సెల్‌లో కూలేశారు.

o o o

రెండు రోజుల ప్రొసీడింగ్స్ తరువాత అయిదు సంవత్సరాల శిక్ష విధించేసు జడ్జి కోర్ట్‌లో.

బాంక్ క్లర్క్ చెప్పాడు నన్ను గుర్తించి, ఆవేళ నేనే గుప్త పేరు మీద ఆ డబ్బు విత్‌డ్రా చేసినట్లు.

నాకు ఎలిబీ మా చిన్నాన కొడుకు యివ్వలేదు. ఒంటరిగా ఆవేళ రూంలో వదిలేసి బాంద్రా వెళ్ళేనని ఆ సమయంలో నేనేంచేసినా తనకు తెలీదని అన్నాడు కోర్టులో.

తిర్పుడే సంతకం ఫోర్జరీ చేసి ఒకసారి అరెస్ట్ అయాను కనుక నేనే నేరం చేయ లేదన్నా నమ్మలేదు జడ్జి.

నెలరోజులు గడిచేయ్ జైల్లో.

ఓ రోజు చిన్నాన కొడుకు వచ్చాడు నా దగ్గరికి.

"మన గ్రామం వెళ్ళి పోతున్నాను. అక్కడ ఓ చిన్న ఇండస్ట్రీ పెట్టాలనుకుంటున్నాను" అన్నాడు మాటల్లో.

"డబ్బు ఎక్కడిది?" అడిగాను.

"నిజానికి నీకు చెప్పాలి థాంక్స్. నాకో చక్కని ఆలోచన యిచ్చినందుకు." అన్నాడు, చిన్నగా నవ్వుతూ.

"నాకా? థాంక్స్? ఎందుకూ?" అడిగాను.

"అవును, తిర్పుడే సంతకం ఫోర్జరీ చేసి బాంక్‌లో డబ్బు కొట్టేసిన నీ విధానం బాగా నచ్చింది నాకు. సాధారణంగా బొంబే, చుట్టుపట్ల ఉన్న యిండస్ట్రీ ఓనర్సందరికీ అదే అలవాటు ఉంటుంది.

నీకు తెలీదు నేను గుప్తే దగ్గర పని చేస్తున్నట్లు, అతని సంతకం అనుకరించే అలవాటున్నట్లు. గుప్తే సంతకం నాకు కొట్టిన పిండి. అంత వరకూ, అంటే నువు నీ నేరం చెప్పేవరకు నాకు ఆ ఆలోచన లేదు. వచ్చిన తరువాత ఆలోచన చేయలేదు. అయితే నేరం నా మీదకి రాకుండా ఉండేందుకు నిన్ను ఎరగా ఉపయోగించ వలసి వచ్చింది. అందుకు బాంక్ కేషియర్‌కి కొంచెం లంచం యిచ్చేను, నీమీద నేరం ఋజువు పరిచేందుకు. నీకు చాలా థాంక్స్.—నిజానికి నువు ఆ ఆలోచన చెప్పకుండా ఉండి ఉంటే అసలు నా దగ్గరకు రాకుండా ఉండి ఉంటే, ఎప్పటికీ ఓ యిండస్ట్రీ ఓనర్‌ని కాలేక పోయివుందును జీవితంలో."

నాకు కోపం ఆగలేదు. చటుక్కున చేతులు కటకటాల్లోంచి చాపి వాడి పీక అందుకోబోయేను.

నా ఉద్దేశ్యం గ్రహించినట్లు ఒక అడుగు వెనుక్కు వేసేడు. "వద్దు. ఆ ఆలోచన మంచిది కాదు.. శిక్ష పూర్తయ్యేక రా! ఉద్యోగం ఇస్తాను నా ఫేక్టరీలో. అప్టరాల్ ప్రపంచం అంతా చిన్న చేపని పెద్దచేప మింగడం అనే దోపిడి సూత్రంమీదే నడుస్తోంది కదా" అన్నాడు.

వెళ్ళిపోయాడు, నన్ను వదిలేసి. ■

సినిమా

మరో కురుక్షేత్రం

వి. ఆర్. కాలేజీలో ఎన్నికల హడావుడి....రకరకాల పార్టీల ప్రతినిధులు పాల్గొంటున్నారు ఆ ఎన్నికల్లో. అయితే డబ్బులు వెదజల్లి, చీప్ ట్రిక్‌లు ప్లే చేసిన పార్టీయే గెలిచింది ఎన్నికల్లో. విద్యార్థి దశలో కూడా చీప్ ట్రిక్‌లు, డబ్బులే రాజ్యం చేస్తున్నాయ్! ఈ పరిస్థితిని 'ఎదుర్కోవడం ఎలా? అన్న ప్రశ్నతో ప్రారంభమౌతుందీ సినిమా.

ఈ ప్రశ్నకు సమాధానం సినిమా చివర్లో దొరుకుతుంది. కమ్యూనిజానికి చెందిన వివిధ వర్గాలు కలిసి పనిచేయాల్సిన అవశ్యకతను నొక్కి చెప్తూ -ఒక బలమైన సందేశంతో ముగుస్తుంది ఈ సినిమా.

ఇందులో భారతి (శారద) పాత్ర ఎంతో చక్కగా మలచబడింది. మాక్సిం గోర్కి 'అమ్మ' లోని తల్లి పాత్రని గుర్తు చేస్తుందీ పాత్ర.

ఈనాడు పోరాటంలో జరుగుతున్న లోపాల్ని సవరించటానికి, స్వాతంత్రోద్యమంలో జరిగిన పోరాటాన్ని భరత్ (మాదాల రంగారావు) పాత్రద్వారా కళ్ళ ముందుకు తెచ్చారు దర్శకులు లెనిన్.


సినిమాలో "నటన" పరంగా పూర్తిగా ఫెయిల్ అయ్యింది నూతన్‌ప్రసాద్ ఒక్కడే.

ఇక సాంకేతికంగా....ఎడిటింగ్ చాలా పూర్‌గా వుంది. "Juxta Position" Dubbing ల విషయంలో చాలా దారుణంగా ఫెయిల్ అయ్యారు ఎడిటర్ అదుర్తి హరనాధ్. కెమెరా వర్క్ కూడా అంతే. అందుకే సినిమా "6 C' S"ల విషయంలో పూర్తిగా వీక్‌గా నడిచింది. అయినా సినిమా బాగుండటానికి కారణం బలమైన సందేశం, కొన్ని చక్కటి పాటలు, అనుభవంవున్న నాగభూషణం, శారద,



'సిసింద్రీ - చిచ్చుబుడ్డి బేబీ ఇందిర'

జ్యోతి



శ్యాంప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ "డబ్బు" చిత్రంలో ప్రభ



"ధర్మవడ్డీ" లో నూతన్ ప్రసాద్, సాయిచంద్, రత్నగౌడ్

మాదాల రంగారావ్, ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న భానుచందర్, సాయిచంద్ లు చక్కగా నటించడమే.

హైదరాబాద్ లో...

"వామపక్ష శక్తులన్నీ ఏకమైన సమ సమాజం వస్తుంది - ఆ శక్తులన్నీ ఏకమయ్యే వరకు నేను చిత్రాలు నిర్మిస్తూనే వుంటాను"

—దర్శకుడు లెనిన్ బాబు

"సినిమా మీడియం ప్రజాశ్రేయస్సుకు ఉపయోగిస్తేనే లక్ష్యం నెరవేరుతుంది. సినిమాలో సమస్యను చర్చించటం కన్నా పరిష్కారం చెప్పటమే ముఖ్యం - అదే ఈ చిత్రం చూపించింది"

సభాధ్యక్షులు: డా॥ రాజబహుదూర్ గౌడ్

....హోటల్ సరోవర్ లో సెప్టెంబర్ ఆరో తేదీన మరో కురుక్షేత్రం విడుదల సందర్భంగా పత్రికా ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో అక్కడ మాట్లాడినవీరితో బాటు మాదాల రంగారావు, శ్రీ జి. ఎన్. వరదాచారి, ఎ. ఎస్. ఆర్. శాస్త్రి, హనుమంతరావు, వి. వెంకటరావు, తోటకూర ఆశాలత, సాయిచంద్, కృష్ణ ప్రసంగించారు.

శ్రీ హనుమంతరావు స్వాగతంతో ఆరంభమై అసభ హరికృష్ణ వందన సమర్పణతో పూర్తయింది.

—పి. రామకృష్ణ

Edited & Published by V. Leelavathy Raghavaiah. at 1-8-4/1/1 Chikakdpalli. Hyderabad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers. 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad–500 020


JYOTI
OCTOBER 81
Regd.no.
M 8669-4/73